# దారి దీపం

మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 2 - సంచిక 9 | జూన్ 2024 | వెల : రూ.15

మోదీ దూకుడుకు కళ్లెం పడింది

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రహాసం

మోదీ మ్యాజిక్ ఏమయింది ?

మోదీ అహంకారానికి దెబ్బ

ఎన్నికల తీర్పు.. ఒక ముందడుగు..

ఓటర్ల వేటుతో మోదీకి శృంగభంగం

పాత మోదీపై కొత్త మోదీ నెగ్గగలరా ?

మూడో అవతారంలో మోడీ సర్కార్

రాష్ట్ర రాజకీయాలకు మళ్లీ జాతీయ ప్రాధాన్యం

కాంగ్రెస్ విజయాలు, వైఫల్యాలు

ఇది బహుజనుల రాజకీయ విజయం

ఫ్రెంచ్ దర్పణంలో మోదీ భారత్

మోదీ చెప్పిన గాంధీ చరిత్రలో నిజమెంత ?

వైసిపి ఓటమి - కొన్ని కారణాలు

సంక్షేమమే సర్వస్వమా జగన్ ?

విసిగిపోయారు.. సాగనంపారు !

ప్రశ్నించడం నేర్పిన తొలి మేధావులు

అమృతకాలం కాదిది, ఆపత్కాలం!

'మర్యాదలను' బద్దలు కొట్టిన 'హస్పెండ్ స్టిచ్'

ఓటరు చైతన్యపు దిక్సూచి

జూన్ - 2024 పేజీలు : 44

# దారి దీపం మాసపత్రిక

సంపుటి : 2 - సంచిక : 9

డీవీవీఎస్ వర్మ
- సంపాదకులు
సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణమూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

ఈ సంచికలో..

1) మోదీ దూకుడుకు కళ్లెం పడింది
- సంపాదకీయం 3
2) ఆంధ్రప్రదేశ్‌లో చంద్రహాసం - సంపాదకీయం 4
3) 2024 లోక్‌సభ ఎన్నికలు - ఫలితాలు 5
4) మోదీ మ్యాజిక్ ఏమయింది? - ఎ.కృష్ణారావు 8
5) మోదీ అహంకారానికి దెబ్బ
- సురవరం సుధాకరరెడ్డి 10
6) ఎన్నికల తీర్పు.. ఒక ముందడుగు..
- 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం 11
7) ఓటర్ల వేటుతో మోదీకి శృంగ భంగం
- డివివియస్ వర్మ 13
8) పాత మోదీపై కొత్త మోదీ నెగ్గగలరా ?
- కరణ్ థాపర్ 15
9) మూడో అవతారంలో మోడీ సర్కార్
- తెలకపల్లి రవి 16
10) రాష్ట్ర రాజకీయాలకు మళ్లీ జాతీయ ప్రాధాన్యం
- యోగేంద్ర యాదవ్ 19
11) కాంగ్రెస్ విజయాలు, వైఫల్యాలు - యోగేంద్ర యాదవ్ 21
12) ఇది బహుజనుల రాజకీయ విజయం - డా.కత్తి పద్మారావు 23
13) ఫ్రెంచ్ దర్పణంలో మోదీ భారత్ - కొప్పర్తి వెంకటరమణమూర్తి 24
14) మోదీ చెప్పిన గాంధీ చరిత్రలో నిజమెంత? - రాహుల్‌కుమార్ 26
15) ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గం 28
16) ఆంధ్రప్రదేశ్ జిల్లాల వారీగా ఎన్‌డీఏ, వైసీపీ గెలిచిన స్థానాలు 29
17) వైసిపి ఓటమి-కొన్ని కారణాలు - కె.యస్.లక్ష్మణరావు 31
18) సంక్షేమమే సర్వస్వమా జగన్ ? - డి.సోమసుందర్ 33
19) విసిగిపోయారు.. సాగనంపారు ! -రాఘవశర్మ 35
20) ప్రశ్నించడం నేర్పిన తొలి మేధావులు - డాక్టర్ దేవరాజు మహారాజు 37
21) అమృతకాలం కాదిది, ఆపత్కాలం! - డాక్టర్ రవీంద్రనాథ్ సూరి 38
22) 'మర్యాదలను' బద్దలు కొట్టిన 'హస్బెండ్ స్టిచ్' - రాఘవ 40
23) ఓటరు చైతన్యపు దిక్సూచి - బొల్లినేని నాగార్జున సాగర్ 41
24) కార్టూన్స్ 43
25) కొత్త పుస్తకాల స్వీకారం 44




కార్టూన్ : సతీష్ ఆచార్య ఫేస్‌బుక్ సౌజన్యంతో..

దారి దీపం
మాసపత్రిక
మీ వివరాలను ఈ క్రింది
అకౌంట్‌కు పంపండి
**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**
మీ పేరు విరాళం వివరాలను..
డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు
నంబరుకు విధిగా
వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి.
ఫోన్ నెంబరు 93971 14495

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : DVVSVARMA.COM



సంపాదకీయం

# మోదీ దూకుడుకు కళ్ళెం పడింది

ఎన్నికలకు ముందు మోదీ మంచి జోరు మీద వున్నారు. పాత పార్లమెంట్ భవనాన్ని పక్కనబెట్టి తనదైన వికసిత నవభారత్‌కు జ్ఞాపికగా కొత్త పార్లమెంట్ భవనాన్ని నిర్మించారు. అందులో రాజ్యాంగానికి బదులు రాజదండాన్ని ప్రతిష్టించారు. ఈ ఎన్నికలలో ప్రతిపక్షాలు లేని పార్లమెంట్‌ను చూపిస్తాననుకున్నారు. తమకే 370 సీట్లు తమ కూటమికి 400కు పైగా సీట్లు వస్తాయని ప్రకటించారు. మహారాష్ట్రలో ప్రభుత్వాన్ని కూలగొట్టి డబుల్ ఇంజన్ సర్కార్‌ను తెచ్చారు. ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్ నిధులను స్తంభింపజేశారు. ఇద్దరు ముఖ్యమంత్రులను జైళ్లపాలు చేశారు. ప్రత్యర్థులపై ఈడీ, ఐటీ, సీబీఐ దాడులతో బెదిరించి లొంగదీసుకుని కాషాయ జెండాలు కప్పి కేసులు మాఫీ చేశారు.

మరోపక్క అయోధ్యలో రామాలయ నిర్మాణం పూర్తి కాకుండానే ఎన్నికల కోసం తానే బాలరాముడికి ప్రాణ ప్రతిష్ట చేశారు. దేశం అంతటి నుంచి ప్రజలు తరలి వచ్చి రామాలయాన్ని చూసి తరించడానికి వీలుగా అన్ని రకాల రవాణా సౌకర్యాలు కల్పించారు. ఈ రామాలయం దేశమంతటా ఓట్ల వర్షం కురిపిస్తుందని ప్రచారం చేశారు. దీనికితోడు దేశ ప్రజల్ని విభజించే కొత్త పౌరసత్వ చట్టాలను దేశమంతటా అమలు చేస్తామని, కొన్ని రాష్ట్రాలలో ముస్లింలలో వెనుకబడిన తరగతులకు ఇచ్చిన రిజర్వేషన్లను రద్దు చేస్తామని ప్రకటించారు.

370 సీట్లతో మూడొంతుల మెజారిటీ ఇస్తే రాజ్యాంగాన్ని మారుస్తామంటూ ప్రకటనలు చేశారు. ఇప్పటి వరకు ప్రజలు చూసింది మోదీ సినిమా ట్రయలర్ మాత్రమేనని, అసలు సినిమా ఎన్నికల తర్వాత చూపిస్తానని మోదీ ప్రకటించారు. ఓట్ల కోసం ప్రజల నిత్య జీవిత సమస్యల్ని మరుగున పర్చడానికి మందిరం, ముస్లిం, మంగళ సూత్రంలు మాత్రమే కాదు.. ఓట్ల కోసం మచిలీ, మటన్, ముజ్రాలను మోదీ ఎన్నికల ప్రచారంలో వాడుకున్నారు.

మోదీ మీడియా ప్రజా సమస్యలను పక్కనపెట్టి ఈ పదాల చుట్టూ చర్చోపచర్చలు నిర్వహించాయి. సామాజిక మాధ్యమాలు మత విద్వేష ప్రచారాన్ని టన్నుల కొద్దీ గుమ్మరించాయి. వ్రతం చెడ్డా ఫలితం.. దక్కనట్టు బీజేపీ విద్వేష ప్రచారాన్ని ప్రజలు పట్టించుకోలేదు. ప్రజల దైనందిన సమస్యల ముందు మోదీ హవా సాగలేదు. మోదీకి ప్రజలు పరాజయం సినిమా చూపించారు. ఇప్పుడు మోదీ ప్రభుత్వానికి పార్లమెంట్‌లో మెజారిటీ లేదు. చంద్రబాబు, నితీష్‌కుమార్‌ల దయాభిక్షగా ఆయన ప్రధాని అయ్యారు. ఇప్పుడు మోదీ రాజ్యాంగాన్ని మార్చే దుస్సాహసానికి పాల్పడే పరిస్థితి లేదు. ఏకపక్షంగా పౌరసత్వ చట్టాలను ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేసే స్థితి లేదు. కొన్ని రాష్ట్రాలలో వున్న ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేయగల అవకాశం లేదు. ప్రస్తుతానికి నియంత పోకడలకు అడ్డుకట్ట పడింది. ఈ ఎన్నికలలో ప్రజలు మోదీ దూకుడుకు కళ్ళెం వేశారు. ❑

**- డీవీవీఎస్ వర్మ, సంపాదకులు, 85006 78977**

# ఆంధ్రప్రదేశ్‌లో చంద్రహాసం

ఆంధ్రప్రదేశ్ ఓటర్లు ఎన్నికలలో ఇచ్చే తీర్పులలో ఒక ప్రత్యేకత కనిపిస్తుంది. ఏకపక్ష తీర్పులు ఇస్తున్నారు. 2019లో ఆ నాటి చంద్రబాబు ప్రభుత్వాన్ని ఓడించి అధికార పార్టీకి కేవలం 23 సీట్లకు పరిమితం చేశారు. 2024లో జగన్ పార్టీని ఓడించి కేవలం 11 సీట్లకు కత్తిరించారు. ఇదొక ప్రత్యేక ధోరణి. విపరీత ధోరణి. ఈ రాష్ట్ర ప్రజలలో ప్రభుత్వ వ్యతిరేకత ఒకసారి మొదలైతే అది దావానలంలా వ్యాపించి ఎంతటి వారినైనా దహించి వేస్తుంది. ఈ ఫలితాలు దీనినే ధృవపరుస్తున్నాయి.

జగన్ పాలన ఒక అరాచక పాలన. నియంత పోకడల పాలన. ప్రత్యర్థుల మీద కక్షపూరిత పాలన. నియంతలకు తమకు తోచిందే విధానం. అందువల్లనే జగన్ పాలన కుక్కలు చింపిన విస్తరి అయ్యింది. మూడు రాజధానుల ముచ్చటతో రాజధాని లేకుండా చేశారు. పార్లమెంటరీ నియోజకవర్గాల ప్రాతిపదికన రెవెన్యూ జిల్లాలు ఏర్పాటు చేసే ప్రహసనం చూపించారు. పిల్లలకు ఇంగ్లీషు చదువుల పేరుతో అన్న ప్రాసన నాడే ఆవకాయ పచ్చడిలాగ ఒకటవ తరగతి నుంచి ఇంగ్లీషు బోధనా భాషను చేసి విద్యార్థులను రెంటికీ చెడగొట్టారు.

రాజకీయ ప్రత్యర్థుల మీద దాడులు బెదిరింపులు, అణచివేతలు వంటి ఫ్యాక్షన్ రాజకీయానికి ప్రాధాన్యత ఇచ్చారు. ఉద్యోగులు, వివిధ తరగతుల కార్మికుల పోరాటాలపై చర్చలకు బదులు, తీవ్ర నిర్బంధాలకు పూనుకున్నారు. జగన్ పాలనకు మరో కోణం కూడా వుంది. సంక్షేమ పథకాలను గరిష్ట స్థాయిలో అమలు చేయడం. ఆయన నమ్ముకున్నది ఈ లబ్ధిదారులనే. ఈ పథకాలను నేరుగా అందించిన వలంటీర్ల వ్యవస్థనే. ఇంతటి పరాజయంలోనూ జగన్‌కు దాదాపు 40 శాతం ఓట్లు రాబట్టారు. జగన్ పాలన సృష్టించిన నెగిటివ్ ఓటు ముందు పాజిటివ్ ఓటు పరాజయం పాలైంది.

ఇప్పుడు చంద్రబాబు పాలన మొదలైంది. అన్ని వర్గాల ప్రజలు ఎన్నో ఆశల్ని పెంచుకున్నారు. అమరావతి రైతులు రాజధానిని కలగంటున్నారు. మధ్య తరగతి అభివృద్ధి పరుగుల్ని ఆశిస్తున్నారు. ఉద్యోగులు, ఇతర కార్మికులు, తమ సమస్యలు పరిష్కారం అవుతాయని భావిస్తున్నారు. పేదలు తమకు మరిన్ని ఉచితాలు దక్కుతాయని భావిస్తున్నారు.

వాస్తవానికి రాష్ట్రం అప్పుల్లో.. ఆస్తులు తాకట్టులో వున్నాయి. ఇవి చంద్రబాబు దక్షతకు సవాలు కానున్నాయి. పోతే చంద్రబాబుకు కలిసొచ్చే ఒక సానుకూల అంశం కేంద్రంలో మోదీ ప్రభుత్వం తన మీద ఆధారపడి వుండడం. ఇంతటి అవకాశం ఈ రాష్ట్రంలో గతంలో ఎప్పుడూ రాలేదు. రాష్ట్రానికి ప్రత్యేక హెూదా తెచ్చుకుంటే అభివృద్ధికి దారులు పడతాయి. రాజధాని నిర్మాణానికి నిధులు, విభజన హామీల అమలును సాధిస్తే రాష్ట్ర ఆర్థిక స్థితి మెరుగవుతుంది. చంద్రబాబు నిటారుగా నిలబడితే మోదీ దిగిరాక తప్పదు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేరడం అన్నది దీనిపైనే ఆధారపడి వుంటుంది. ❑

**- డీవీవీఎస్ వర్మ, సంపాదకులు**


# 2024 లోక్‌సభ ఎన్నికలు - ఫలితాలు

## ఎన్‌డీఏ కూటమి ఓట్లు.. సీట్లు.. వ్యత్యాసం

| Party or alliance | Votes | % | Seats | +/– |
|---|---|---|---|---|
| Bharatiya Janata Party[338] | 235,973,935 | | 240 | –63 |
| Telugu Desam Party | 12,775,270 | | 16 | +13 |
| Janata Dal (United) | 8,039,663 | | 12 | –4 |
| Shiv Sena | 7,401,447 | | 7 | –11 |
| Lok Janshakti Party (Ram Vilas) | 2,810,250 | | 5 | +5 |
| Janata Dal (Secular) | 2,173,701 | | 2 | +1 |
| Jana Sena Party | | | 2 | +2 |
| Rashtriya Lok Dal | | | 2 | +2 |
| All Jharkhand Students Union | 458,677 | | 1 | 0 |
| Nationalist Congress Party | 2,059,179 | | 1 | –4 |
| United People's Party Liberal | 488,995 | | 1 | +1 |
| Sikkim Krantikari Morcha | 164,396 | | 1 | +1 |
| Apna Dal (Soneylal) | 808,245 | | 1 | –1 |
| Asom Gana Parishad | 1,298,707 | | 1 | +1 |
| Hindustani Awam Morcha | | | 1 | +1 |
| Pattali Makkal Katchi | | | 0 | 0 |
| Bharath Dharma Jana Sena | | | 0 | 0 |
| Tamil Maanila Congress | | | 0 | 0 |
| Amma Makkal Munnettra Kazhagam | | | 0 | 0 |
| National People's Party | 417,930 | | 0 | –1 |
| Naga People's Front | 299,536 | | 0 | –1 |
| Nationalist Democratic Progressive Party | | | 0 | –1 |
| Rashtriya Lok Morcha | | | 0 | 0 |
| Rashtriya Samaj Paksha | | | 0 | 0 |
| Suheldev Bharatiya Samaj Party | | | 0 | 0 |
| Independents | | | 0 | –1 |
| *Total* | | | 293 | –60 |


## ఇండియా కూటమి ఓట్లు.. సీట్లు.. వ్యత్యాసం

| | | | | |
|---|---|---|---|---|
| Indian National Congress | 136,759,064 | | 99 | +47 |
| Samajwadi Party | 29,549,381 | | 37 | +32 |
| All India Trinamool Congress | 28,213,393 | | 29 | +7 |



Seat share of parties in the election

- BJP (44.20%)
- INC (18.24%)
- SP (6.82%)
- AITC (5.35%)
- DMK (4.06%)
- TDP (2.21%)
- JD(U) (2.95%)
- SS(UBT) (1.66%)
- NCP(SP) (1.48%)
- SS (1.29%)
- Other (11.74%)



Vote share of parties in the election

- BJP (36.56%)
- INC (21.96%)
- SP (4.58%)
- AITC (4.37%)
- YSRCP (2.06%)
- BSP (2.04%)
- TDP (1.98%)
- DMK (1.82%)
- CPI(M) (1.76%)
- RJD (1.57%)
- Other (21.3%)

| | | | |
|---|---|---|---|
| Dravida Munnetra Kazhagam | *11,754,710* | 22 | – 2 |
| Communist Party of India (Marxist) | *11,342,553* | 4 | +1 |
| Rashtriya Janata Dal | *10,107,402* | 4 | +4 |
| Shiv Sena (Uddhav Balasaheb Thackeray) | *9,567,779* | 9 | +9 |
| Aam Aadmi Party | *7,147,800* | 3 | +2 |
| Nationalist Congress Party (Sharadchandra Pawar) NCPSP | *5,921,162* | 8 | +8 |
| Communist Party of India | *3,157,184* | 2 | 0 |
| Jharkhand Mukti Morcha | *2,652,955* | 3 | +2 |
| Communist Party of India (Marxist–Leninist) Liberation | *1,736,771* | 2 | +2 |
| Indian Union Muslim League | *1,716,186* | 3 | 0 |
| Jammu and Kashmir National Conference | *1,147,041* | 2 | – 1 |
| Viduthalai Chiruthaigal Katchi | | 2 | +1 |
| Bharat Adivasi Party | | 1 | +1 |
| Kerala Congress | | 1 | 0 |
| Marumalarchi Dravida Munnetra Kazhagam | | 1 | +1 |
| Rashtriya Loktantrik Party RLTP | *596,955* | 1 | 0 |
| Revolutionary Socialist Party | | 1 | 0 |
| All India Forward Bloc | *289,941* | 0 | 0 |
| Jammu and Kashmir Peoples Democratic Party | *435,980* | 0 | 0 |
| Vikassheel Insaan Party | | 0 | 0 |
| Assam Jatiya Parishad | | 0 | 0 |
| Kerala Congress (Mani) | *277,365* | 0 | 0 |
| Kongunadu Makkal Desia Katchi | | 0 | 0 |
| *Total* | | *234* | — |

## ఇతరులు.. ఓట్లు.. సీట్లు.. వ్యత్యాసం

| | | | |
|---|---|---|---|
| YSR Congress Party YSRCP | *13,316,039* | 4 | –18 |
| Shiromani Akali Dal SAD | *1,814,318* | 1 | –1 |
| All India Majlis-e-Ittehadul Muslimeen AIMIM | *1,400,215* | 1 | –1 |
| Zoram People's Movement ZPM | *208,552* | 1 | +1 |

## రాష్ట్రాల వారీగా ఎంపీ సీట్లు గెలిచిన పార్టీలు


| State/Union Territory | Seats | NDA | INDIA | Others |
|---|---|---|---|---|
| Andaman and Nicobar Islands | 1 | 1 | 0 | 0 |
| Andhra Pradesh | 25 | 21 | 0 | 4 |
| Arunachal Pradesh | 2 | 2 | 0 | 0 |
| Assam | 14 | 11 | 3 | 0 |
| Bihar | 40 | 30 | 9 | 1 |
| Chandigarh | 1 | 0 | 1 | 0 |
| Chhattisgarh | 11 | 10 | 1 | 0 |
| nd Nagar Haveli and Daman and Diu | 2 | 1 | 0 | 1 |
| Delhi | 7 | 7 | 0 | 0 |
| Goa | 2 | 1 | 1 | 0 |
| Gujarat | 26 | 25 | 1 | 0 |
| Haryana | 10 | 5 | 5 | 0 |
| Himachal Pradesh | 4 | 4 | 0 | 0 |
| Jammu and Kashmir | 5 | 2 | 2 | 1 |
| Jharkhand | 14 | 9 | 5 | 0 |
| Karnataka | 28 | 19 | 9 | 0 |
| Kerala | 20 | 1 | 19 | 0 |
| Ladakh | 1 | 0 | 0 | 1 |
| Lakshadweep | 1 | 0 | 1 | 0 |
| Madhya Pradesh | 29 | 29 | 0 | 0 |
| Maharashtra | 48 | 17 | 30 | 1 |
| Manipur | 2 | 0 | 2 | 0 |
| Meghalaya | 2 | 0 | 1 | 1 |
| Mizoram | 1 | 0 | 0 | 1 |
| Nagaland | 1 | 0 | 1 | 0 |
| Odisha | 21 | 20 | 1 | 0 |
| Puducherry | 1 | 0 | 1 | 0 |
| Punjab | 13 | 0 | 10 | 3 |
| Rajasthan | 25 | 14 | 11 | 0 |
| Sikkim | 1 | 1 | 0 | 0 |
| Tamil Nadu | 39 | 0 | 39 | 0 |
| Telangana | 17 | 8 | 8 | 1 |
| Tripura | 2 | 2 | 0 | 0 |
| Uttar Pradesh | 80 | 36 | 43 | 1 |
| Uttarakhand | 5 | 5 | 0 | 0 |
| West Bengal | 42 | 12 | 30 | 0 |
| Total | 543 | 293 | 234 | 16 |


## దేశంలో ఓటర్ల సమాచారం

- మొత్తం ఓటర్లు 96. 8 కోట్లు
- పురుష ఓటర్లు..49.7 కోట్లు
- మహిళా ఓటర్లు..47.1 కోట్లు
- 1.8 కోట్ల మంది ఫస్ట్ టైమ్ ఓటర్లు
- 85 ఏళ్లు దాటిన వారు 82 లక్షల మంది
- ట్రాన్స్ జెండర్స్.. 48 వేల మంది
- యంగ్ ఓటర్లు..19.74 కోట్లు
- వందేళ్లు దాటిన వారు 2.18 లక్షల మంది
- సర్వీస్ ఓటర్లు 19.1 లక్షల మంది
- దివ్యాంగ ఓటర్లు 88. 4 లక్షల మంది

| | | | | |
|---|---|---|---|---|
| Azad Samaj Party (Kanshi Ram) ASPKR | | | 1 | +1 |
| Voice of the People Party | 571,078 | | 1 | +1 |
| All India Anna Dravida Munnetra Kazhagam ADMK | 8,952,587 | | 0 | −1 |
| Bahujan Samaj Party | 13,153,818 | | 0 | −10 |
| Karnataka Rashtra Samithi | | | 0 | 0 |
| Biju Janata Dal BJD | 9,413,379 | | 0 | −12 |
| Uttama Prajaakeeya Party | | | 0 | 0 |
| Bharat Rashtra Samithi BHRS | 3,657,237 | | 0 | −9 |
| Shiromani Akali Dal (Amritsar) | | | 0 | 0 |
| Indian National Lok Dal | 226,975 | | 0 | 0 |
| Jannayak Janta Party | 113,827 | | 0 | 0 |
| Desiya Murpokku Dravida Kazhagam | 1,128,616 | | 0 | 0 |
| Gondwana Ganatantra Party | | | 0 | 0 |
| All India United Democratic Front AIUDF | 625,954 | | 0 | −1 |
| Revolutionary Goans Party | 64,578 | | 0 | 0 |
| Sikkim Democratic Front | 77,171 | | 0 | 0 |
| Bodoland People's Front | 777,570 | | 0 | 0 |
| Nationalist Democratic Progressive Party | 350,967 | | 0 | −1 |
| Mizo National Front | 140,264 | | 0 | −1 |
| United Democratic Party (Meghalaya) | 44,563 | | 0 | 0 |
| Jammu and Kashmir National Panthers Party (Bhim) | 23,268 | | 0 | 0 |
| Azad Adhikar Sena | 11,396 | | 0 | 0 |
| Other parties | | | 0 | −2 |
| Independents | | | 7 | −1 |
| None of the above | 6,372,220 | | – | – |
| **Total** | | | **543** | **0** |

**ఆంధ్రప్రదేశ్‌లో పార్టీల వారీగా పోలైన ఓట్లు**



# మోదీ మ్యాజిక్ ఏమయింది ?



- ఎ.కృష్ణారావు

**'రాసిన అక్షరం కన్నా ఉపన్యాసాలే జనాన్ని ప్రభావితం చేస్తాయని నాకు తెలుసు. మహా మహా రచయితలు సాధించలేని మార్పు ఈ భూమిపై గొప్ప వక్తలే సాధించారు' అని జర్మనీ నియంత హిట్లర్ తన ఆత్మకథ 'మెయిన్ కాంఫ్' (ఆంగ్లంలో 'మై స్ట్రగుల్') ముందుమాటలో రాశారు. కాని నేతలు ఎంత గొప్ప వక్తలైనా వారి మాటల్లో నిజాయితీ లేకపోతే, రోజుకో రకంగా మాట్లాడితే, మాట్లాడిన మాటల్లో అబద్ధాలున్నాయని తేలితే ప్రజలు ఆ మాటల్ని విశ్వసించరని ఎవరికి ఎప్పుడు ఎలా బుద్ధి చెప్పాలో వారికి బాగా తెలుసని మంగళవారం నాడు వెల్లడైన 18వ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఈ ఫలితాలను సువర్ణ ఘట్టంగా భావించవచ్చు.**

ఒక దశాబ్ద కాలం (2014-24)లో దేశంలో అన్ని వ్యవస్థలపై పట్టు సాధించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ తానేమి చేసినా ప్రజలు హర్షిస్తారని, కేవలం తన ప్రచారంతోనే వారు మైమరిచిపోయి బీజేపీకి పట్టం కడతారని ఆశించినట్లు అర్థమవుతోంది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా ఆయన దాదాపు 200 ఎన్నికల సభల్లో ప్రసంగించారు. వివిధ భాషల్లో కనీసం 50 టీవీ ఛానెల్స్‌కు ఇంటర్వ్యూలు ఇచ్చారు. ఎన్నికలు లేనప్పుడు కూడా ఆయన నెలకు కనీసం 20 ప్రసంగాలు చేశారు. టీవీ ఛానెల్స్, సోషల్ మీడియా యుగం కనుక తన హావభావాలతోనూ, ధ్యానముద్రలతోనూ కూడా జనాన్ని ఆయన ప్రభావితం చేయాలనుకున్నారు. తన పేరును తానే వందలసార్లు ఉచ్చరించారు. బీజేపీకి స్టార్ క్యాంపెయినర్లు ఎంతో మంది ఉన్నప్పటికీ మోదీయే అసలైన స్టార్ క్యాంపెయినర్‌గా వ్యవహరించారు. నూతన పార్లమెంట్ భవనం ప్రారంభం నుంచి రాముడి ప్రాణప్రతిష్ఠ వరకు తానొక్కడే అన్నట్లుగా వ్యవహరించారు. పదే పదే ఒకే మాట చెబితే జనం నమ్ముతారేమోనని భావించి చార్ సౌ పార్ (400కు పైగా) సీట్లు సాధిస్తామని చెప్పుకున్నారు. కాంగ్రెస్ ఈ సారి 50 సీట్లు కూడా దాటదని చెప్పారు. తానేది చెబితే జనం అది నమ్ముతారని పరిపూర్ణంగా విశ్వసించిన మోదీ ప్రతిపక్షాలు ప్రజల వనరులను ముస్లింలకు పంచిపెడతారని చెప్పేందుకు కూడా వెనుకాడలేదు.




మహాత్ముడిపై రిచర్డ్ అటెన్ బరో సినిమా తీయకముందు గాంధీ ఎవరో లోకానికి తెలియదని చెప్పేందుకు ఆయన తెగించారు!

రోజురోజుకూ ఒక వ్యక్తి కేంద్రీకృత వ్యవస్థగా మారిన భారతీయ జనతా పార్టీకి మోదీ తిరుగులేని నాయకుడే కావచ్చు. ఆయన నాయకత్వానికి ఆయనే ముగ్ధుడై తనది కారణజన్మ అని, దేవుడే తనను పంపించాడని చెప్పుకున్నారు. పూరీ జగన్నాథుడే మోదీ భక్తుడని బీజేపీ అధికార ప్రతినిధి ఒకరు వాక్రుచ్చారు. మోదీ నేతృత్వంలో భారతీయ జనతా పార్టీ నిర్మాణపరంగా ఎంతో ఎదిగిపోయిందని, దానికి ఆర్ఎస్ఎస్ వంటి సంస్థ అవసరం ఇక ఏ మాత్రం లేదని భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డాయే ప్రకటించారు. గంటకు పైగా ఇంటర్వ్యూలు చేయడం తప్ప ప్రజల మనసుల్లో ఉన్న ప్రశ్నలను లేవనెత్తాలని జర్నలిస్టుల రూపంలో వచ్చిన టీవీ ప్రతినిధులు కూడా అనుకోలేదు. ఏమైతేనేం దాదాపు 80 రోజులుగా జరిగిన ఎన్నికల ఘట్టంలో ఎన్నో నాటకీయ దృశ్యాలు, భావోద్వేగ ప్రసంగాలు, ఉత్కంఠభరితమైన సన్నివేశాలు చూసే అవకాశం కలిగింది. అంతిమంగా ఎగ్జిట్ పోల్స్ నిర్వహించిన దాదాపు డజన్ సంస్థలు ఎన్డీఏకు 350కి పైగా స్థానాలు లభిస్తాయని, మోదీ అన్నట్లుగా 400 దాటినా ఆశ్చర్యపోనక్కర్లేదని ప్రకటించడంతో ఈ దేశంలో మీడియా సంస్థల ధైర్యం ఎంత దిగజారిపోయిందో, ఎందుకు వారు భయోత్పాతానికి గురయ్యారో అర్థం అవుతుంది. కేవలం షేర్ మార్కెట్ పతనం కాకుండా ఉండేందుకే వారు అలా చేశారా అన్న అనుమానాలూ లేకపోలేదు. నిజానికి మోదీని ఢీకొనడం అంత సులభం కాదని, ఆయన ఏ విధంగానైనా తాను అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని అనుకున్న వారే ఎక్కువగా ఉన్నారు. చండీగఢ్‌లో మేయర్ ఎన్నికల్లో బ్యాలట్ పేపర్లలో మార్పులు చేయడం, సూరత్‌లో కాంగ్రెస్ అభ్యర్థి పేరును ప్రతిపాదించిన వారు రిటర్నింగ్

అధికారి వద్దకు రాలేకపోవడం, ఇండోర్‌లో నామినేషన్ వేసిన కాంగ్రెస్ అభ్యర్థి చివరి నిమిషంలో నామినేషన్ ఉపసంహరించుకోవడం, ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ఇద్దరు ముఖ్యమంత్రులు అరెస్టు కావడం వంటి ఘట్టాల తర్వాత ఇక మోదీ ఘన విజయాన్ని ఎవరు ఆపగలరులే అని చాలా మంది భావించారు. ఈడీ, సిబిఐ వంటి సంస్థలు సృష్టించిన భయోత్పాతం అంత ఇంతా కాదు. పార్లమెంట్‌లో చర్చలు లేకుండా, ప్రతిపక్షాలు లేకుండా బిల్లులు ఆమోదించడంతో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైందనిపించింది. ఎన్నికల బాండ్లపై సుప్రీం తీర్పుతో బీజేపీ అక్రమ నిధుల వసూళ్ల గురించి జనానికి తెలిసినా పెద్దగా పట్టించుకోరేమో అనిపించింది. కాని ఆశ్చర్యకరంగా ఎన్నికల ఫలితాలను చూస్తే మోదీ మాయాజాలం చాలా మటుకు మాయమైపోయినట్లు అర్థమవుతోంది.

నిజానికి ఈ ఎన్నికల్లో ప్రతిపక్షాలు అవసరమైనంత సంఘటితంగా పనిచేయలేదు. ఇండియా కూటమి ఏర్పాటైన కొద్ది రోజుల్లోనే ఆ పార్టీలో సీనియర్ నాయకుడు నితీశ్‌కుమార్ ప్లేటు ఫిరాయించి మరోసారి బీజేపీతో చేతులు కలిపారు. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్‌లో ఇండియా కూటమి సభ్యులకు తగినన్ని సీట్లు ఇచ్చేది లేదని చెప్పేశారు. పంజాబ్‌లో కూడా కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేయాల్సి వచ్చింది. కాంగ్రెస్ ఖాతాలను స్తంభింపచేయడంతో ఆ సంస్థ ఆర్థికంగా బలహీనపడింది. మధ్యప్రదేశ్, హర్యానాలాంటి చోట్ల బలమైన కాంగ్రెస్ నేతల్ని బీజేపీ తన వైపునకు తిప్పుకుంది. పశ్చిమ బెంగాల్‌లో ప్రతిపక్ష పార్టీలను నిలువునా చీల్చారు. ఎన్నో బలహీనతలు, సమస్యలు, వనరుల లోపాల మధ్య కొట్టుమిట్టాడుతూ ప్రతిపక్షాలు ప్రచారాన్ని నిర్వహించాయి. మోదీ, ఆయన దళం చేసిన భారీ ప్రచారం ముందు ప్రతిపక్షాల ప్రచారం వెలవెలబోయినట్లు కనిపించింది. అయినప్పటికీ ఇవాళ బీజేపీ గత రెండు ఎన్నికల్లో మాదిరి మెజారిటీ సీట్లు సాధించలేకపోవడం, ఇండియా కూటమికీ, ఎన్డీఏకు మధ్య సీట్ల వ్యత్యాసం బాగా తగ్గిపోవడం మోదీ ఏకఛత్రాధిపత్యాన్ని జనం కోరుకోవడం లేదని అనుకోవడానికి ఆస్కారం కలిగిస్తుంది.

ఉత్తరప్రదేశ్‌లాంటి బీజేపీ కంచుకోటలో సగానికి సగం సీట్లు కోల్పోవడం, అయోధ్య భాగంగా ఉన్న ఫైజాబాద్‌లోనే బీజేపీ అభ్యర్థి ఓడిపోవడం దేనికి సంకేతం? గతంలో కూడా బాబ్రీ మసీదు కూల్చివేత తర్వాత జరిగిన నాలుగు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ పరాజయం పాలైంది. అయోధ్యలో నాడు కూడా బీజేపీ అభ్యర్థి ఓటమి పాలయ్యారు. ఇప్పుడు రామ మందిర నిర్మాణం తర్వాత యూపీలో బీజేపీ ప్రాభవం తగ్గిపోవడం ఏ సంకేతాలు పంపిస్తున్నాయి ? రామ మందిర నిర్మాణం కల్పించిన భావోద్వేగాలు పొంగే కాని, వాపు కాదని, ఈ దేశంలో మతాన్ని రాజకీయాలతో సమ్మిళితం చేయడాన్ని రాజ్యాన్ని ప్రజలు విశ్వసించడం లేదని అనుకోవాలా? లేక ప్రధానమంత్రి నరేంద్రమోదీ మతాన్ని తన స్వంత రాజకీయాలకు ఉపయోగించుకోవడాన్ని జనం హర్షించడం లేదని భావించాలా ? నిజానికి మోదీ వన్ మాన్ షోను కొందరు ఆర్ఎస్ఎస్ నేతలే హర్షించలేదు. ఈ ఎన్నికల్లో మోదీకి సంపూర్ణ మెజారిటీ రాకపోతేనే మంచిదని, వస్తే తమను కూడా లెక్కచేయరని అనుకున్న ఆర్ఎస్ఎస్ పెద్దలు ఉన్నారు. ఎందుకో నాగపూర్ కూడా ఈ సారి అన్యమనస్కంగానే వ్యవహరించింది. ఆర్ఎస్ఎస్ పూర్తిగా బీజేపీని వదిలేస్తే ఈ 240 సీట్లు కూడా వచ్చేవి కావని అనుకునేవారు ఉన్నారు.

నిజానికి బీజేపీ నుంచి గెలిచిన వారిలో ఒరిజినల్ బీజేపీ నేతలకన్నా బయటి పార్టీ నుంచి వచ్చిన వారు చెప్పుకోదగ్గ సంఖ్యలోనే ఉన్నారు. ఉదాహరణకు తెలంగాణలో బీజేపీ నుంచి గెలిచిన వారిలో సగానికి పైగా ఇతర పార్టీల నుంచి వచ్చినవారే. కేరళలో సినీ నటుడు సురేష్ గోపి బీజేపీ బలంతో కన్నా తన వ్యక్తిగత ఆకర్షణ ఆధారంతో గెలిచారనవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం మద్దతు లేకపోతే బీజేపీకి అసెంబ్లీలో కాని, పార్లమెంట్‌లో కాని ఒక్క సీటు కూడా వచ్చే అవకాశం లేదు. అందువల్ల మోదీ మూలంగానే బీజేపీకి ప్రాభవం ఏర్పడిందని చెప్పడానికి వీల్లేదు. 2014లో కొన్ని సామాజిక, చారిత్రక, ఆర్థిక కారణాల వల్ల భారతీయ జనతా పార్టీకి ప్రజలు పట్టం కట్టారు. పుల్వామా, బాలాకోట్ సంఘటనలు జరగకపోతే 2019లో కూడా బీజేపీకి మెజారిటీ వచ్చేది కాదని చెప్పేవారు లేకపోలేదు. 2024లో కేవలం మోదీ పేరును మార్మోగిస్తే సరిపోదని తేలిపోయింది.

ఏమైతేనేం పది సంవత్సరాల తర్వాత దేశంలో మళ్లీ సంకీర్ణ రాజకీయాలు ప్రారంభమయ్యాయి. రెండుసార్లు అఖండమైన మెజారిటీతో బీజేపీని గెలిపించినప్పటికీ మోదీ మళ్లీ దేశం సంకీర్ణ యుగంలోకి వెళ్లకుండా చేయలేకపోయారు. ఇది కూడా మంచి పరిణామమే. రాష్ట్రాల ఆకాంక్షలను విస్మరించకుండా ఉండేందుకు ఇది తోడ్పడుతుంది. నిజానికి ఈ పదేళ్లు ప్రజాస్వామికంగా, ఏకాభిప్రాయ సాధనతో పరిపాలన సాగించి ఉంటే, ప్రతిపక్షాలనూ విశ్వాసంలోకి తీసుకుని ఉంటే, అన్ని వ్యవస్థల్నీ నియంత్రణలోకి తీసుకోకుండా వాటిని పారదర్శకంగా స్వేచ్ఛగా పని చేయించి ఉంటే, ఏడాదికి కనీసం ఒక్క విలేఖరుల సమావేశమైనా నిర్వహించి అరమరికలు లేకుండా మాట్లాడి ఉంటే, ప్రతిపక్షాలను అణచివేయాలన్న ఆలోచనను వదిలిపెట్టి ఉంటే మోదీ మళ్లీ భారీ మెజారిటీతో తిరిగి వచ్చేవారేమో. ఒక బలమైన వ్యవస్థ, బలమైన భావజాలం ఉన్నప్పటికీ అవి ఒక వ్యక్తి చుట్టూ తిరిగితే విజయవంతం కాలేవని ఈ ఎన్నికలు స్పష్టం చేశాయి. ❑

# మోదీ అహంకారానికి దెబ్బ



**– సురవరం సుధాకరరెడ్డి**

**ఎన్నికల ఫలితాల తర్వాత అనేక విశ్లేషణలు వచ్చాయి. ఇంకా వస్తాయి. కేంద్రంలో బీజేపీ పార్లమెంటు సభ్యుల సంఖ్య తగ్గటం అనేకమందికి ఒక రిలీఫ్. తనకు తాను దైవదూతగా ప్రకటించు కున్న నరేంద్రమోదీ అహంకారానికి దెబ్బ తగిలింది. ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రత్యర్థుల మీద అనేక అన్యాయమైన ఆరోపణలు చేశారు. "కాంగ్రెస్ వస్తే అయోధ్య రామాలయాన్ని కూల్చి వేస్తారని", "హిందూ మహిళల పుస్తెలు లాక్కొని ముస్లింల కిస్తారని" ఆయన చేసిన దుష్ప్రచారం పనిచెయ్య లేదు. కాని ప్రధాని స్థాయిని దిగజార్చింది.**

మోదీ ప్రచారం, అమెరికా వియత్నాంపై దాడిలో "కార్పెట్ బాంబింగ్" చేసిన విషయం గుర్తుకువస్తుంది. కార్పెట్ బాంబింగ్ అంటే గెరిల్లా యోధులను ఏరివేయటానికి వియత్నాంలో ప్రతి అంగుళం భూభాగంపైన బాంబులు వేసింది. నేపాం బాంబులు ఉపయోగించింది. విత్తన బంతులులాగ గుండు సూదుల బంతులు తయారుచేసి గ్రామాల మీద వేసింది. విషవాయువును ఉపయోగించింది. అయినా ఓడిపోయింది. అది వేరే కథ. మోదీ ప్రతిపక్షపార్టీలను చీల్చారు. చిన్న పార్టీలను బలహీన పర్చారు. దగ్గరకు తీసినట్లే తీసుకుని వాటిని నిర్వీర్యం చేశారు. పంజాబ్‌లో అకాలీదళ్‌ని, హర్యానాలో చౌతాలా పార్టీని తీసి పారేశారు. ఢిల్లీ ముఖ్యమంత్రిని, జార్ఖండ్ ముఖ్యమంత్రిని అరెస్టు చేసి జైల్లో పెట్టించారు. తెలంగాణలో కేసీఆర్ కుమార్తె కవితను అరెస్టు చేసి జైల్లో పెట్టించారు. మధ్యప్రదేశ్‌లో, గుజరాత్‌లో కాంగ్రెస్ నాయకులను తన పార్టీలో తీసుకోవడమేగాక, వారి అభ్యర్థులను కొనుగోలు చేసి పోటీ చేయకుండా ఉపసంహరింప చేశారు. మహారాష్ట్రలో శివసేన, ఎన్‌సీపీలను చీల్చి, వారి నైతిక స్థైర్యాన్ని దెబ్బతీశాడు. వారి ప్రభుత్వాన్ని పడగొట్టాడు. కాంగ్రెసు మేనిఫెస్టో ముస్లిం లీగ్ మేనిఫెస్టోలా ఉందని ప్రచారం చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐ, ఇన్‌కంటాక్స్ దళాలను అల్సేషన్ కుక్కలలాగ ప్రత్యర్థుల మీద ప్రయోగించాడు. నలభై ఏళ్లనాటి కచ్చితీవును, కాంగ్రెస్, డి.ఎం.కె. శ్రీలంకలకు ధారా దత్తం చేశాయని, మత్స్యకారులకు అన్యాయం జరిగిందని ఆరో పించారు. కేరళ ముఖ్యమంత్రి కుమార్తెపైన ఒక తప్పుడు కేసు రుద్దాడు. ఎన్నికల కమిషన్‌లో సభ్యులను నియమించే చట్టంమార్చి, ఒక సభ్యునితో రాజీనామా చేయించి, తనకు అను కూలమైన సభ్యులను నియమించుకున్నాడు. సర్వసైన్యాధిపతి రిటైర్ అయితే ఒక నెల పొడిగించడం అనేక అనుమానాలకు దారి తీసింది. ప్రశ్నిస్తే సైన్యాన్ని రాజకీయాల్లోకి లాగుతారా అని ఆగ్రహించారు. గోబెల్స్ సిగ్గుపడే విధంగా అవలీలగా అబద్ధాలు చెప్పాడు. ఇండియా కూటమి గట్టి పోటీనిచ్చింది. దేశవ్యాపిత మైన ప్రచారం దీటుగా సాగించింది. కాని సంపూర్ణ ఐక్యత రాలే దు. ఇండియా కూటమి బలం పెరిగింది. ఇండియా కూటమి బలం పెరిగేందుకు యూపీ, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, మహా రాష్ట్ర తోడ్పడ్డాయి. తెలంగాణలో, రాజస్థాన్‌లో, కర్నాటక లో కాంగ్రెస్ సీట్లు పెరిగాయి. కాని కాంగ్రెసు పాలిత రాష్ట్రాలలో తగినన్ని సీట్లు రాకపోవడంపై వారు సమీక్షించుకోవాలి. బీజేపీకి బీహార్, గుజరాత్ బాగా సహాయపడ్డాయి. నాగాలాండ్‌లో, పుదు చ్చేరిలో, లక్షద్వీప్‌లో, మణిపూర్‌లో కాంగ్రెసు సీట్లు గెలవడం, గోవాలో బీజేపీ ఒక సీటు గెలవడం, కాంగ్రెస్ పునరుద్ధరణకు దోహదపడుతుంది. అయోధ్యలో ఒక సీటు ఓటమి రామాలయం నాటకం పనిచేయ లేదని అర్థమవుతుంది. అధికారానికి 63 మంది సభ్యుల తేడా దూరంలో ఉన్నారు. బీజేపీ 233 సీట్లకు పరిమితమై చంద్రబాబు, నితీశ్‌ల ఊతకర్రల సహాయం మీద ఆధారపడి ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాబోతోంది. చంద్రబాబు రెండు పర్యాయాలు, నితీశ్‌కుమార్ మూడు పర్యాయాలు, ఎన్‌డీఏలోకి వెళ్లి బైటకు వచ్చినవారే. నమ్మకం లేని సహచరులని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతానికి అలాంటి ప్రమాదం లేదు. అవకాశము లేదు. కాని వారు బీజేపీని పూర్తిగా నమ్మరు. బీజేపీ వాళ్లను నమ్మదు.

బీజేపీని బైట నుండి బలపరచిన వైసీపీ, భారతీయ రాష్ట్ర సమి తి, ఆల్ ఇండియా అన్నాడీఎంకె పార్టీ, ఒడిశాలో నవీన్ పట్నా యక్ పార్టీ బిజూ జనతాదళ్ తీవ్రంగా దెబ్బతిన్నాయి. వీటిపని అయిపోయిందని భావించడం సరైంది కాదు. పుంజుకునే అవకా శాలున్నాయి. ఇప్పుడు చంద్రబాబు, నితీశ్ చక్రం తిప్పుతారని, అనేక మంత్రి పదవులు కోరుతున్నారని స్పీకర్ కూడా బాబు కోరుతున్నారన్న వార్తలు వస్తున్నాయి. బీజేపీ స్పీకరు పదవిని ఇవ్వదు. ఆంధ్రాకు ప్రత్యేక హోదా ఇవ్వదు. టీడీపీ, జేడీయూ లేకపోయినా నిలదొక్కుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్ని మంత్రి పదవులు ఒక్కొక్క పార్టీకి రెండు, మూడు ఇవ్వవచ్చు. ఏడుగురు స్వతంత్రులున్నారు. ఇద్దరు టెర్రరిస్టు ఆరోపణలతో ఉన్నారు. వారు బలపరిస్తే **(మిగతా 12వ పేజీలో)**

# ఎన్నికల తీర్పు.. ఒక ముందడుగు

## అయినా పోరు కొనసాగాల్సిందే

- 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం

**2024 సార్వత్రిక ఎన్నికల తీర్పు ప్రత్యేకంగా చెప్పుకోదగింది. తాము ప్రజాస్వామ్యానికీ రాజ్యాంగానికీ ఎంత విలువ ఇస్తామో ఈ తీర్పు ద్వారా ప్రజలు చాటి చెప్పారు. 2014లోనూ 2019లోనూ పరిపూర్ణ ఆధిక్యత తెచ్చుకున్న బీజేపీకి ఈసారి ప్రజలు ఆ అవకాశం నిరాకరించారు. 303 స్థానాలున్న బీజేపీ సీట్ల సంఖ్య ఈసారి 240కి పడిపోయింది. అంటే 21 శాతం తగ్గింది. ఎన్.డి.ఎ కు 292, 'ఇండియా' వేదికకు 234 స్థానాలు వచ్చాయి. మోడీ పదేళ్ల పాలన నేపథ్యంలో ఈ ఎన్నికలు జరిగాయి. ఈ పాలన మొత్తం లక్షణం నియంతృత్వ పోకడలతో హిందూత్వ మతతత్వ ఎజెండాను అమలు జరిగింది. రాజ్యాంగ వ్యవస్థలో ప్రతి అంగమూ దిగ్బంధానికి గురైంది. రాజ్యాంగ వ్యవస్థలను గుప్పిట పెట్టుకోవడానికి దారితీసింది. ఎన్నికల సన్నాహక దశలోనే ఇది ప్రతిబింబించింది.**

కేంద్ర దర్యాప్తు సంస్థలు ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా పెట్టుకుని దాడి చేశాయి. ఇద్దరు ముఖ్యమంత్రులు జైళ్ల పాలయ్యారు. కాంగ్రెస్, సీపీఐ(ఎం) వంటి రాజకీయ పక్షాలపై కక్ష సాధింపు సాగింది. ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్షానికి సమాన అవకాశం లేకుండా పోయింది. ఈ విషయంలో ఎన్నికల కమిషన్ శోచనీయమైన పాత్ర పోషించింది. వెన్నెముక లేని కమిషనర్లతో నియమించబడిన ఎన్నికల కమిషన్ ఎన్నికల నియమావళి ఘోర ఉల్లంఘనలను శిక్షించడంలో గట్టిగా నిలబడలేక విఫలమైంది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రసంగాలలో ముస్లింలపై విషం కక్కుతున్నా హద్దు ఆపూ లేకపోయింది. పోలింగ్ శాతానికి సంబంధించిన లెక్కలను క్రోడీకరించడంలో పారదర్శకత చూపించలేక అనవసర సందేహాలకూ తావిచ్చింది. ఈ కీలక రాజ్యాంగ వ్యవస్థ విశ్వసనీయతకు విఘాతమేర్పడింది. కార్పొరేట్ మీడియావరణాన్ని పూర్తిగా బిజెపి గుత్తాధిపత్యంలోకి తెచ్చేసుకుంది. సోషల్ మీడియాలోనూ భారీ వనరులు గుమ్మరించింది. ప్రచారంలోనూ ఓటర్లకు పంచిపెట్టడం కోసమూ వేల కోట్లు వెచ్చించింది.

ఈ మొత్తం ప్రచారంలో మోడీ, ఆయన హంగుదార్లు 'ఇండియా' వేదికలోని పార్టీలపట్ల బెదిరింపులూ మోసగింపు ఎత్తుగడలకు పాల్పడ్డారు. ఇలాంటి ప్రతికూల పరిస్థితులలోనే 'ఇండియా' వేదిక పార్టీలు ఎన్నికల ప్రచారం నిర్వహించవలసి వచ్చింది. మోడీ పచ్చి మతోన్మాద పల్లవికి వ్యతిరేకంగా ప్రతిపక్షం నిరుద్యోగం, ఉద్యోగాలు, ధరల పెరుగుదల, వ్యవసాయ సంక్షోభం వంటి అంశాలను ముందుకు తెచ్చింది. హిందూత్వ శక్తుల నుంచి ప్రజాస్వామ్యానికి రాజ్యాంగానికి ఎదురవుతున్న ప్రమాదాలపై దృష్టి సారించేలా చేసింది. మొట్ట మొదటిసారిగా రాజ్యాంగ రక్షణ అంశం విశాల ప్రజారాశులను మరీ ముఖ్యంగా దళితులను ఆకట్టుకుంది. బిజెపి మెజార్టీ కోల్పోవడంలో ఉత్తరప్రదేశ్‌లో దానికి తగిలిన ఎదురుదెబ్బ కీలకమైంది. అక్కడున్న 80 స్థానాలలోనూ గతంలో 62 వస్తే ప్రస్తుతం 33 మాత్రమే పొందగలిగింది. హిందూత్వ రాజకీయాలకు ఉత్తరప్రదేశ్ గుండెకాయ లాంటిది. అయోధ్యలో రామమందిరం హిందూ దురభిమాన ఎజెండాకు ప్రతీకలాటిది. ఇవన్నీ వున్నా బిజెపి ఓట్లు 9 శాతం తగ్గిపోయాయి. నిరుద్యోగ సమస్య మూకుమ్మడి ప్రభావం, ధరల పెరుగుదల, రైతుల అసంతృప్తి, అగ్నివీర్ పథకంపై యువత అసంతృప్తి, పరీక్షా పత్రాల లీకేజి వంటి అంశాలే మతతత్వ సమీకరణను మించిన ప్రభావం చూపించాయి. సమాజ్‌వాది పార్టీ చాకచక్యంగా నడిపిన కుల సమీకరణ రాజకీయాలు ఇందుకు తోడైనాయి. అయోధ్యకు నెలవుగా వున్న ఫైజాబాద్ లోక్‌సభ నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహించే బిజెపి సభ్యుడు ఓడిపోవడం ఓటరు ఎంత దూరమైనారో కళ్లకు కట్టే కఠోర వాస్తవంగా నిలిచింది.

ఎగ్జిట్ ప్రహసనం ఏడవ చివరి దశ పోలింగ్ ముగిశాక వెల్లువగా వచ్చిన ఎగ్జిట్‌పోల్స్ ఎన్‌డిఎ గొప్ప విజయం సాధించబోతున్నదన్న చిత్రణ ఇచ్చాయి. సగటున చూస్తే బిజెపికి కనీసంగా 367 వస్తాయని చెప్పాయి. ప్రతిపక్షాలను డీలా పడేసి పాలక పార్టీ ఆధిపత్యానికి కొమ్ము కాయడానికి ప్రయోగించిన ఆయుధాలే ఇవి. మరింత లోతైన ఉద్దేశం మీడియా కార్పొరేట్ కూటమితో స్టాక్ మార్కెట్‌లో లాభాలు కొల్లగొట్టడం. దీనంతటి వల్ల ముంబాయి స్టాక్ ఎక్స్చేంజిలో మదుపరుల పెట్టుబడి 14 లక్షల కోట్లు పెరిగింది. ఎ.పి, ఒడిషా పాతాలు పార్లమెంటుతో పాటు శాసనసభ ఎన్నికలు జరిగిన ఒడిషాలో బిజూ జనతాదళ్, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ఆర్‌సిపి ఈ ఎన్నికల్లో అధికారం కోల్పోయాయి. అవి లోక్‌సభ ఎన్నికలలో దెబ్బ తినడమేగాక

రాష్ట్ర ప్రభుత్వాలను పోగొట్టుకున్నాయి. ఒడిషాలోని 21 లోక్‌సభ స్థానాలలో బిజెపి 20 స్థానాలు తెచ్చుకోవడమే గాక శాసనసభలోనూ మెజార్టీ తెచ్చుకుంది. మోడీ ప్రభుత్వంతో జతకట్టే లేదా వత్తాసునిచ్చే ప్రాంతీయ పార్టీలకు ఈ రెండు రాష్ట్రాలూ ఒక గుణపాఠం నేర్పుతున్నాయి. బిజెపిని గట్టిగా వ్యతిరేకించే ప్రాంతీయ పార్టీలు డిఎంకె, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్‌జెడి వంటివే నిలదొక్కుకుని మరింత బలోపేతమైనాయి. బాహుబలి బదాబదలు నరేంద్రమోడీ స్వయంగానూ బిజెపి పార్టీగానూ ఎంతో శ్రమించి పెంచిన బాహుబలి ప్రచార చిత్రాన్ని మొత్తంగా ఈ తీర్పు నేలకు దించింది. బిజెపి ఇంత గట్టి దెబ్బ తిందంటే దానికి పూర్తి కారకుడు మోడీనే. దీని వెనక అసలు కుట్రదారి బిజెపినే. ఆ పార్టీ ఎన్నికల ప్రణాళిక కూడా మోడీకే గ్యారంటీ అని నామకరణమైంది. మోడీ చుట్టూ సృష్టించబడిన అజేయత్వం కథలు కకావికలైపోయాయి. ఎన్‌డిఏ మిశ్రమ ప్రభుత్వ ఏర్పాటుతోనైనా మోడీ, అమిత్‌షాల బరితెగిం పు పోకడలకు కళ్లెం పడుతుందని ఆశించాలి. ఎన్‌డిఎకు మూడింట రెండు వంతుల బలమేమీ వుండబోదు. ఒకే దేశం – ఒకే ఎన్నిక వంటి అనర్థక పథకాలను తీసుకొచ్చే ఆలోచనలు దీంతో చిన్నాభిన్నమైనట్టే. మూడో దఫా అధికారం లోకి రాగానే ఏకకాలంలో ఎన్నికల వ్యవస్థ తీసుకొస్తామని అమిత్ షా వాగ్దానం చేశారు. దానికోసం అవసరమైన అనేక రాజ్యాంగ సవరణలు తీసుకొస్తామన్న ఆయన మాట ఇక అమలు జరిగేది కాదు. 'ఇండియా' అనుభవాలు ఏమైనా నిరంతరం అప్రమ త్తంగా వుండటం ఇప్పటికీ అవసరమే. ఎందుకంటే నిరంకుశ హిందూత్వ లక్షణాలు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కూటమి జన్యుధాతు వుల్లోనే వున్నాయి. తమ ఎజెండాను ముందుకు నెట్టడానికి ప్రత్యక్షంగా కాకపోతే రహస్యంగా మార్గాలు నిరంతరం వారు అన్వేషిస్తూనే వుంటారు. ఈ కారణంగానే పార్లమెంటులో, అంతకంటే ముఖ్యంగా సభ వెలుపలా సమైక్య ప్రతిపక్షం పాత్ర కీలకమవుతుంది.

'ఇండియా' వేదిక పార్టీలు ఒక ఉమ్మడి వేదిక ద్వారా సమన్వ యాన్ని మెరుగుపర్చుకుని **(మిగతా 14వ పేజీలో)**


# మోదీ అహంకారానికి దెబ్బ

**(10వ పేజీ తరువాయి)**

వారు జైళ్ల నుంచి బైటకు వస్తారు. ఇతరులను కొనవచ్చు. అకాలీదళ్ ఇండియా కూటమిలోకి వెళ్లలేదు గనుక బీజేపీతో ఉండవచ్చు. కేసుల భయంతో జగన్ కూడా ఎన్‌డీఏకు మద్దతు ఇవ్వవచ్చు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఎంపీలు కాంగ్రెస్‌తో సహా ఇండియా కూటమిలో కూడా ఉండ వచ్చు. కొత్త ప్రభుత్వం సంకీర్ణం కనుక దూకుడు తగ్గవచ్చునన్న అభిప్రాయం కొందరిలో ఉంది. ఏడవ తేదీన ఎన్‌డీఏ పార్ల మెంటు సభ్యులు మిత్రపక్షాల నాయకులతో పాత పార్లమెంటు భవనంలో జరిగిన సమావేశంలో నరేంద్రమోదీ ఉపన్యాస ధోరణిని బట్టి అలాంటిదేమీ ఉండకపోవచ్చు. వాగాడంబరం ప్రతిపక్షాల మీద దాడి పాతపద్ధతిలోనే కొనసాగింది. ప్రత్యేక హోదా ఇస్తానని మోసం చేసినా, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ అమ్ముతానని పట్టుబట్టినా, ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీని మూడు సీట్లలో గెలిపించారు. ఆంధ్రలో ఎవరు గెలిచినా బీజేపీకి మద్దతిస్తారని ముందు నుంచి అనుకు న్నదే. చంద్రబాబు మీద కేసులు పెట్టి జైలుకు పంపి భయానక వాతావరణం సృష్టించి, చంద్రబాబును, బీజేపీతో ఎన్నికల ఒప్పందానికి జగన్ నెట్టాడు. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెసు, వామపక్షాలు పుంజుకోలేకపోవడం, రాష్ట్ర రాజకీయాలకు నష్టం కలిగిస్తుంది. "కాంగ్రెసు రహిత భారతదేశం" అన్న అమిత్ షా నినాదం కార్యాచరణలోకి రాకపోగా, ఆ పార్టీ మరింత బలోపేత మైంది. అసలు యుద్ధం రాబోయే రోజుల్లో ఉంది. వామపక్షాలు చాలా స్వల్పంగా 5 నుంచి 8 స్థానాలకు (ఆర్‌ఎస్‌పి)తో కలుపుకుంటే 9 స్థానాలకు పెరిగింది. ఇది చాలదు. కేరళలో వామపక్షాలకు ఒక్క సీటు మాత్రమే రావడం దిగ్భ్రాంతి కలి గించింది. కాంగ్రెసు అధికారంలోకి వచ్చినా మౌలిక సమస్యలు పరిష్కారం లేదన్న మాట వాస్తవమే. అయినా గుడ్డికంటే మెల్ల కన్ను మేలన్నట్లుగా పెద్దశత్రువును ఓడించేందుకు, ప్రతి పక్ష బూర్జువా పార్టీలను బలపరచడం వామపక్షాలకు అనివార్యం.


మనదేశంలో రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి పరిమితు లున్నాయి. సంవత్సరాల తరబడి తప్పుడు కేసుల్లో మేధావులను అరెస్టు చేసి, చార్జిషీటులు లేకుండా, బెయిల్ లేకుండా చేస్తున్న పరిస్థితుల నుంచి బైటపడేందుకు కోర్టులకు ధైర్యం కావాలి. నిజాయితీ అధికారులకు సాహసం పెరగాలి. భావ ప్రకటనా స్వేచ్ఛను, ఊపిరి తీసుకునేందుకు, ప్రజా సమస్యలపై ఆందోళ నలు, పోరాటాలు సాగించేందుకు, అబద్ధాల నుంచి, అసత్యాల నుంచి, తప్పుడు దాడుల నుంచి, కుహనా దేశభక్తుల నుంచి ఫాసిస్టు ధోరణలు నుంచి, దేశాన్ని కాపాడేందుకు ప్రత్యామ్నాయ ప్రభుత్వం వస్తే, అవకాశాలు పెరుగుతాయని ప్రజలు విశ్వసిం చారు. బలమైన ప్రతిపక్షం ప్రజలలో కొంత వరకు విశ్వాసాన్ని నింపుతుంది. వామపక్షాల పోరాటాలు రానున్న కాలంలో ముఖ్యం. అధిక ధరల మీద, నిరుద్యోగం మీద, దళితులు, మైనా రిటీలపై దాడులకు వ్యతిరేకంగా, కార్మికుల హక్కుల రక్షణకోసం రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిరంతర పోరాటాలు తక్షణావసరం. భిన్న భాషలు, మతాలు, సంస్కృతుల భారతదేశ సమగ్రతను, సమైక్యతను కాపాడుకునేందుకు వామపక్ష, సెక్యులర్ ప్రజాతంత్ర పార్టీల, శక్తుల ఐక్యతతో పోరాటం సాగించాలి. ❑

# ఓటర్ల వేటుతో మోదీకి శృంగ భంగం



- డివివియస్ వర్మ

**ఎన్నికలు ముగిశాయి. ఫలితాలూ వచ్చేశాయి. మళ్ళీ మోదీ సర్కార్ రాబోతుంది. ఈ సారి మోదీ స్వంత కాళ్ళ మీద అందలం ఎక్కడం లేదు. రెండు ఊత కర్రల సాయంతో కుర్చీని అతి కష్టం మీద అందుకోబోతున్నారు. ఈ ఎన్నికలలో దేశ ప్రజలు తమ ఓటుతో మోదీకి శృంగ భంగం చేశారు. ఇది నైతికంగా మోదీకి పరాజయం. రాజ్యాంగం మీద దాడికి సిద్ధమైన మోదీ పరివారం దూకుడికి ప్రజలు కళ్ళెంవేశారు. రాజ్యాంగాన్ని మారుస్తామని, ఒకే దేశం ఒకే ఎన్నిక, ఒకే నేత అన్న మోదీ గ్యారంటీకి ఓటర్లు బ్రేకు వేశారు. అందుకే ఇది ఘనమైన ప్రజా విజయం. ప్రజాస్వామ్యాన్ని మట్టు పెట్టాలని, విద్వేష రాజకీయం కోసం మోదీ తలపెట్టిన వికృత క్రతువు ను భగ్నం చేసిన జనవిజయం ఇది. ఓటర్ల తీర్పులో పాలక, ప్రతిపక్షాలు నేర్చుకోవలసిన గుణపాఠాలు ఉన్నాయి. ఓటర్లుగా వ్యవహరించే మనకు స్ఫూర్తి నిచ్చే అంశాలు వున్నాయి.**




మొదటగా ఉత్తరప్రదేశ్ ఎన్నికల ఫలితాలు చాలా మందిని ఆశ్చర్యపరిచాయి. మోదీ ఆ రాష్ట్రం నుంచే పోటీ చేశారు. యోగీ ఆ రాష్ట్రాన్ని పాలిస్తున్నారు. వీరిద్దరూ అజేయుల కింద లెక్క. పైగా ఈ రాష్ట్రంలోనే అయోధ్యలో రామాలయాన్ని నిర్మించారు. దానిపేరు మీద దేశం మొత్తం మీద ఓట్లు దండుకోగలమని భావించారు. ఆలయం వున్న ఫైజాబాద్‌లోనూ, ఉత్తర ప్రదేశ్‌లోనూ బీజేపీ ఓటమి పాలైంది. నిత్య జీవితం సంకటితమైనప్పుడు ప్రజలు తమ ఓటు శక్తిని ప్రయోగిస్తారు. ప్రజలు తలుచుకుంటే అజేయులంటూ ఎవరూ వుండరని అందరూ పరాజితులే అవుతారని రుజువు చేశారు. మోదీ హవా, సమ్మోహనా శక్తి తాత్కాలిక నీటి బుడగలేనని తేల్చేశారు.

ఈ ఎన్నికలకు మరొక ముఖ్యమైన ప్రత్యేకత వుంది. ఎన్నికల ప్రచారంలో సిద్ధాంతపరమైన, విధానపరమైన అంశాలు ప్రధాన పాత్ర పోషించడం ఒక కొత్త మేలి మలుపు. ఇండియా కూటమి ఈ చర్చను సమర్థవంతంగా నిర్వహించింది. ప్రజాస్వామ్యాన్ని, పౌర స్వేచ్ఛనే కాదు దళితులకు, ఆదివాసీలకు, బహుజనులకు, మైనారిటీలకు రక్షణ కవచంగా వున్న రాజ్యాంగాన్ని పరిరక్షించే ఎన్నికల పోరాటంగా రాహుల్‌గాంధీ ప్రకటిస్తూ రాజ్యాంగ పుస్తకాన్ని చూపిస్తూ చేసిన ప్రసంగాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మత విద్వేష సిద్ధాంతాలను ఇండియా కూటమి ఎండగట్టింది. కులగణన ద్వారా సామాజిక న్యాయాన్ని అందించే అవకాశాలను ప్రచారంలోకి తెచ్చింది. రాజకీయం అంటే అదానీలకు అంబానీలకు దేశాన్ని దోచి పెట్టడం కాదంటూ మోదీ పాలన ప్రజల కోసం కాదని ప్రచారం చేసింది. రాబోయే కాలంలో పార్టీల మధ్య జరిగే సిద్ధాంత సంఘర్షణ కు ఈ ఎన్నికల ప్రచారం దారి చూపించేదిగా వుంది. ఈ ఎన్నికల ప్రచారంలో రెండు కూటములూ రెండు భిన్నమైన ధోరణుల్లో సాగించాయి. ఇండియా కూటమి సిద్ధాంతపరమైన అంశాలతోపాటు ప్రజా సమస్యల చుట్టూ, నిర్దిష్టమైన తక్షణ ఉపశమన పథకాల చుట్టూ ప్రచారాన్ని సాగించాయి.

దేశంలో తాండవిస్తున్న నిరుద్యోగాన్ని ప్రచారాస్త్రంగా మలిచింది. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామన్న మోదీ వాగ్దాన భంగంపై విమర్శలు గుప్పించారు. కేంద్ర ప్రభుత్వం అధీనంలో ఖాళీగా వున్న 30 లక్షల ఉద్యోగాల భర్తీతోపాటు, నిరుద్యోగులకు అప్రెంటిస్ షిప్ పథకాన్ని ప్రకటించారు. పూనకం వచ్చినట్టు “మోదీ మోదీ” అంటూ కేరింతలు కొట్టిన చాలా మందిని యువతని ఆకర్షించగలిగారు. నిత్య జీవితంతో చెలగాటం ఆడుతున్న ధరల పెరుగుదలను మరో ప్రచార సాధనం చేసుకున్నారు. ధరలు తగ్గించడానికి మోదీ ప్రవేశ పెట్టిన

తప్పుడు జీఎస్టీని సరిదిద్దుతామని, పేద కుటుంబాల మహిళలకు నగదు బదిలీ ద్వారా ఉపశమనం కల్పిస్తామని ప్రచారం చేశారు. రైతుల పంటలకు లాభసాటి ధరలు వచ్చేలా కనీస మద్దతు ధరను చట్ట బద్ధం చేస్తామని ప్రచారం చేశారు. మహిళలపై అత్యాచారాల దోషులపై మోదీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపకపోగా నిందితులను ఎలా అక్కున చేర్చుకున్నదీ బ్రిజ్ భూషన్, బిల్కిస్ బానో కేసులో నిందితులకు క్షమాభిక్ష పెట్టడం, మణిపూర్ అత్యాచారాలపై మౌనం పాటించడం వంటి అంశాలు ప్రచారంలో భాగం చేశారు.

మరో పక్క మోదీ తన పదేళ్ళ పాలనపై తీర్పు చెప్పమని కోరే సాహసం చెయ్యలేదు. ప్రజా సమస్యలపై చర్చ సాగకుండా పక్కదారి పట్టించడానికి రోజుకో వివాదాస్పద అంశాన్ని ప్రచారంలోకి తెచ్చారు. మోదీ తన పేరులోని మొదటి అక్షరం "మ" తో ప్రారంభమయ్యే పదాల నినాదాలు ఎంతగా వాడితే అంతగా ఓట్ల వరద పారుతుందన్న జ్యోతిష్యాన్ని నమ్ముకుని దాని చుట్టూ ప్రచారాన్ని రూపొందించుకున్నారు. మతం, మందిరం, మసీదులతో సరిపెట్టు కోకుండా మచిలీ, మటన్, మంగళ సూత్రం, చివరికి ముజ్రా దాక సాగ లాగారు. మొత్తం మీద ఇండియా కూటమి "పాజిటివ్" ప్రచారం చేసి లాభపడింది. మోదీ "నెగిటివ్" ప్రచారానికి దిగి చతికిలపడ్డారు

ఒకే దేశం ఒకే ఎన్నికను ఉమ్మడి పౌరస్మృతి అన్నది మోదీ ఎన్నికల నినాదం ఈ దేశంలో వున్న భిన్నత్వాన్ని మోదీ సర్కారు గుర్తించదు. ఒకే దేశం, ఒకే భాష, ఒకే సంస్కృతి పేరుతో ప్రాంతీయ ప్రత్యేకతల్ని, వారి ఆకాంక్షల్నీ, వాటికి ప్రాతినిధ్యం వహించే ప్రాంతీయ పార్టీలను నిర్వీర్యం చేయడమే దీని లక్ష్యం.. ఈ ఎన్నికలలో ప్రాంతీయ ప్రత్యేకతల ముందు మోదీ హవా సాగదని తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పంజాబు కొంత మేరకు మహారాష్ట్రలు తీర్పు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు దేశంతో పొత్తు లేకుండా పోటీ చేస్తే బీజేపీకి ఇక్కడ ప్రవేశం వుండేది కాదు. మోదీ వచ్చి ప్రచారం చేసినా వారికి ఎక్కడా డిపాజిట్లు కూడా దక్కేవి కావు. దేశంలో ప్రాతీయ వైవిధ్యానికి గల శక్తిని ఈ ఎన్నికలు ధృవపరుస్తున్నాయి.

ఎన్నికలలో మోదీ అనుకున్నది ఒకటైతే ఓటర్లు తీర్పు మరొకటైంది. మోదీ కోరిన 370 సీట్లకి ఓటర్లు జైకొట్టలేదు. 239కి దించి కూర్చో పెట్టారు. ఇప్పుడు మిత్రపక్షాలుగా వున్న చంద్రబాబునాయుడు, నితీష్‌కుమార్‌లు లేకపోతే మోదీకి ప్రధాని పదవి గల్లంతయ్యేది. అయితే ఈ ఇద్దరు నిన్నటి శత్రువులు, నేటి మిత్రులు. చంద్రబాబు 2018లో ఎన్‌డీఏ నుంచి బైటకు వచ్చి కాంగ్రెస్‌తో కలిశారు. 2023 నితీష్‌కుమార్ ఎన్‌డీఏ నుంచి ఇండియా కూటమికి తిరిగి ఎన్‌డీఏ కూటమికి చేరారు. ఒకప్పుడు మోదీ పంచన చేరి అడుగులకు మడుగు లొత్తిన వారు ఇప్పుడు చక్రం తిప్పేవారయ్యారు. వీరిద్దరికీ రాష్ట్రంలో ముఖ్యమంత్రుల పదవులే ముఖ్యం మిగిలినవన్నీ తర్వాతే. గతంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా అన్నది బలమైన ఎన్నికల సమస్య కాగానే ఆయన ఎన్‌డిఏను వదిలి పెట్టారు. ఇక్కడ రాజకీయంగా తనకు ముప్పు వాటిల్లే సమస్య ఎదురైతే ఎన్‌డిఏను వీడతారో గాని మోదీ కోసం రాష్ట్రాన్ని వదులుకోరు. ఇదే నీతీష్ కీ వర్తిస్తుంది.

మొత్తం మీద మోదీ ప్రభుత్వం మైనారిటీ ప్రభుత్వం. దినదిన గండంతో గడిచే ప్రభుత్వం. ఈ ఎన్నికలు "బాహుబలి" మోదీ ని ఇతరుల దయా దాక్షిణ్యాల మీద ఆధారపడి ప్రభుత్వాన్ని నడుపుకునే చేదు అనుభవాన్ని ఓటర్లు చవిచూపించారు. ఈ తీర్పు రాజ్యాంగ పరిరక్షణకు, ఆధిపత్య ధోరణుల మీద, ఫాసిస్టు పోకడల మీదా పోరాడే వారికి ప్రజలను జాగృతం చెయ్యడానికి తగిన సమయాన్ని, అవసరమైన భూమికను ఇచ్చింది. ఇది అభినందనీయమైన ప్రజా తీర్పు. ❑

# ఎన్నికల తీర్పు.. ఒక ముందడుగు

**(12వ పేజీ తరువాయి)**

పనిచేయాల్సి వుంటుంది. 'ఇండియా' కలయిక పార్టీల కొద్ది మాసాల అనుభవాన్ని గమనిస్తే ఒక కచ్చితమైన కూటమిగా గాక విశాల వేదికగా వ్యవహరించడం ఉపయుక్తమని తేలింది. వైవిధ్యాలనూ, పరస్పరం పోలి వుండే రాజకీయ కార్యక్రమాలు, విధానాలను వేదిక ఇముడ్చుకునే వీలు కలిగింది. ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సమాఖ్యతత్వానికి కట్టుబాట్లు సూత్రాలుగా పని చేయాలి. నిరంకుశ మతతత్వ ప్రమాదంపై పోరాటం ఎంత మాత్రం ముగియలేదు. వామపక్షాలు బలోపేతం కోసం 'ఇండియా' వేదిక సాధించిన విజయంలో భాగస్వాములైన సిపిఐ ఎం, వామపక్షాలు తమ తమ పార్టీల ఎన్నికల ఫలితాలను విమర్శనాత్మకంగా సమీక్షించుకోవాల్సి వుంటుంది. వామపక్షాల సీట్ల సంఖ్యలో స్వల్పమైన పెరుగుదల వచ్చింది. గత సభలో అయిదు సీట్లుండగా ఇప్పుడవి ఎనిమిదికి చేరాయి. సిపిఐ ఎం 4, సిపిఐ 2, సిపిఐ ఎంఎల్ 2 తెచ్చుకున్నాయి. కేరళలో సిపిఐ ఎం, ఎల్‌డిఎఫ్‌లు మరిన్ని సీట్లు తెచ్చుకోగలమని భావించగా వచ్చిన ఫలితాలు నిరుత్సాహపరిచేవిగా వున్నాయి. ఇందుకు కారణాలేమిటో ఆత్మ విమర్శనా పూర్వక పరిశీలన జరగాలి. లోపాలను గుర్తించాలి. రానున్న రోజుల్లో వామపక్షం మరింత బలోపేతం కావడం అత్యంత ప్రాధాన్యత గల అంశం. ఎందుకంటే హిందూత్వ కార్పొరేట్ శక్తుల కూటమిపై సమరం మరింత ఉధృతం కావడం అనివార్యం. ❑

# పాత మోదీపై కొత్త మోదీ నెగ్గగలరా ?



- కరణ్ థాపర్

**నరేంద్రమోదీ నిస్సందేహంగా తిరిగి అధికారంలోకి వచ్చినప్పటికీ, ఆయన ఊహించిన దానికి భిన్నమైన నాటకీయ పరిస్థితుల్లో ఆ రావడం అన్నది జరిగింది. కీలకమైన ప్రశ్న ఏమిటంటే - ప్రధానమంత్రిగా ఇప్పుడు ఎదుర్కొంటున్న పూర్తి భిన్నమైన పరిస్థితులను మోదీ స్వాభావికంగా, మానసికంగా ఎలా సర్దుబాటు చేసుకోగలరన్నదే !**

**సంకీర్ణ ప్రభుత్వాన్ని నడిపించేందుకు మిత్రపక్షాలను దగ్గర చేసుకోవడం, తరచూ వారికి లోబడి ఉండడం, నిరంతరం వారిని సంతుష్టులుగా ఉంచడం వంటి వాటికి ఆయన సంసిద్ధత కలిగి ఉంటారా ? గుజరాత్ ముఖ్యమంత్రిగా 13 సంవత్సరాలు, భారత ప్రధానిగా పదేళ్లు ఆయనకు ఇలా చేసే అవసరం లేకపోయింది. అందుకు భిన్నంగా పాత మోదీ ఇప్పుడు కొత్త మోదీ కాగలరా ?**

మునుపు మీరీ నానుడిని నిస్సందేహంగా విని ఉంటారు. ఎంచేతనంటే ఇదొక కాదనలేని సత్యం. కొరుకుడు పడనివిగా కనిపించే పరిస్థితులను ఓటర్ల సమష్టి విజ్ఞత చక్కబెట్టగలగటమే ప్రజాస్వామ్యంలోని అద్భుతమైన విషయం. 1977లో ఇలా జరిగింది. మళ్లీ ఈ జూన్ 4న ఇది సంభవించింది. ఫలితాల్లో పై విధమైన అద్భుతాన్ని చాలా మందే ఆశించినప్పటికీ, నిజానికి కొద్దిమందే అది కార్యరూపం దాల్చుతుందని భావించారు.

నరేంద్రమోదీ నిస్సందేహంగా తిరిగి అధికారంలోకి వచ్చినప్పటికీ, ఆయన ఊహించిన దానికి భిన్నమైన నాటకీయ పరిస్థితుల్లో ఆ రావటం అన్నది జరిగింది. గత దశాబ్ద కాలంలో ఎన్నడూ లేనంత దారుణమైన ఫలితాలను ఈ ఎన్నికల్లో బీజేపీ చవి చూసింది. మెజారిటీకి 30కి పైగా తక్కువ సీట్లు వచ్చాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి, విశ్వసనీయత ఎల్లప్పుడూ ప్రశ్నార్థకమైన మిత్రపక్షాల మద్దతు అవసరం. గతంలో వారు బీజేపీని విడిచి పెట్టిన సందర్భాలు ఉన్నాయి. వారు మళ్లీ అలా చేస్తారనటాన్ని తోసిపుచ్చలేము.

ఇది ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ మూడోసారి పాలనపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఇప్పటికైతే వాటికి మన సమాధానాలు లేవు. బహుశా మోదీకి కూడా అవి తెలియక పోవటానికే అవకాశం ఎక్కువ. కానీ ఆ ప్రశ్నలు ఆయన ఎదుర్కొనే సవాలును సూచిస్తాయి. ఆ ప్రశ్నల సమాధానాలు ఆయన గురించి ఎన్నో విషయాలు వెల్లడిస్తాయి. భారతదేశానికి ఎదురవనున్న ప్రమాదాలను, లేదంటే కనీసం సమస్యలను అవి బయట పెడతాయి. బీజేపీ 370 సీట్లు గెలుచుకుంటుందని మోదీ మొదటి నుంచి జోస్యం చెబుతూ వచ్చారు. ఐదో విడత పోలింగ్ అయ్యాక 'ఎకనమిక్ టైమ్స్'తో మాట్లాడుతూ తమ పార్టీ అప్పటికే 272 మార్కును దాటేసిందని అన్నారు. కానీ, చివరికి అది 240 సీట్లతోనే ముగిసింది. మెజారిటీకి చాలా తక్కువ. కనుక, ఇవాళ ఆయన... కలవరపడే మనిషా లేక దులిపేసుకుని వెళ్లగలిగినంత మొద్దు చర్మం ఉన్నవారా?

వారణాసిలో ఆయనకు వచ్చిన ఓట్ల మాటేమిటి? 2019లో ఆయనకు 4 లక్షల 80 వేల మెజారిటీ వచ్చింది. అదిప్పుడు కేవలం లక్షా ఐదు వేలకు పరిమితం అయింది. "గంగా మేరీ మా హై, ముఝె గంగా నే గోద్ లియా హై" (గంగానది నా మాతృమూర్తి. గంగమ్మ తల్లి నన్ను దత్తత తీసుకుంది) అని గత నెలలో చెప్పుకున్న ఒక మనిషి.. పూర్తి వ్యక్తిగతమైన ఈ తిరోగమనాన్ని ఎలా తీసుకుంటారు?

ఏదేమైనా కీలకమైన ప్రశ్న ఏమిటంటే - ప్రధాన మంత్రిగా ఎదుర్కొంటున్న పూర్తి భిన్నమైన పరిస్థితులను మోదీ స్వాభావికంగా, మానసికంగా ఎలా సర్దుబాటు చేసుకోగలరు? లేదా, సంకీర్ణ ప్రభుత్వాన్ని నడిపేందుకు మిత్రపక్షాలను దగ్గర చేసుకోవటం, తరచూ వారికి లోబడి ఉండటం, నిరంతరం వారిని సంతుష్టులుగా ఉంచటం వంటి వాటికి ఆయన సంసిద్ధంగా ఉన్నారా? గుర్తు చేసుకోండి. గుజరాత్ ముఖ్యమంత్రిగా 13 సంవత్సరాలు, భారత ప్రధానిగా 10 సంవత్సరాలు ఆయనకు ఇలా చేసే అవసరం లేకపోయింది. బదులుగా ఆయన అభీష్టం ప్రతి ఒక్కరికీ ఆదేశం అయింది. ఆయన కేంద్రీకృత ప్రభుత్వాన్ని నడిపారు. ప్రధాని కార్యాలయం కోరినట్లే మంత్రులు నడుచుకున్నారు. ఒక్కరు కూడా ఇదేమిటి అని అడిగే సాహసం చేయలేదు. పార్లమెంటు, జ్యుడీషియరీ, మీడియా వంటి స్వయం ప్రతిపత్తి కలిగిన వ్యవస్థల పట్ల ఆయన వైఖరి గురించి ఏమిటి? శ్రీ 'పాత మోదీ' పార్లమెంటును పలుమార్లు విస్మరించారు. న్యాయశాఖలోని నియామకాలను నిలిపివేశారు. మీడియాను తీసిపడేశారు. కానీ ఇప్పుడు **(మిగతా 18వ పేజీలో)**

# మూడో అవతారంలో మోడీ సర్కార్



- తెలకపల్లి రవి

**అత్యంత శక్తివంతుడైన మోడీ 3.0గా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తారని సాగిన ప్రచారం విఫలమై బలహీనపడిన మూడో అవతారంగా ఆదివారం అధికారం స్వీకరించడం ఆసక్తికర పరిణామం. దీనికి మరో విశేషణం కూడా జోడించవలసి వుంటుంది. మారిన పరిస్థితుల్లో ప్రధాని పదవిని అందుకోగల పోటీదార్లుగా బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, ఆంధ్రప్రదేశ్‌లో అధికారం చేపట్టబోతున్న చంద్రబాబు నాయుడుకు అవకాశం లభించిందన్న ప్రచారం వీగిపోయింది.**




నితీశ్‌కు మేమెప్పుడూ అలాంటి ప్రతిపాదన ఇచ్చింది లేదని 'ఇండియా' నాయకులు ప్రకటించేశారు. ఇక చంద్రబాబు విషయానికి వస్తే ఆయన అలాంటి ఆలోచనేదీ సూచనగానైనా చెప్పకపోగా నరేంద్రమోడీ నాయకత్వ పటిమను, దార్శనికతను ఆకాశానికెత్తి పొగిడారు. ఇంకా చెప్పాలంటే నితీశ్ మోడీకి పాదాభివందనం చేయబోగా పక్కనున్న వారు వారించాల్సి వచ్చింది. బీహార్‌లో ఎన్నికల ప్రచారం సమయంలో ఇలాగే నితీశ్ పాదాభివందనానికి విఫలయత్నం చేశారు. నితీశ్ లాంటి సీనియర్ నాయకుడు పదవి కోసం మోడీ కాళ్లు పట్టుకోవాలనుకోవడం బీహార్ ప్రజలకు మింగుడుపడటం లేదని మృత్యుంజయ తివారి అనే సీనియర్ నాయకుడు వ్యాఖ్యానించారు. ఇక చంద్రబాబు విషయానికి వస్తే దార్శనిక నేత మోడీ నాయకత్వంలో తాము ఎన్‌డిఎగా పోటీ చేస్తున్నట్టు ఒకటికి రెండుసార్లు వారు సంయుక్త ప్రకటనలే చేశారు. మోడీని ఎన్నుకునే తరుణంలోనే చంద్రబాబు మాట్లాడుతూ గతంలో అనేకమంది నాయకులు దేశాన్ని పాలించినా మోడీ హయాంలోనే మన దేశం అంతర్జాతీయ ఖ్యాతినార్జించిందని ప్రశంసలతో ముంచెత్తారు. మోడీ, అమిత్ షాలతో సహా బిజెపి కేంద్ర నాయకులు వచ్చి ఉమ్మడి ప్రచారంలో పాల్గొన్న కారణంగానే ప్రజల్లో కేంద్రం మనతో వుందనే నమ్మకం కలిగిందని వ్యాఖ్యానించారు. ఇక జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మోడీ వుంటే భారతదేశం ఎవరి ముందూ తల వంచే పరిస్థితి రాదని ప్రత్యేకంగా కీర్తించారు. మొత్తంపైన బిజెపి మనుగడ కోసం మిత్రపక్షాలపై ఆధారపడుతుంది గనక తమ కోర్కెలపై ఒత్తిడి చేసే అవకాశం పెరుగుతుందని వ్యాఖ్యాతలు వేసిన అంచనాలు విఫలమై వారు మరింతగా మోడీ ఘనతనే ఆకాశానికి ఎత్తేందుకు సిద్ధమైనారు.

### చెంపలేసుకుంటే మారిపోయినట్టేనా?

ప్రభుత్వం ఏర్పడుతున్న ప్రారంభఘట్టంలోనే ఇలా వుంటే రేపు మోడీ కాస్త స్థిరపడ్డాక ఏం జరుగుతుందో ఊహించడం కష్టమేమీ కాదు. ఆ అసహనం, అహం మోడీ మాటల్లో తొంగి చూసింది. నిజానికి మోడీ నాయకుడుగా ఎన్నికైన సమయంలో వ్యవహరించిన తీరే ఆయన ఎలాంటి పాఠం నేర్చుకున్నారో తెలియజెప్పింది. రకరకాల వాక్య విన్యాసాలతో చప్పట్లు కొట్టించుకునే మోడీ ముందుగా రాజ్యాంగం దగ్గరకు వెళ్లి కళ్లకద్దుకున్నారు. తను, హోం మంత్రి అమిత్‌షా మాట్లాడిన తీరు వల్ల కొందరు నేతల వాచాలత వల్ల బిజెపి గెలుపు రాజ్యాంగానికి ముప్పు అని ప్రజలకు అర్థమైనందునే ఆమడ దూరంలో ఆపేశారని మోడీకి అర్థమైంది. అందుకే దాన్ని కాపాడతానని చెప్పడానికి ఈ ప్రహసనం తలపెట్టారన్నమాట. మాట్లాడితే ప్రతిదీ మార్చేయాలనీ తీసేయాలని చెప్పేవారు వున్న రాజ్యాంగాన్ని ఏదో గౌరవిస్తున్నట్టు చెప్పుకోవడం అందుకోసమే. అయితే ఇప్పుడు పదవీ స్వీకారం కోసం ఏం చెప్పినా రేపు వాస్తవంగా

ఏం జరిగేది ప్రజలకు తెలుసు గనకే అలాంటి తీర్పునిచ్చారు. బిజెపి మొదట్లో చేసిన హడావుడితో పోలిస్తే ప్రస్తుత పరాధీనత తీవ్రమైన కుదుపు లాంటిదే. కానీ అదేదో చిన్న విషయమైనట్టు మోడీ తన ప్రసంగంలో ఎన్‌డిఎ తిరిగి వచ్చేసిందని గొప్పలు పోయారు. 30 ఏళ్లుగా ఎన్డీఎ అత్యంత విజయవంతమైన కూటమిగా పురోగమిస్తున్నదంటూ తన పదేళ్ల నిర్వాకాలను కప్పిపుచ్చే పాచిక వేశారు. ఎందుకంటే గత రెండుసార్లు పేరుకు ఎన్‌డిఎ ప్రభుత్వాలైనా బిజెపికి కూడా పెద్ద మాట లేకుండా కేవలం మోడీ ఏక వ్యక్తి ప్రాబల్యమే నడిచిన తీరు ఎవరు మర్చిపోతారు? వారు చాలా అపహాస్యం చేసిన 'ఇండియా' వేదిక వాస్తవ రూపం దాలుస్తుంటే ఉలిక్కిపడి అప్పుడే మళ్లీ ఫోటో సెషన్ లాంటి ఎన్డీఎ భేటీ నాటకం నడిపారు. అలాంటి మోడీ ఇప్పుడు ఫలితాల తర్వాత 'సర్వ పంథ్ సమభావ్' అంటూ అన్ని పార్టీలనూ సమానంగా చూస్తామనే పాట ఎత్తుకున్నారు. వాస్తవానికి లౌకిక తత్వాన్ని 'సర్వ ధర్మ సమ భావ్' అంటూ అన్ని మతాలకు ప్రోత్సాహంగా మార్చింది పాలకులే. మెజారిటీ మత భావాలను సంతృప్తి పరుస్తూ మైనార్టీలను అభద్రత లోకి నెట్టింది ఈ పోకడలే. దాన్నే ఇప్పుడు భాగస్వామ్య పార్టీలకు అన్వయించి 'సర్వ పంథ్ సమ భావ్' అంటున్నారన్నమాట.

### ఎన్టీఆర్, చంద్రబాబు భిన్న వైఖరులు

టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు ఏం చెప్పినా ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి లోకేశ్ మాత్రం ఈ విషయంలో మరింత సూటిగా మాట్లాడారు. తాము ముస్లింల నాలుగు శాతం రిజర్వేషన్ కొనసాగిస్తామన్నారు. అదే సమయంలో మైనార్టీలకు సహాయ పడటం తప్ప బుజ్జగింపు తమ వైఖరి కాదంటూ బిజెపి తరహా వాదన చేశారు. జాతీయ, ప్రాంతీయ ఆకాంక్షల మధ్య సమతుల్యత వుండాలని ఆయన అనడం ఎ.పి ప్రత్యేక సమస్యల పరోక్ష ప్రస్తావనేనని కొందరు వ్యాఖ్యానించారు గాని వాస్తవానికి ఇంతవరకూ చంద్రబాబు నుంచి తమకు ఎలాంటి షరతుల సమస్యలు ఎదురవలేదని బిజెపి వర్గాలు చెబుతూనే వున్నాయి. మంత్రి పదవుల విషయంలోనూ ఏడు పదవులు, స్పీకర్ స్థానం వంటి మాటలు గతంలో వినిపించగా ఇప్పుడు రెండు మూడు పదవులు, డిప్యూటీ స్పీకర్ అంటున్నారు. నితీశ్ కుమార్‌గానీ చంద్రబాబునాయుడు గానీ ఏకంగా ప్రధాని పదవి చేపట్టే అవకాశాలున్నాయనే ఊహాగానాలు నడిచాయి.

1996లో యునైటెడ్ ఫ్రంట్(యు.ఎఫ్) కాలంలో ఆయనను ఈ పదవి చేపట్టవలసిందిగా కోరిన ఉదాహరణ గుర్తు చేస్తున్నారు. వాస్తవం ఏమంటే ఆ సమయంలో సిపిఎం నాయకుడు హరికిషన్ సింగ్ సూర్జిత్ లౌకిక పార్టీల ఐక్యతలో కీలక భూమిక పోషించేవారు. చంద్రబాబును ప్రోత్సహించిందీ యు.ఎఫ్ కన్వీనర్‌గా చేసిందీ ప్రధానంగా సూర్జిత్ చొరవే. ఆ బాధ్యతలో వుంటూనే ఎన్డీఎ వైపు వెళ్లిన రాజకీయం చంద్రబాబుదే. చక్రం తిప్పడం అనే పొగడ్తల వెనక ఈ సత్యాన్ని చాలా మంది తరచూ మర్చిపోతుంటారు. ప్రాంతీయ పార్టీ అయినా తమ నాయకుడు ఎన్టీఆర్ జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర వహించారని కూడా తరచూ చెబుతుంటారు. వాస్తవం ఏమంటే ఎన్టీఆర్ లౌకిక పార్టీల కూటమిగా నేషనల్ ఫ్రంట్‌కు మాత్రమే చైర్మన్‌గా వున్నారు. ఆ ఫ్రంట్ ప్రభుత్వాన్ని బిజెపి రథయాత్రతో కూల్చివేసిన తర్వాత ఎన్టీఆర్ ఎన్నడూ మళ్లీ ఆ పార్టీతో పొత్తు పెట్టుకోలేదు. 1994లో టిడిపి ఉమ్మడి రాష్ట్రంలో అసాధారణ విజయం సాధించినప్పుడు ఆయన కమ్యూనిస్టులతో మాత్రమే కలసి పోటీ చేశారు. వీటన్నిటి సారాంశం ఒక్కటే. బిజెపి మిత్రుల పట్ల పెద్ద విశ్వాసంగా వుండదు. గతంలో దానితో కలసి పనిచేసిన పార్టీలన్నీ టిడిపితో సహా మోసపోయిన చరిత్రే దీనికి నిదర్శనం. అవసరార్థం కలయిక అంటే అర్థం చేసుకోవచ్చుగానీ దానివల్ల మోడీ స్వభావం మారిపోతుందని, వాళ్లు అడిగినవి చేసి ప్రాంతీయ ఆకాంక్షలను నెరవేరుస్తారని నమ్మడం నిరాధారం.

### మోడీ ప్రసంగమే నిదర్శనం

రాజ్యాంగాన్ని కళ్లకు అద్దుకోవడం వంటి నాటకీయ చర్యలను పక్కన పెడితే మోడీ ఈ సభలోనూ, రాష్ట్రపతిని కలిసి ఆహ్వానం అందుకున్న తర్వాత మాట్లాడిన తీరే ఆయనలో మార్పు లేదని చెబుతుంది. 'సర్వ పంథ్ సమ భావ్' అన్న ప్రధానమంత్రి 'ఇండియా' వేదికను విధ్వంసక శక్తిగా తిట్టిపోశారు. ఎన్డీఎ అఖండ విజయం అందుకుందని చెప్పుకుంటూ అనేక రాష్ట్రాల ను పాలిస్తున్న 'ఇండియా' పార్టీలు ప్రజల మద్దతుతో గణనీయంగా బలం పెంచుకున్నాయనే సత్యాన్ని కాస్తకూడా ఆమోదించలేకపోవడం ఆయన అసహనాన్ని వెల్లడించింది. మరో వంక ఒడిషాలో విజయం ఘనమైనట్టు ఉత్తర ప్రదేశ్‌లో ఎదురుదెబ్బ లెక్కలోది కానట్టు చిత్రించి సంతోషించారు. అలాంటిది నాయకులను బలోపేతం చేస్తారని ఎవరైనా ఎలా నమ్మగలరు? కాంగ్రెస్ వంద స్థానాలకు చేరిన వాస్తవాన్ని కూడా హరాయించుకోలేని మోడీ ఆ పార్టీకి మూడు ఎన్నికల్లో కలిపినా తమకు ఈ ఒక్కసారి వచ్చినన్ని సీట్లు రాలేదని ఎద్దేవా చేయడం ప్రధానికి తగిన పనేనా ? చంద్రబాబు, నితీశ్ కుమార్ రాష్ట్రాలకు సహాయంపై ప్రత్యేకంగా ప్రస్తావనలు చేసినా మోడీ మాత్రం ఆ ముచ్చటే పెట్టుకోకపోవడం యాదృచ్ఛికం కాదు.

ఇక ముస్లింలు, దళితులలో సృష్టించిన సందేహాలను తొలగించడం అవసరమనీ ఆయన అనుకోలేదు. ఎందుకంటే వాటిని కొనసాగించాలన్నదే బిజెపి, ఆర్.ఎస్.ఎస్‌ల వ్యూహం. దేశానికి బాగా ఉపయోగపడే నిర్ణయాలు చేస్తాము. మరింత కఠినంగా వేగంగా పనిచేస్తాము అంటూ శ్లేష ప్రయోగించారు.

ఈ ఎన్నికల ఫలితాలకు ముందే వచ్చే పదవీ కాలంలో చేయవలసిన పనులు చర్చించి ప్రచారంలో పెట్టిన మోదీ ఈ సభలోనూ తాము మరో పదేళ్లు పాలన చేస్తామన్నారు. అయిదేళ్లకు ఎన్నికైన సర్కారు పదేళ్ల గురించి చెప్పడమేంటి ? అంటే ఇందులోని అతి తెలివిని గమనించాలి. పూర్తి మెజారిటీ లేని మోదీని ఎవరో ఒకరు ఎప్పుడైనా కూలదోయవచ్చునని కథనాలు వచ్చాయి గనక ఏకంగా తమ పాలనా కాలాన్ని రెట్టింపు చేసి చెప్పేస్తున్నారన్న మాట. ప్రచారక్ ప్రధానమంత్రి (పిపిఎం) మోదీకి బాగా అలవాటైన వాగాడంబరం ఇదే.

**జాగ్‌తే రహెూ!**

ప్రభుత్వరంగంపైన లేదా ఉద్యోగ వర్గాల, రైతాంగ ఉద్యమాల కోర్కెలను నెరవేర్చే ప్రయత్నం చేస్తామని ఒక్క మాట కూడా అన్న దాఖలాలు లేవు. నిర్దిష్టంగా ఏ తరగతికి గానీ రాష్ట్రాలకు గానీ ఎలాంటి మాట ఇవ్వకుండా ఊకదంపుడుతో సరిపెట్టే వచోవిన్యాసం మోదీ స్వంతం. అయినా ఆయన వత్తాసుదార్లు మాత్రం దానికే పరవశించమని చెబుతుంటారు. ఈ ఎన్నికల తీర్పు ప్రధానంగా సమాఖ్యతత్వానికి, ఆర్థిక వనరుల బదలాయింపునకూ ప్రజలు ఇచ్చిన సందేశమని నిపుణులు అంటుంటే ప్రధాని ఆ మాటే చెవికెక్కించుకోలేదు. మరో వైపున నేను, బాబు, నితీశ్ అందరం సుపరిపాలన(గుడ్ గవర్నెన్స్)కు ప్రతినిధులమని చెప్పుకున్నారు. ఎవరైనా సరే నిధులు లేకుండా ఎలా సుపరిపాలన చేయగలరు ? ఎ.పిలాంటి విభజిత రాష్ట్రం అప్పుల నుంచి ఎలా బయటకు రాగలదు ? ఎ.పితో సహా చాలా రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకుపోవడం గురించి వింటుంటాం గానీ మోడీజీ పాలిస్తున్న కేంద్రమే దాదాపు రెండు కోట్ల కోట్ల అప్పులో దిగబడిపోయిందనే నిజానికి సమాధానమేదీ? ఇలాంటి కఠిన ప్రశ్నలేవీ వేయకుండా విశ్వగురు, దార్శనికుడు అంటూ ఆయనను పొగిడి పరవశించడమేనా కర్తవ్యం? దీనంతటికీ పరాకాష్ట ప్రమాణ స్వీకారం సన్నివేశంలో చూడొచ్చు. ఏమైనా బిజెపి ఏకఛత్రాధిపత్యం, మోడీ ఏకపక్ష పాలనా ఘట్టం ముగిసింది. కానీ కేంద్ర నిరంకుశత్వ మతతత్వ ప్రమా దం మిగిలే వుంది. రకరకాల అవకాశవాదాల మధ్య అనుకూ లతల మధ్య లౌకిక శక్తులు దాన్ని అడ్డుకోవలసిన బాధ్యత మరింత పెరుగుతున్నది. పోగా మోడీ బలహీనపడిన కారణంగా కార్పొరేట్ ఒత్తిళ్లు, ఈ సర్కారు లొంగుబాట్లు ఇంకా పెరగొచ్చు కూడా. వాటన్నిటికీ మూల్యం చెల్లించవలసిన వారు ప్రజలే. మోడియా ప్రచారార్భాటాలకు లోబడిపోకుండా వాటి పట్ల అప్రమత్తత పెంచుకుందాం. ❑

# పాత మోదీపై కొత్త మోదీ నెగ్గగలరా ?

**(15వ పేజీ తరువాయి)**

శ్రీ 'బలహీన మోదీ' మరింతగా ఏకాభిప్రాయ విధానాన్ని అవలంబించవలసిన అవసరం ఉంటుంది. లేదంటే తన మిత్ర పక్షాలకు ఆయన కోపం తెప్పించవచ్చు. తన సంకీర్ణాన్ని ప్రమాదంలోకి నెట్టేసుకోవచ్చు. అలా చేయటానికి ఆయన సిద్ధంగా ఉంటారా? ఇక విమర్శలకు, అసమ్మతికి ఆయన స్పందించే ధోరణి ఒకటి ఉంటుంది. శ్రీ పాత మోదీకి ఆ రెండూ నచ్చవన్నవి రహస్యమేం కాదు. కనుక శ్రీ కొత్త మోదీ సహించటాన్ని, సమ్మతించటాన్ని మాత్రమే కాదు.. రెండింటితో కలిసి ముందుకు సాగటాన్ని కూడా నేర్చుకోవాలి. అది అంత సులభమేనా?

మరికొన్ని ప్రశ్నలు కూడా ఉన్నాయి. వాటిలో కొన్ని ఇటీవల ఆయన చేసిన ప్రకటనలకు సంబంధించినవి. వాటిని ప్రజలు మరిచిపోయి ఉంటారని ఆయన అనుకోవచ్చు. ప్రస్తుతం నెలకొని ఉన్న రాజకీయ వాతావరణంలో కాకపోవచ్చు కానీ, మొత్తానికైతే నేననుకోవటం అవి గుర్తుండే ఉంటాయని! మొదటిగా, ఎన్నికల ప్రచారంలో ఆయన చెప్పిన కొన్ని విషయాలు ఉన్నాయి. ఆయన కనుక నవ్వటాన్ని, తేలిగ్గా తీసుకోవటాన్ని అలవరచుకోకపోతే అవి ఆయన్ని వెంటాడగలిగినవి. కానీ ఆయన అలా చేయగలరా? తనది దైవాంశ జననం అని ఆయన చెప్పుకోవడంపై అవహేళనలు ఎదురైతే ఆయన నవ్వుతూ, వాటిని పట్టించుకోకుండా ఉండగలరా ?

నా మాట గుర్తుపెట్టుకోండి. అవహేళనలు ఉంటాయి. అది జరిగినప్పుడు ఆయన కోపం తెచ్చుకుంటారా ? మరీ ముఖ్యంగా, ముస్లింలను దయ్యాలుగా చూపించకుండా ఉండలేకపోవటాన్ని నిలువరించుకోగలరా? ముస్లింలను చొరబాటు దారులుగాబీ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల నుంచి రిజర్వేషన్లను లాక్కుని లబ్ది పొందేవారిగా చూపే తదుపరి సందర్భాలలో మిత్రపక్షాలు అందుకు అంగీకరించే అవకాశం లేదు. కానీ అలాంటి భాష తన నుంచి స్వభావసిద్ధంగా బయటికి రాకుండా తనను తాను సంబాళించుకోగలరా ?

ఇది 2001 నుండి ఆయన వాక్చాతుర్యంలోని ఒక భాగమని గుర్తుంచుకోండి. నిజానికి నేను లేవనెత్తిన ప్రతిదాన్నీ ఒకే ఒక సాధారణ ప్రశ్నగా కుదించవచ్చు : శ్రీ పాత మోదీ ఇప్పుడు శ్రీ కొత్త మోదీ కాగలరా? ఆయన ప్రభుత్వం దాని పైనే ఆధారపడి ఉంటుంది. ఆయన పాలన దానిపైనే ఆధారపడి ఉంటుంది. ఆయన రాజకీయ భవిష్యత్తు కూడా! కానీ ఈ ప్రశ్నకు సమాధానం ఏమిటి? ❑

# రాష్ట్ర రాజకీయాలకు మళ్లీ జాతీయ ప్రాధాన్యం



- యోగేంద్ర యాదవ్

**పద్దెనిమిదవ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు దిగ్భ్రాంతికరంగా ఉన్నాయి. రాష్ట్ర రాజకీయాలు మళ్లీ జాతీయ ఎన్నికలలో కీలక పాత్ర వహించిన వాస్తవాన్ని ఆ దిగ్భ్రాంతిలో చాలామంది బహుశా గుర్తించలేదేమో?! తుది దశ పోలింగ్ రోజు జూన్ 4న ఏ పార్టీ/కూటమికి ఎన్ని సీట్లు వచ్చేది మేము ఇలా అంచనా వేశాము : బీజేపీకి 237తో సహా ఎన్డీఏకి 286, కాంగ్రెస్‌కు 89తో సహా ఇండియా కూటమికి 215. ఈ అంచనాలు, అంతిమ ఫలితాలకు ఇంచు మించు సమస్థాయిలో లేవూ ? ఆ అంతిమ ఫలితాలను ఒకసారి గుర్తు చేస్తాము: ఎన్డీఏ 292 (బీజేపీ 240), ఇండియా కూటమి 233 (కాంగ్రెస్ 99). మా అంచనాలు జోస్యాలు కావు. 2019 సార్వత్రిక పోరు తరువాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రాతిపదికన 'సర్దుబాటు' చేసిన లోక్‌సభ సీట్ల సంఖ్యలవి.**




ప్రతి లోక్‌సభ నియోజక వర్గంలోను పలు అసెంబ్లీ నియోజక వర్గాలు ఉంటాయి కదా. చివరిసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ఆధారంగా ప్రతి లోక్‌సభా నియోజకవర్గంలోను రాగల ఓట్లను పునఃగణించాము. ఈ సర్దుబాటు అంకెల వివరాలను ఏడు భాగాలుగా ఆయా దశల పోలింగ్ ముందు రోజున మేము ప్రచురించిన విశ్లేషణాత్మక వ్యాసాలలో వెల్లడించాం. అయితే గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ఆధారంగా ఆ తరువాత జరిగే లోక్‌సభ ఎన్నికల ఫలితాలను అంచనా వేయవచ్చని మేము చెప్పబోవడం లేదు. ఏమైనా ఈ సారి మా అంచనాలు ఇంచుమించుగా సమరీతిలో ఉన్నాయని రుజువయింది. అయితే ఇది యాదృచ్ఛికమే. చెప్ప వచ్చిన దేమిటంటే ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికలలో ఆయా పార్టీల జయా పజయాలను అంచనా వేసేందుకు గత లోక్‌సభ ఎన్నికల ఫలితాలకంటే రాష్ట్రస్థాయి ఎన్నికల ఫలితాల మెరుగైన ఆరంభ ప్రాతిపదికను సమకూర్చాయి. 2019 లోక్‌సభ ఎన్నికల ఫలితాలను పక్కనపెట్టి, తదనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను పరిగణనలోకి తీసుకుంటే భారతీయ జనతా పార్టీ 60 సీట్ల లోటుతో ఈ 2024 సార్వత్రిక పోటీలో పాల్గొందన్న వాస్తవం విశదమవుతుంది. అయితే ఈ యథార్థాన్ని ఎన్నికల విశ్లేషకులు, ఎన్నికలపై వార్తలు, వార్తా కథనాలు రాసిన వారు పూర్తిగా ఉపేక్షించారనడం సత్యదూరం కాదు.

ఆయా రాష్ట్రాలలో ఫలితాల తీరు తెన్నులు ఎలా ఉన్నాయో చూద్దాం. పశ్చిమ బెంగాల్‌నే తీసుకోండి. 2019 సార్వత్రికంలో ఈ రాష్ట్రంలో బీజేపీ 18 సీట్లు గెలుచుకున్నది. అయితే ఆ తరువాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను పరిగణనలోకి తీసుకుంటే ఆ పార్టీ కేవలం 10 లోక్‌సభ నియోజకవర్గాలలో మాత్రమే ఆధిక్యతలో ఉన్నది. 2024 సార్వత్రికంలో బీజేపీకి 12 స్థానాలు మాత్రమే రావడం విస్మయం కలిగించదు.

అదే విధంగా రాజస్థాన్‌లో 2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ఆధారంగా ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్‌తో సహా ఇండియా కూటమికి 11 సీట్లు మాత్రమే రాగలవని సహేతుకంగా విశ్వసించడానికి ఆధారమున్నది.

బీహార్, కర్ణాటక, తమిళనాడులో ఇదే అంచనా పద్ధతి వర్తిస్తుంది. ఉత్తరప్రదేశ్, హర్యానా, గుజరాత్‌లలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మార్పు ఏ దిశగా జరగనున్నదో అర్థం చేసుకోవడానికి ఉపకరించాయి. అయితే ఆ మార్పు ఏ మేరకు ఉంటుందో అంచనా వేయడం సాధ్యం కాలేదు. కాగా ఈ అంచనా పద్ధతి అన్ని రాష్ట్రాలకు వర్తించదు. 2019–24 మధ్య కాలంలో ఆంధ్రప్రదేశ్, ఒడిషాలలో అసెంబ్లీ ఎన్నికలు జరగ లేదు. ఈ రెండు రాష్ట్రాలలో అప్పుడూ ఇప్పుడూ కూడా ఏక కాలంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆంధ్ర, ఒడిషాలలో సంభవించిన ఎన్నికల భూకంపం సూచనలు ముందస్తుగా ఎక్కడా కనిపించలేదు. చివరిసారి అసెంబ్లీ ఎన్నికల అనంతరం వివిధ పార్టీలు, కూటముల మధ్య కొత్త పొత్తులు, సంచలనాత్మక రాజకీయ పరిణామాల కారణంగా మహారాష్ట్ర, జార్ఖండ్, తెలంగాణ, మణిపూర్, పంజాబ్‌లలో సంబంధిత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఉయోగకరమైనవి కావు. అయితే ఈ రాష్ట్రాలలో ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఆయా సంచలనాత్మక రాజకీయ పరిణామాలు, కొత్త పొత్తులకు అనుగుణంగా ఉండడం గమనార్హం. రాష్ట్ర రాజకీయాలు జాతీయ ఎన్నికలలో కీలకపాత్ర వహించే ధోరణికి మినహాయింపు ఉన్న రాష్ట్రాలు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్. ఈ రాష్ట్రాలలో చివరిసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ బాగా లబ్ధి పొందింది. అదే ధోరణి ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో కూడా కొనసాగింది. ఫలితంగా ఆ రాష్ట్రాలలో ప్రత్యర్థులకంటే అత్యధిక స్థానాలను కైవసం చేసుకున్నది.

భారత రాజకీయాల విశాల కథతో ఈ సార్వత్రిక ఎన్నికలు ముడిపడడం విశేషం. దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఈ వ్యాస రచయితలలో ఒకరు (యోగేంద్ర యాదవ్) ప్రొఫెసర్ సుహాస్ పల్షికర్‌తో కలిసి ఒక వ్యాసపంపర రాశారు. 1990ల్లో భారత రాజకీయాలు 'మూడో ఎన్నికల విధానం' (థర్డ్ ఎలక్టోరల్ సిస్టమ్) అనే కొత్త శకంలోకి ప్రవేశించాయన్నది ఆ వ్యాసాలలోని ప్రధాన వాదన. మరింత స్పష్టంగా చెప్పాలంటే రాష్ట్ర రాజకీయాలు జాతీయస్థాయి ఎన్నికల రాజకీయాలలో ప్రధానపాత్ర వహిస్తున్నాయి. 1970, 1980లలో భారతీయ ఓటర్లు అసెంబ్లీ ఎన్నికలలో తాము తమ ప్రధానమంత్రిని ఎన్నుకుంటున్నట్లుగా ఓటు వేశారు. అందుకు భిన్నంగా 1990, 2000ల తొలి సంవత్సరాలలో భారతీయ ఓటర్లు జాతీయ ఎన్నికలలో తాము తమ ముఖ్యమంత్రిని ఎన్నుకుంటున్న రీతిలో ఓటు వేశారు.

2014లో జాతీయ రాజకీయాలలో నరేంద్ర మోదీ ఉత్థానంతో ఇదంతా మారిపోయింది. జాతీయ ఎన్నికలలో ఓటింగ్ ధోరణులను జాతీయ రాజకీయాలే ప్రధానంగా ప్రభావితం చేయడం ప్రారంభమయింది. అన్ని రాష్ట్రాలలోను కాకపోయినప్పటికీ కొన్ని రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలలో ఓటింగ్ ధోరణులను సైతం జాతీయ రాజకీయాలే ప్రభావితం చేయడం సంభవించింది.

ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికలు మరో మార్పుకు నాంది పలికాయి. రాష్ట్ర రాజకీయాలు ప్రధాన ప్రభావవంతమైన పాత్ర వహించలేదు కానీ జాతీయ ఎన్నికలలో ఓటర్లు ఓటు వేసే విధానానికి ఉపయుక్త సందర్భంగా మారాయి. 2019 సార్వత్రిక పోరులోకంటే 2024లో రాష్ట్ర రాజకీయాల తీరుతెన్నులపై దృష్టి పెట్టి జాతీయ ఎన్నికలలో ఓటు వేసిన వారు అధికంగా ఉన్నారు. ఈ వాస్తవాన్ని లోక్‌నీతి–సిఎస్‌డిఎస్ నిర్వహించిన పోస్ట్ పోల్ సర్వే ధ్రువీకరించింది. 'ఎవరికి ఓటు వేయాలో నిర్ణయించుకోవడంలో ఏ ప్రభుత్వ పాలనను ఎక్కువగా పరిగణనలోకి తీసుకుంటావు?' అన్న ప్రశ్నకు 23శాతం మంది కేంద్ర ప్రభుత్వమని సమాధానమిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వమని 21 శాతం మంది మాత్రమే చెప్పారు. కేంద్ర ప్రభుత్వంతోపాటు రాష్ట్ర ప్రభుత్వ పాలనను కూడా పరిగణనలోకి తీసుకుంటామని చెప్పిన వారు 41 శాతం మంది ఉన్నారు. ఇదే ప్రశ్నకు 2019లో 28 శాతం మంది కేంద్ర ప్రభుత్వమని, 17 శాతం మంది రాష్ట్ర ప్రభుత్వమని సమాధానమిచ్చారు.

**జాతీయ ఎన్నికలలో రాష్ట్ర రాజకీయాలు ప్రభావవంతమైన పాత్ర నిర్వహించడంపై చర్చను ఈ సార్వత్రిక ఎన్నికలు ప్రారంభించాయి. బీజేపీ రాజకీయాల తీరు తెన్నుల పట్ల ఓటర్ల అసంతృప్తి కూడా ఈ మార్పుకు పాక్షిక కారణం. రోజువారీ జీవనోపాధి సమస్యలు, ఎన్నికల స్థానిక నేపథ్యాలు, సందర్భాలకు మళ్లీ ప్రాధాన్యం లభించడమే ఈ ప్రజాస్వామిక పునఃసమతౌల్యతకు ప్రధాన కారణం. జాతీయ అంశాలు, జాతీయవాద ఆదుర్దాలు వెనుకబడి, రాష్ట్ర రాజకీయాలు జాతీయ ఎన్నికలలో ప్రధాన ప్రభావ పాత్ర వహించడం ద్వారా ప్రజాస్వామిక పునఃసమతౌల్యతను సాధించేందుకు ఈ సార్వత్రిక ఎన్నికలు దారితీశాయి. నిస్సందేహంగా ఇదొక గణనీయమైన మార్పు.**

జాతీయ ఎన్నికలలో రాష్ట్ర రాజకీయాలు ప్రభావవంతమైన పాత్ర నిర్వహించడం మొదలైంది. బీజేపీ రాజకీయాల తీరు తెన్నుల పట్ల ఓటర్ల అసంతృప్తి కూడా ఈ మార్పుకు పాక్షిక కారణం. రోజువారీ జీవనోపాధి సమస్యలు, ఎన్నికల స్థానిక నేపథ్యాలు, సందర్భాలకు మళ్లీ ప్రాధాన్యం లభించడం ఈ ప్రజాస్వామిక పునఃసమతౌల్యతకు ప్రధాన కారణం. ❑

# కాంగ్రెస్ విజయాలు, వైఫల్యాలు

- యోగేంద్ర యాదవ్

**భారత జాతీయ కాంగ్రెస్ అధికారానికి రాలేదు. కానీ దాని ప్రస్థానం ఒక మేలుమలుపు తిరిగింది. 18వ సార్వత్రిక ఎన్నికలలో అంతిమంగా దానికి లభించిన మొత్తం సీట్లు 99 మాత్రమే. ప్రత్యర్థి పక్షం భారతీయ జనతా పార్టీకి లభించిన 240 సీట్లతో పోలిస్తే కాంగ్రెస్ సంఖ్యా బలం గొప్పదేమీ కాదు. అవును, జాతీయ ఎన్నికలలో కాంగ్రెస్‌కు అతి తక్కువ సీట్లు (100 లోపు) లభించడం ఇది మూడోసారి. 2014, 2019 సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ వరుసగా 44, 52 సీట్లు మాత్రమే సాధించింది. ఘోరమైన విషయమేమిటంటే గత లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ సాధించిన 52 సీట్లలో 32 కేవలం మూడు రాష్ట్రాల - కేరళ, పంజాబ్, తమిళనాడు - నుంచి మాత్రమే లభించాయి. గమనార్హమైన విషయమేమిటంటే ఈ మూడు రాష్ట్రాలలోను బీజేపీ కాంగ్రెస్‌కు ప్రధాన ప్రత్యర్థిగా లేదు. తమిళనాడులో అయితే డీఎంకేకు జూనియర్ భాగస్వామిగా కాంగ్రెస్ పోటీ చేసింది.**



ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో 400కుపైగా సీట్లు సాధించాలనే లక్ష్యాన్ని బీజేపీ నిర్దేశించుకున్నది. దేశవ్యాప్తంగా బలమైన ఉనికితో తనకు దీటైన జాతీయ ప్రత్యర్థిగా ఉన్న కాంగ్రెస్‌ను పూర్తిగా కుదేలు పరచడమే బీజేపీ ధ్యేయం. బీజేపీ ప్రచారానికి తగ్గట్టుగానే ఒక దశలో ఈసారి కాంగ్రెస్‌కు దక్కే సీట్లు సంఖ్య 40కంటే తక్కువగా ఉండవచ్చని, ఎన్నికల అనంతరం ఆ జాతీయ పార్టీ దక్షిణ భారతీయ జాతీయ కాంగ్రెస్‌గా మిగిలిపోవచ్చునే అభిప్రాయం బాగా వ్యక్తమయింది. అయితే కాంగ్రెస్ ప్రతికూల పరిస్థితులన్నిటిని అధిగమించి తన సీట్ల సంఖ్యను ఇంచుమించు రెట్టింపు చేసుకున్నది. అంతిమంగా, పునరుత్థానమవుతున్న పార్టీగా వెలుగొందిింది. ఏమైనా 2024 సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్‌ది ఆశ్చర్యకరమైన విజయగాథ. ఎల్లెడలా విజయాలు సాధించింది. హర్యానా నుంచి బిహార్ దాకా హిందీ రాష్ట్రాలలో ఆ పార్టీ సంఖ్యా బలం ఐదు నుంచి 23కి పెరిగింది. మహారాష్ట్రలో పోటీ చేసిన సీట్లను దాదాపుగా గెలుచుకున్నది- అన్ని నియోజక వర్గాలలోను భారీ మెజారిటీ సాధించింది. పంజాబ్‌లో బీజేపీకి ఒక్క సీటును కూడా దక్కనివ్వకపోవడంలో కాంగ్రెస్ సఫలమయింది. జాతుల ఘర్షణతో అతలాకుతలమైన మణిపూర్‌లోని రెండు సమస్యాత్మక నియోజకవర్గాలనూ కైవసం చేసుకున్నది. నాగాలాండ్‌లోను, మేఘాలయ గారోహిల్స్‌లోను పోటీ చేయడం ద్వారా ఈశాన్య భారత రాష్ట్రాలలో తన ఉనికిని మళ్లీ సుస్థిరపరచుకున్నది. ప్రత్యర్థి పార్టీలకు గట్టి పోటీనిచ్చి తన సత్తాను చాటుకున్నది. సీట్ల సంఖ్యను పెంచుకోవడంతోపాటు ఓట్ల వాటాను సైతం కాంగ్రెస్ పెంపొందించుకున్నది. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ ఓట్ల వాటా 1.7 శాతం మేరకు పెరిగింది. ఇది అద్భుతమైన విజయం కాకపోవచ్చు. కాని ఆరోగ్యకరమైన పెరుగుదల అని నిస్సందేహంగా చెప్పవచ్చు. భారత్ జోడో యాత్రతో ప్రారంభమైన కాంగ్రెస్ నవ ప్రస్థానం ఆ పార్టీ పట్ల బలంగా ఉన్న మిథ్యా భావనలు లేదా తప్పుడు అభిప్రాయాలను పటాపంచలు చేసింది. వాటిని వివరంగా చూద్దాం.

- (1) ఒక రాష్ట్రంలో మూడో స్థానానికి నెట్టివేయబడిన తరువాత కాంగ్రెస్ ఎట్టి పరిస్థితులలోనూ అక్కడ పుంజుకోలేదన్నది మొదటి తప్పుడు అభిప్రాయం. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో సాధించిన విజయంతో అది పూర్తిగా తొలగిపోయింది. 2019 సార్వత్రిక ఎన్నికలలో తెలంగాణలో కాంగ్రెస్ సీట్ల సంఖ్యలో మూడో స్థానానికి పడిపోయింది. ఆ తరువాత అసెంబ్లీ ఎన్నికలలో సాధించిన విజయాలను ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో నిలుపుకున్నది.

- (2) లోక్‌సభ ఎన్నికలలో ముఖ్యంగా హిందీ భాషా రాష్ట్రాలలో బీజేపీతో ముఖాముఖీ పోటీలో కాంగ్రెస్ నిలవలేదన్న తప్పుడు అభిప్రాయం ఒకటి ప్రబలంగా ఉన్నది. గత సార్వత్రక ఎన్నికలలో 190 నియోజక వర్గాలలో ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీ మధ్య ఉన్నది. అప్పుడు వాటిలో కేవలం 15 సీట్లను మాత్రమే కాంగ్రెస్ గెలుచుకోగలిగింది. ఇటీవలి సార్వత్రక ఎన్నికలలో ప్రధాన జాతీయ పార్టీలు రెండూ 215 నియోజక వర్గాల్లో ముఖాముఖీ తలపడ్డాయి. అయితే కాంగ్రెస్ ఈ సారి వాటిలో 62 నియోజకవర్గాలను కైవసం చేసుకున్నది. బీజేపీ గెలిచిన సీట్లలో ఆ పార్టీకి మెజారిటీని గణనీయంగా తగ్గించడంలోను కాంగ్రెస్ సఫలమయింది.

- (3) ఒక ప్రాంతీయ రాజకీయ పక్షం లేదా ఒక కుల లేదా మత ఆధార రాజకీయ శక్తికి కోల్పోయిన స్థానాన్ని కాంగ్రెస్ ఎప్పటికీ పునః సాధించుకోలేదు. ఇది కూడా ఒక తప్పుడు అభిప్రాయమే గత రెండు దశాబ్దాలుగా అస్సోంలో తనకు పలు విధాల నష్టం కలిగిస్తూ అన్ని విధాల ప్రయోజనం పొందుతున్న బద్రుద్దీన్ అజ్మల్ నాయకత్వంలోని ఎఐయుడిఎఫ్‌ను ఈ సార్వత్రక ఎన్నికలలో కాంగ్రెస్ పూర్తిగా ఓడించింది. అలాగే హర్యానాలో జేజేపీపై కూడా విజయం సాధించింది.

- (4) ఆపరేషన్ కమల్‌ను కాంగ్రెస్ తట్టుకోలేదన్నది కూడా పూర్తిగా మిథ్యా భావనే. హిమాచల్‌ప్రదేశ్ ఓటర్లు ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ వైపు మొగ్గారు. అయితే లోక్‌సభతో పాటు శాసనసభ ఉప ఎన్నికలలో బీజేపీకి ఫిరాయించిన శాసనసభ్యులు అందరినీ తిరస్కరించారు.

- (5) కాంగ్రెస్ తన మిత్రపక్షాలకు పెద్ద భారమవుతుంది అన్నది మరొక తప్పుడు అభిప్రాయం. ఇది ఒకప్పుడు నిజం కావచ్చు. కాని, ఇటీవలి ఎన్నికలలో అది తప్పు అని రుజువైంది. కేవలం తమిళనాడు, మహారాష్ట్రలో మాత్రమే కాదు యూపీ, బిహార్, ఢిల్లీ, జమ్ము కశ్మీర్‌లో కూడా కాంగ్రెస్, ఇండియా కూటమిలోని తన భాగస్వామ్య పక్షాల విజయానికి విశేషంగా తోడ్పడింది.

- (6) ఉత్తరప్రదేశ్‌లో గత అసెంబ్లీ ఎన్నికలలో ఘోర పరాజయం అనంతరం ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ నిర్వీర్యమైపోయింది. రాష్ట్ర ఎన్నికలలో కేవలం 2 శాతం ఓట్లను మాత్రమే పొందిన కాంగ్రెస్ ఇటీవలి సార్వత్రక ఎన్నికలలో గణనీయమైన సంఖ్యలో సీట్లు, ఓట్లు సాధించుకోవడం అద్భుత విజయమేనని నిస్సంకోచంగా చెప్పవచ్చు.

- (7) ప్రజా ఉద్యమాలతో మమేకం కాదన్నది కాంగ్రెస్‌పై ఉన్న మరొక తప్పుడు అభిప్రాయం. దశాబ్దాలపాటు అధికార పార్టీ లేదా ఆధిపత్య రాజకీయ శక్తిగా ఉన్న కాంగ్రెస్ ఎట్టకేలకు పాలక పక్షాల, ఆధిపత్య శక్తుల వ్యతిరేక రాజకీయాలతో తనను తాను సంధానం చేసుకోవడాన్ని నేర్చుకున్నది. పంజాబ్, హర్యానా, రాజస్థాన్, పశ్చిమ యూపీలో రైతుల ఆందోళనలు, ముస్లిం పౌరులు నిర్వహించిన పౌరసత్వ చట్టాల వ్యతిరేక ఉద్యమాలకు మద్దతునివ్వం ద్వారా కాంగ్రెస్ బాగా లబ్ధి పొందింది.

భారత జాతీయ కాంగ్రెస్ మళ్లీ ప్రజల ఆదరణను, మద్దతును పొందుతున్నది. అయితే ఇది ఆరంభం మాత్రమే. ఈ శుభ పరిణామం పట్ల సంతృప్తి చెంది, నిష్క్రియాత్మకంగా ఉండడం ఎట్టి పరిస్థితులలోను తగదు. ఇటీవలి సార్వత్రక ఎన్నికలలో కాంగ్రెస్ చెప్పుకోదగిన విజయాలు సాధించినప్పటికీ వైఫల్యాలూ అనేకమున్నాయి. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పరాజిత బీఆర్ఎస్‌కు వెన్నుదన్నుగా ఉన్న సామాజికవర్గాలను ఆకట్టుకోవడంలో విఫలమయింది. ఒడిషాలో బిజూ జనతాదళ్–బీజేపీ జుగల్ బందీకి ప్రత్యామ్నాయమయేందుకు లభించిన సువర్ణావకాశాన్ని కాంగ్రెస్ చేజార్చుకున్నది. కర్ణాటకలో తమ ప్రభుత్వం ఎన్నికల హామీలను పూర్తిగా నెరవేర్చినప్పటికీ అందుకు తగ్గట్టుగా ప్రజల మద్దతును సాధించుకోవడంలో విఫలమయింది. గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్‌లలో కాంగ్రెస్ పరిస్థితి అగమ్యగోచరంగా ఉన్నది. బెంగాల్‌లో కాంగ్రెస్ అనుసరించిన వ్యూహంతో ప్రజల నుంచి రాజకీయ సుహృద్భావాన్ని పోగొట్టుకున్నది. సంభావ్య రాజకీయ భాగస్వామిని దూరం చేసుకున్నది. ఫలితంగా బీజేపీకి ఆరు సీట్లను పోగొట్టుకున్నది.

ఇక ఢిల్లీలో ఇప్పటికీ కోలుకోలేకపోతోంది. సార్వత్రక ఎన్నికలనే అన్ లిమిటెడ్ ఓవర్స్ టెస్ట్ మ్యాచ్‌లో సంపూర్ణ విజయం సాధించేందుకు కాంగ్రెస్ ఇంకా ఎంతో కష్టపడవలసి ఉన్నది. ఉగ్ర వేసవి రోజున, పాడైన పిచ్‌పై, బాడీ లైన్ బౌలర్స్, నిష్పాక్షికంగా వ్యవహరించని అంపైర్లు, ప్రతికూల వ్యాఖ్యాతలను తట్టుకుని 99 పరుగులు తీయడం ఒక అల్ప విజయం ఎంత మాత్రం కాదు సుమా! ❑

# ఇది బహుజనుల రాజకీయ విజయం



- డా.కత్తి పద్మారావు

2024 ఎన్నికలు అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తికే పట్టం కట్టాయి అని అనక తప్పదు. మోడీ ప్రభుత్వం మునుపటిలా రాజ్యాంగానికి, రిజర్వేషన్లకు వ్యతిరేకంగా నడిచే అవకాశం లేదు. భారత రాజ్యాంగానికి ఎవరైనా తలవంచాల్సిందే. దళిత, బహుజన, మైనార్టీల పోరాట స్ఫూర్తి ఈ ఎన్నికల్లో వెల్లివిరిసింది. మహాత్మా పూలే, అంబేద్కర్ ఆశయాలతో దేశంలో బహు సంఖ్యాకులు చైతన్యంతో ఉన్నారని అర్థమవుతోంది. రామ మందిర నినాదానికి, భారత రాజ్యాంగ పరిరక్షణ నినాదానికి జరిగిన సమరంలో రాజ్యాంగమే విజేతగా నిలబడిన సందర్భం మన ముందుకొచ్చింది. ప్రభుత్వంతో సమఉజ్జీలుగా ఉన్న ప్రతిపక్షం భారత రాజ్యాంగాన్ని రక్షించడంలో కృతకృత్యం అవుతుందని, ఈ రాజ్యాంగ పోరాటాన్ని మరింత ముందుకు కొనసాగిస్తుందని ఆశిద్దాం. భారతదేశంలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్న 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాలు జూన్ 4వ తేది అత్యంత ఉత్కంఠభరితమైన వాతావారణంలో వెలువడ్డాయి. 2019లో లోక్‌సభ ఎన్నికల్లో 303 సీట్లు సంపాదించిన బీజేపీ 2024 ఎన్నికల్లో 241 సీట్లు మాత్రమే సాధించగలిగింది. 2019లో 52 సీట్లు మాత్రమే సాధించుకున్న కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో 99 సీట్లు సాధించగలిగింది. బీజేపీకి 2019 ఎన్నికల కంటే 60 సీట్లు తగ్గాయి. ఇకపోతే భారత రాజ్యాంగ సూత్రాల పరిరక్షణలోనూ, హేతువాద భావజాల ప్రచారంలో ముందున్న తమిళనాడు పుదుచ్చేరి ఎంపీ స్థానంతో సహా మొత్తం 40 స్థానాలను కైవసం చేసుకుని విజయకేతనం ఎగురవేసింది. తమిళనాడులో సామాజిక న్యాయానికి అధునాతన ధర్మానికి, ప్రజలు పట్టం కట్టారు. నరేంద్ర మోడీ పనిగట్టుకొని సనాతన సంప్రదాయాలను ప్రచారం చేశారు. రాముడిని దక్షిణాది రాష్ట్రాలకు తరలించాలని ప్రయత్నం చేశారు కానీ లౌకికవాద భావజాలానికి ప్రజలు పట్టం కట్టారు. దీంతో బీజేపీ, అన్నాడీఎంకే ఈ ఎన్నికల్లో బోణీ కూడా కొట్టలేకపోవడం గమనార్హం.

### రామమందిరంపై అతి ప్రచారంతో దెబ్బ

ఈ ఎన్నికల ఫలితాలు భారతదేశానికే దిక్సూచిగా వున్నాయి. బీజేపీ వైఫల్యానికి ప్రధాన కారణం ముఖ్యమైనది అయోధ్య రామ మందిరం. రామమందిర నిర్మాణం కొందరి విశ్వాసానికి సంబంధించినపుడు ఆ విశ్వాసాన్ని భారతీయులందరి మీద రుద్దాలనీ చూడటం భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. నిజానికి ఉత్తరప్రదేశ్‌లో ఘోర పరాజయానికి గురికావటానికి కారణం ఈ రామమందిర నిర్మాణమే. దళిత బహుజనుల నాయకుల స్ఫూర్తితో నిర్మించిన అంబేద్కర్ పార్క్ యూపీలోనే వుంది. ఇవన్నీ మనకు స్ఫూర్తివంతమైనవి. కాని వాటిని రాజకీయ ప్రచారానికి వాడుకున్నారు. రామమందిరం కూడా అలాంటిదే. దానిని కళాత్మకమైన దేవాలయంగా చూస్తే ఎవరికి ఏ ఇబ్బంది ఉండదు కానీ ఆ రామమందిరాన్నే బీజేపీ ప్రచారాస్త్రంగా తీసుకోవడం వలన ఆ అంశం నరేంద్ర మోడీ నాయకత్వం వహిస్తున్న బీజేపీ ఓటమికి దారి తీసింది.

### చావు దెబ్బ తీసిన యూపీ

యూపీ, దేశంలోనే అత్యధిక సంఖ్యలో (80) లోక్‌సభ స్థానాలు కలిగిన రాష్ట్రం. దేశంలోని అత్యంత ముఖ్యమైన రాష్ట్రాలలో ఒకటిగా వుంది. ఈ రాష్ట్రంలో అత్యధిక నియోజక వర్గాలు గెలుపొందిన కూటమి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలుగుతుంది. ఈ ఎన్నికల్లో ఎస్పీ 37, కాంగ్రెస్ 6, స్థానాల్లో విజయం సాధించాయి. ఈ విజయం ఇండియా కూటమికి బాగా కలిసొచ్చింది. ఇకపోతే నరేంద్ర మోడీ భారతదేశంలోని ముఖ్యమైన దేవాలయాలన్నీ తిరిగినప్పటికీ ఫలితం లేకపోయింది. బీఎస్పీ ఓటు బ్యాంక్ కాంగ్రెస్, ఎస్పీకి బదిలీ కావడం చివరికి బీజేపీనే దెబ్బతీసింది. జాట్‌లు, రాజ్‌పుత్‌లు, క్షత్రియులు, బ్రాహ్మణులు సైతం బీజేపీకి, దూరం కాగా ఆ రాష్ట్రంలో దాదాపు 20% దాకా ఉన్న ముస్లిం ఓటర్లు గంపగుత్తగా కాంగ్రెస్–ఎస్పీ కూటమికి ఓటెయ్యడం గమనార్హం. జనాభా నిష్పత్తిని బట్టి సీట్లు ఇవ్వాలని డా బి.ఆర్.అంబేద్కర్ ఎప్పుడో చెప్పారు. బీజేపీ రాజకీయాల్లో మతాధిపత్యం, కులాధిపత్యం, వర్ణాధిపత్యం, పిత్ృ ఆధిపత్యం ఇవన్నీ కనిపించాయి.

### రిజర్వేషన్లపై చేయి వేస్తే...

నిజానికి డా.బి.ఆర్.అంబేద్కర్ భారత రాజ్యాంగంలో ఏ రిజర్వేషన్‌లు కల్పించారో ఆ రిజర్వేషన్‌లను రద్దు చేస్తామన్న బీజేపీ వాక్కు దళిత బహుజనులలో అభద్రతను కల్పించింది. అలాగే యువత ఆశలపై నీళ్ళు చల్లిన అగ్నవీర్ పథకం తీవ్ర రూపం దాల్చింది. నిరుద్యోగ సమస్య, ద్రవ్యోల్బణం, ఫిరాయింపులకు ప్రోత్సాహం వంటివి బీజేపీని దెబ్బతీసాయి. ప్రతిపక్షాలపై ప్రధాని మోడీ చేసిన తీవ్ర వ్యాఖ్యలు కూడా మొదటికే మోసం తెచ్చాయి. రాజస్థాన్‌లో ఎన్నికల ప్రచారసభలో మోదీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి **(మిగతా 28వ పేజీలో)**

# ఫ్రెంచ్ దర్పణంలో మోదీ భారత్



- కొప్పర్తి వెంకటరమణమూర్తి

**పారిస్ కేంద్రంగా పనిచేసే ప్రపంచ అసమానతల పరిశోధనాశాల ఈ ఏడది మార్చిలో '1922-2023 మధ్య భారతదేశంలో ఆదాయం, సంపదల అసమానతలు : ఆవిర్భవించిన ధనస్వామ్యం' అనే డాక్యుమెంట్‌ను విడుదల చేసింది. ప్రసిద్ధ ఫ్రెంచ్ ఆర్థికవేత్త థామస్ పికెటీ సారధ్యంలో నలుగురు పరిశోధకులు జరిపిన ఈ పరిశోధన భారతదేశంలో ధనికులకూ పేదలకూ మధ్య ఆర్థిక అంతరం విపరీతంగా పెరిగిందని అది ఇప్పుడు అగ్రభాగాన ఉన్న ఒక శాతం ధనికుల వద్ద దేశ సంపదలో నలభై శాతం పోగుపడిందని, జనాభాలో పైన ఉన్న పది శాతాన్ని తీసుకుంటే అది అరవై శాతానికి చేరిపోయిందనీ తేల్చింది. మిగిలిన తొంభైశాతంలో ఉన్న నలభై శాతం మధ్యతరగతి వద్ద ఇరవై తొమ్మిది శాతం జమ కాగా అడుగున ఉన్న యాభై శాతం ప్రజలకు ఆరు నుంచి ఏడు శాతం మాత్రమే మిగిలిందని వివరించింది.**

ఈ పరిశీలన స్థూలంగా ఫ్రెంచ్ విప్లవానికి ముందు ఫ్రాన్సు దేశ ఆర్థిక పరిస్థితిని పోలి ఉంది. ఇదే కాదు అనేక ఇతర అంశాల్లోను ఇప్పుడు మనదేశం అప్పటి ఫ్రాన్సులానే ఉందనిపిస్తుంది. 1789లో జరిగిన ఫ్రెంచ్ విప్లవం ఫ్రాన్స్ లో రాచరిక వ్యవస్థతోపాటు భూస్వామ్య వ్యవస్థను కూల్చివేసి మొదటిసారి మధ్య తరగతి ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పింది. ఇది రెండు వందల ఏళ్లు ఫ్రాన్సును పాలించిన బూర్బన్ రాజవంశ నిరంకుశత్వాన్ని పెకలించింది. మనుషులకు మొదటిసారి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను పంచి ఇచ్చింది.

ఫ్రెంచ్ సమాజంలో రెండు అంతరాలు ఉండేవి. ఒకటి అవకాశాలున్న వర్గం (Privileged Class), రెండు అవకాశాలు లేని వర్గం (unprivileged class). మొదటి వర్గంలో భూస్వాములూ, మతాచార్యులూ ఉండగా మధ్యతరగతి, సామాన్యులు రెండవ వర్గంలో ఉన్నారు. మొత్తం జనాభాలో ఒక శాతం ఉన్న అవకాశాలున్న వర్గం దేశ సంపదలో నలభై శాతం కైవసం చేసుకుని ఉంది. తొంభై తొమ్మిది శాతం ఉన్న అవకాశాలు లేని వర్గం మిగిలిన అరవై శాతం పంచుకోవలసి వచ్చింది. అసలు తేడా అది కాదు. నలభై శాతం సంపద కలిగిన వర్గానికి పన్నుల చెల్లింపునుంచి మినహాయింపు ఉండగా దేశ పన్నుల భారాన్నంతా సామాన్యులూ, మధ్యతరగతే మోయవలసి వచ్చింది. అందుకే ఫ్రాన్సులో 'భూస్వాములు యుద్ధాలు చేస్తారు. మతాచార్యులు ప్రార్థనలు చేస్తారు. ప్రజలు పన్నులు చెల్లిస్తారు' అనే నానుడి వచ్చింది. ఇది అటుంచితే ఫ్రాన్సులో అప్పుడున్నది రాజ్యాంగబద్ధ రాచరికం. కానీ, అది నామ మాత్రమే. నిజానికి నెలకొన్నది నిరంకుశ రాచరికం. అంకుశం పట్టుకున్న మావటీవాడు లేని ఏనుగు లాంటి రాచరికం. రొట్టెముక్క లేక ప్రజలు అల్లాడుతుంటే రాజకుటుంబం విందులు, వినోదాల్లో మునిగి తేలింది. వారి రాజప్రాసాదాన్ని 'దేశం మీద కట్టబడిన సమాధి' (the court is the tomb of the nation) అన్నారు. రాజ్యాన్ని ప్రశ్నించిన వాళ్లు వెలుతురే కనిపించని బాస్టైల్ అనే జైలులో మరణించే వరకు నిర్బంధించబడేవారు. రాజ్యాంగాన్ని అనుసరించి ఎస్టేట్స్ జనరల్ అనే పార్లమెంట్ ఉండేది. చట్టాలు చేయడంలో రాజు దాని అనుమతి పొంద వలసి ఉంది. కానీ బూర్బన్‌లు 175 సంవత్సరాలుగా దానికి ఎన్నికలు జరపలేదు. విప్లవానికి రెండేళ్ల ముందు నాటికి ఆడంబరాలతో, యుద్ధాలతో ఖజానా ఖాళీ అయిపోవడంతో ధనిక వర్గంపై పన్నులు విధించక తప్పదనే ప్రతిపాదన వచ్చినపుడు ఆ వర్గం తీవ్రంగా వ్యతిరేకించింది. రాజు సైతం ఆ వర్గాన్నే సమర్థించడంతో సామాన్యులు వెంట నడవగా మధ్య తరగతి నాయకత్వంలో విప్లవం చెలరేగి రాజకీయ, సామాజికవ్యవస్థల్ని పడగొట్టింది.

ఎవరు ప్రజలు ? ప్రభుత్వం ఎవరి సంక్షేమం కోసం ఉంది ? అనే ప్రశ్నలు ఫ్రెంచ్ రాజవంశానికి అర్థం కాలేదు. విప్లవం నాటి ఫ్రెంచ్ చక్రవర్తి 16వ లూయీ భార్య మేరీకి ఎప్పుడూ తమను పరివేష్టించి ఉండే ధనిక వర్గాలు కాక అసలు ప్రజలు వేరే ఉంటారని తెలియదట. అందుకే ఆమెకు ప్రజలు బ్రెడ్డు లేక అలమటిస్తున్నారని చెబితే 'బ్రెడ్డు దొరకకపోతే కేకులు తినవచ్చు కదా' అని అన్నదని అంటారు. తన రాజ్యాన్ని ఆర్థిక దుస్థితి నుంచి బయట పడెయ్యడానికి, జనాన్ని ఆకలి నుంచి రక్షించ డానికి తన ప్రభుత్వమే భూస్వాముల మీద మతాచార్యుల మీద పన్ను విధించటానికి సిద్ధపడితే వారితో కలిసి తనకు తానే అడ్డు పడి చివరికి బలి కావడం ఫ్రాన్సు చక్రవర్తికి ఆత్మహత్యా సదృశమైంది. ఆ సందర్భం పికెటీ బృందం పరిశీలనలో తేలిన ఒక్క శాతం మంది నలభై శాతం సంపద కలిగి ఉన్న అంశంతో

మొదలై ధరల పెరుగుదల, నిరుద్యోగం, పన్నులతో ప్రజలు కుదేలౌతుంటే, కార్పొరేట్లకిచ్చిన లక్షల కోట్ల రుణాలను మాఫీచేసి దేశ ఆర్థికవ్యవస్థను ఆ వర్గాలకు కట్టబెట్టడుతున్న ఇప్పటి సందర్భంతో సరితూగుతున్నది. తమ మీద విధించిన పన్నులు చెల్లించడానికి నిరాకరించి, ప్రజల దాడులు తప్పించు కోవడానికి దేశం నుంచి పారిపోయిన ఫ్రెంచ్ భూస్వాములతో – కోట్లాది రూపాయల బ్యాంకు రుణాలు ఎగ్గొట్టి విదేశాలకు పలాయనం చేసిన పెద్ద మనుషులను పోల్చవచ్చు. 2014 తర్వాత పైస్థాయి వ్యాపారస్థులతో ప్రభుత్వం జట్టుకట్టడం బాగా పెరిగిపోయిందని ఈ పరిశోధన ధృవీకరించడం రెండు సందర్భాల మధ్య సారూప్యతను పెంచుతున్నది. బూర్బన్ చక్రవర్తి 14వ లూయీ సర్వ మంత్రాంగాన్ని నిర్వీర్యం చేసి అధికారాన్నంతా తన చేతుల్లోనే కేంద్రీకృతం చేసుకున్నాడు. కాలు దువ్వి మరీ యుద్ధాలు చేశాడు. తన అంత్యక్రియలకు కూడా మిగలకుండా డబ్బును దుబారా చేశాడు. 'నేనే రాజ్యాన్ని' (I am the state) అని హూంకరించాడు. ఇప్పుడు కూడా అన్నిటా అంతటా తానై వ్యవహరించే నాయకత్వాన్ని చూస్తు న్నాం. అన్నిచోట్లా ఒక్క రూపాన్నే దర్శిస్తున్నాం. అనుచరుల్ని తప్ప సహచరుల్ని అనుమతించని ప్రజాస్వామ్యంలో ఉన్నాం. దేశంలో ఒక వర్గాన్ని తమ వాళ్లుగా, మరికొన్ని వర్గాల్ని ఇతరులుగా చూసే ద్వంద్వ పరిపాలనను గమనిస్తున్నాం. ఈ నియంతృత్వ ధోరణి గత పదేళ్లలో బాగా బలపడిన వైనాన్ని అసమానతల డాక్యుమెంట్ నిర్ద్వంద్వంగా ప్రస్తావించింది.

విద్య, వైద్యం, న్యూట్రిషన్ వంటి రంగాలలో ప్రజల పెట్టుబడిని ప్రభుత్వం ప్రోత్సహిస్తే దేశంలో సామాన్యులేకాదు, శిష్ట వర్గంకూడా ప్రయోజనం పొందుతుందని భావించిన పికెటీ బృందం దేశంలోని 167 అత్యంత ధనిక కుటుంబాల మీద రెండు శాతం సూపర్‌టాక్స్‌ను విధించాలని ప్రతిపాదించింది. ఇది ఫ్రాన్సులో విప్లవానికి తక్షణ కారణమైన ధనిక వర్గాలమీద విధించబూనుకున్న పన్నును తప్పక గుర్తుకు తెస్తుంది.

పారిస్‌ను భీకర క్షామం కమ్ముకోగా, చిన్న బ్రెడ్డు ముక్క కోసం 'అలగా జనం' కాట్ల కుక్కల్లా కొట్లాడుకుంటున్నపుడు వేల మంది పారిస్ స్త్రీలు దాదాపు పాతిక మైళ్ల దూరం ఆకలియాత్ర చేసి రాజధాని 'వర్సే' రాజ భవనాన్ని ముట్టడించారు. తేరిపార చూస్తే ప్రభుత్వం నిర్దేశించిన మార్కెట్ స్థలాలోనే రైతులు తమ పంటలను విక్రయించాలని చేసిన రైతు చట్టాలకు వ్యతిరేకంగా రాజధాని ఢిల్లీ మీద సంవత్సరం పైగా రైతులు చేసిన ముట్టడి అటువంటిదే. చట్టాలు రద్దయినా కనీస మద్దతు ధర కోసం ఇప్పుడు జరుగుతున్నదీ దానికి కొనసాగింపే. ఈ సందర్భంలోనే సిఎఎ, యన్‌ఆర్‌సిలకు వ్యతిరేకంగా ఢిల్లీ షహీన్ బాగ్‌లో మహి ళలు చేసిన ఆందోళన గుర్తుకు రాకుండా ఎలా ఉంటుందీ ? 'ఒక వ్యక్తి పుట్టుక, పుట్టిన చోటు, పౌరసత్వం గురించి మాట్లాడడానికి మహిళలకన్నా అర్హులెవరుంటారు ?' అని రొమిలాథాపర్ వేసిన అర్థవంతమైన ప్రశ్నకు, తమ బిడ్డల, భర్తల, తల్లిదండ్రుల ఆకలి తీర్చేందుకు రాజు మీద దాడి చెయ్యడానికి పారిస్ స్త్రీల కంటే మించిన అవసరమెవరికి ఉంటుంది అనే ప్రశ్నతో అనుసంధానం సరిగ్గా కుదురుతుంది.

'కళ్లు మిరుమిట్లు గొలిపే సంపదల్ని చూపించి నాగరికత అంటున్నారు. తప్పులు జ్ఞానంగా చలామణి అవుతున్నాయి. అణచివేతకు అదుపు అనే పేరు పెట్టారు. ఊడ్చిపారెయ్యండి ఈ వ్యవస్థ అక్రమనిర్మాణాన్ని. అసమానతల్ని సమం చెయ్యండి. ఈ సంకెళ్లని తెంచండి' అంటూ విప్లవానికి ముందు ఫ్రెంచ్ తత్వవేత్త రూసో ప్రజలకు పిలుపు ఇచ్చాడు. కొద్దిమంది దగ్గరున్న సంపద చూపించి దేశం అభివృద్ధి చెందిందని చెప్పటం, ఐదు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ గురించి మాట్లాడటం, అభూతకల్పనల్ని చరిత్రగా నమ్మబలకటం, ప్రభుత్వ వ్యవస్థల్ని ఉపయోగించి అనుకూలంగా లేనివారిని అణగద్రొక్కడం రూసో మాటల్ని ఇక్కడ ప్రాసంగికం చేస్తున్నాయి. Error miscalled knowledge అన్న ఆయన మాట ఇప్పుడు ఎంత సత్యమో కదా.

విప్లవానికి ముందు ఫ్రాన్సులో నెలకొన్న పరిస్థితులు ఇంచుమించుగా యూరప్ అంతా ఉన్నవే. కానీ విప్లవాన్ని ఫ్రాన్సులో సాధ్యంచేసింది మటుకు ఆ దేశానికి మాత్రమే పరిమి తమైన మధ్యతరగతి మేధావి వర్గం. భారతదేశంలో ఒకప్పుడు బెంగాల్‌కు ఉన్న స్థానం యూరప్‌లో ఫ్రాన్సుకు ఉండేది. ఇవి రెండూ సమకాలికులకంటే ఒకరోజు ముందుంటాయి. విప్లవానికి ముందు ఫ్రాన్సులో ఒక ఉక్కపోత వాతావరణం ఉండేది. స్వేచ్ఛగా మాట్లాడలేని, నచ్చింది తినలేని, నిజం మాట్లాడలేని, నేనీ దేశ పౌరుణ్ణి అని ప్రకటించుకోలేని ఊపిరాడనితనం ఇప్పుడు ఇక్కడ కూడా ఆవహించింది. మాంటెస్క్యూ, వోల్టేర్, రూసో, డిడిరో లాంటి మేధావులు ఫ్రెంచ్ సమాజంలో కదలిక తెచ్చారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కర్ణాటకలో పౌరసమాజం సృష్టించిన చైతన్యం లాంటిది ఇప్పుడు దేశమంతా వ్యాపించడం మిగిలి ఉంది.

**ప్రజాస్వామ్యంలో ఎన్నికలే విప్లవాలు. ఫ్రెంచ్ విప్లవం మనకు సాధించి పెట్టింది అదే. సందర్భం మారినపుడు రూపం మారుతుంది. నాలుగు దశల ఎన్నికలు పూర్తయ్యేటప్పటికి రంగులు వెలిసిపోయు అసలు రూపాలు బయటపడుతున్న నేపథ్యాన, ప్రజలు సత్యాసత్యాలను గుర్తించగలుగుతున్న దశలో, దేశం మరో విప్లవం అంచుకు నడుస్తోందనే వార్తల మధ్య చరిత్ర పురాస్మృతిగా మిగలకూడదు, కొత్త అర్థంలో పునరావృతమే కావాలి.** ❑

# మోదీ చెప్పిన గాంధీ చరిత్రలో నిజమెంత?




- రాహుల్‌కుమార్

**రాజకీయాలకు గతం బలి కావటం అన్నిచోట్లా ఉంది. పరస్పర ఆరోపణలే ప్రధాన రాజకీయ అస్త్రాలుగా మారిన పరిస్థితుల్లో దానికి జరిగే హాని అంతా ఇంతా అని చెప్పలేం. నాలుగు ఓట్లు, నాలుగు సీట్లు అదనంగా రావటానికి గతం గురించి ఏదైనా మాట్లాడవచ్చనే ధోరణి విషమిస్తోంది. ప్రధాని మోదీ ఇటీవల ఎన్నికల ప్రచారంలో భాగంగా గాంధీ సినిమా గురించి మాట్లాడిన తీరే ఇందుకు నిదర్శనం. రిచర్డ్ ఆటన్‌బ్రో దర్శకత్వంలో 1982లో ఆ సినిమా విడుదలైంది. ఆ సినిమా తోనే గాంధీ అంటే ప్రపంచానికి తెలిసిందనీ అంతకు ముందు ఆయనకు రావాల్సిన గుర్తింపు రాలేదనీ మోదీ వ్యాఖ్యానించారు.**

సినిమా మాధ్యమం చాలా శక్తిమంతమైంది. అందులో ఎవరికీ సందేహం లేదు. చరిత్రను కీలక మలుపుతిప్పిన మహామహుల గురించి గొప్పగా సినిమాలు తీస్తే వాటి ప్రభావం ప్రజలపై ఎంతోకొంత ఉంటుంది. దీనిపైనా ఎవరికీ సందేహం లేదు. ఆటన్‌బ్రో తీసిన గాంధీ సినిమాకు ఎనిమిది ఆస్కార్ అవార్డులు వచ్చాయి. పాశ్చాత్య దేశాల్లో 1980ల నాటి తరానికి గాంధీ గొప్పతనాన్ని చెప్పటానికి ఆ సినిమాను తీశారు. అప్పటికి ఇంగ్లిషులో గాంధీపై అంత సమగ్రమైన సినిమా రాలేదు. దాన్ని చూసిన వారిలో కొందరైనా గాంధీ గురించి మరింత తెలుసుకో టానికి ప్రయత్నించి ఉండొచ్చు. ఆయన ఆదర్శాలను ఆచరించటానికి కొంత కృషి చేసి ఉండొచ్చు. వీటినే మోదీ చెబితే ఎవరికీ అభ్యంతరం ఉండేది కాదు. ఆటన్‌బ్రో సినిమాతోనే ప్రపంచానికి గాంధీ గురించి తెలిసిందని చెప్పటం మాత్రం చరిత్ర పరిశీలనకు నిలబడదు.

మోదీ వ్యాఖ్యల లోతు పాతుల్లోకి వెళ్లే ముందు గాంధీ గురించి ఏమన్నారో ఆయన మాటల్లోనే చూద్దాం. “మహాత్మాగాంధీ మహోన్నత వ్యక్తి.. ఆయనకు ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చే బాధ్యత మనకు లేదా ? ఆయన గురించి ఎవరికీ తెలియదు! ఇలా చెబుతున్నందుకు నన్ను క్షమించండి!.. గాంధీ సినిమా వచ్చినప్పుడు మాత్రమే గాంధీ ఎవరా? అని మొదటిసారి ప్రపంచం ఆసక్తిగా చూసింది. గాంధీని




ప్రపంచానికి పరిచయం చేయటం మన కర్తవ్యం. కానీ దాన్ని చేయలేకపోయాం. ఈ ప్రపంచానికి మార్టిన్‌లూథర్ కింగ్, నెల్సన్‌మండేలా.. అంటే ఎవరో తెలుసు. కానీ గాంధీ వారికంటే ఎందులోనూ తక్కువ కాదు... ప్రపంచమంతా తిరిగిన తర్వాతే దీని గురించి నేను చెబుతున్నాను. గాంధీ ద్వారానే భారతదేశానికి గుర్తింపు వచ్చి ఉండాలి”... కానీ అది రాలేదనీ చెప్పటమే మోదీ ఉద్దేశం. 75 సంవత్సరాల్లో ఆ పని మనం చేయలేదనటంలో పరోక్షంగా కాంగ్రెస్‌పై విమర్శ కూడా ఉంది.

మోదీ అన్నట్లుగానే గాంధీ గురించి ప్రపంచానికి ఏమీ తెలియదా? అన్న ప్రశ్న వేసుకుంటే వచ్చే జవాబు మనల్ని నిర్ఘాంతపరుస్తుంది. నిజానికి మోదీ ప్రస్తావించిన అమెరికా పౌరహక్కుల ఉద్యమ నేత మార్టిన్ లూథర్ కింగ్, దక్షిణాఫ్రికా లోని జాత్యంహకార ప్రభుత్వానికి వ్యతిరేకంగా దశాబ్దాలపాటు పోరాటం చేసిన నెల్సన్ మండేలాలకు మహాత్మా గాంధీయే స్ఫూర్తి. గాంధీ సినిమాకంటే చాలా ముందుగానే రాజకీయ పోరాటాలను వారిద్దరూ నడిపారు. అవిశ్రాంతంగా హక్కుల ఉద్యమాన్ని నడిపిన మార్టిన్ లూథర్‌కింగ్ 40 ఏళ్లు నిండ కుండానే 1968లో హత్యకు గురయ్యారు. అనేక ఆందోళనల్లో పాల్గొన్న మండేలా 1982 నాటికి జైల్లోనే మగ్గుతున్నారు. సహాయ నిరాకరణ, శాసన ఉల్లంఘన, సమాన హక్కుల ఉద్య మాలను వారిద్దరూ గాంధీ మార్గాన్నే ఎంచుకున్నారు. బలమైన సైనిక, పోలీసు వ్యవస్థలతో పటిష్ఠ ప్రభుత్వాలు ఉన్నచోట ఉద్యమాలు హింసామార్గం తొక్కితే అణచివేతలు, అధికార హత్యాకాండలే చివరికి పైచేయి సాధిస్తాయన్న అవగాహన వారిద్దరికీ ఉంది. అందుకే గాంధీ అహింసామార్గాన్ని

ఎత్తుగడగానూ, ఆందోళన మార్గంగానూ స్వీకరించారు.

బ్రిటిషు వలసపాలన నుంచి భారతదేశం విముక్తి కావటం 20వ శతాబ్దంలో జరిగిన కీలక ఘటనల్లో ఒకటి. చాలా వరకూ అది శాంతియుతంగా జరిగింది. సాయుధ పోరాటాలు, హింసా ప్రయోగాలు అక్కడక్కడా ఉన్నా ప్రధాన రాజకీయ ఉద్యమం స్వాతంత్ర్యం కోసం హింసా మార్గాన్ని స్వీకరించలేదు. గాంధీ దక్షిణాఫ్రికా నుంచి 1915లో భారత్‌కు వచ్చే నాటికి ప్రపంచంలో బ్రిటిషు సామ్రాజ్యానికి తిరుగులేదు. సైనిక శక్తిలోనూ అగ్రగామే. మొదటి ప్రపంచయుద్ధంలో చాలా నష్టపోయినా భారత్‌పై బ్రిటన్ పట్టు సడలలేదు. అహింస ప్రధానమైన వైష్ణవ, జైన సంప్రదాయాల ప్రభావంతోపాటు ఎన్నో వైవిధ్యాలు, అసమానతలు, బహుళ సంస్కృతులతో కూడిన భారత సమాజాన్ని నిశితంగా పరిశీలించటం వల్ల యూరోపు లోని హింసామార్గం ఇక్కడ సరిపడదని గాంధీ భావించారు. హింసతో సాధించిన దాన్ని హింసతోనే నిలబెట్టుకోవాల్సిన పరిస్థితి ఉంటుందని గాఢంగా నమ్మారు. చివరికి హింసా యంత్రాగంపై(పోలీసు, సైన్యం) ఆధారపడే ప్రభుత్వ వ్యవస్థలను కాదనే వరకూ వెళ్లారు. హింసను.. మనుషుల పట్లే కాదు.. జంతు ప్రపంచానికీ, ప్రకృతికీ తలపెట్టకూడదనే ఉద్దేశంతో స్వయం సమృద్ధ గ్రామీణ జీవితాన్ని స్వీకరించాలని ప్రబోధించారు. దీన్ని కాంగ్రెస్ పార్టీయే స్వీకరించలేదు. అభివృద్ధిలో పాశ్చాత్య దేశాలను అనుకరించట మే కాంగ్రెస్ పార్టీకి ప్రధాన అజెండాగా ఉండేది. దాని సాఫల్య వైఫల్యాల గురించి చెప్పుకొంటే అదొక పెద్ద చరిత్రే అవుతుంది. బహుళత్వ భారత సమాజానికి సరిపోతాయన్న అవగాహనతో సహాయ నిరాకరణ, శాసనోల్లంఘన, సత్యాగ్రహం, హర్తాళ్, ఆమరణ నిరాహార దీక్షల్లాంటి ఆందోళనలను గాంధీ ఎంచుకున్నారు. వీటితోనే బ్రిటిషు పాలకులు దిగివచ్చారనే అభిప్రాయం 1950ల నాటికి బాగా బలపడినా 1920ల నుంచే వీటిపై పాశ్చాత్యదేశాల్లో ఆసక్తి పెరిగింది.

ప్రపంచ నాగరికతపై 'ద స్టోరీ ఆఫ్ సివిలైజేషన్' పేరుతో 11 వాల్యూముల ఉద్గ్రంథాన్ని ప్రచురించిన విల్‌డ్యురంట్ 'ద కేస్ ఫర్ ఇండియా' అన్న పుస్తకాన్ని 1930లోనే రాశారు. నాగరికతపై డ్యురంట్ సూత్రీకరణలతో ఎంతైనా విభేదించొచ్చు. కానీ ఆయన రచనా శైలి మనల్ని పరుగులెత్తిస్తుంది. అందుకే ఆయన రాసిన 'ద స్టోరీ ఆఫ్ ఫిలాసఫీ' పుస్తకం లక్షోపలక్షల్లో అమ్ముడుపోయింది. డ్యురంట్ భారత్‌కు వచ్చి గాంధీని కలిసి చర్చలు జరిపారు. 'ద కేస్ ఫర్ ఇండియా'లో ఒక అధ్యాయం మొత్తం గాంధీపైనే ఉంది. గాంధీ ఆందోళనా పద్ధతుల నుంచి ప్రేరణ పొంది అహింసా సిద్ధాంతంపై 1935లోనే 'ద పవర్ ఆఫ్ నాన్ వయలన్స్' పుస్తకాన్ని అమెరికా న్యాయవాది రిచడ్ గ్రెగ్ రాశారు. 1950, 60ల్లో అమెరికాలో జరిగిన ఆందోళనలకు ప్రేరణను ఆ పుస్తకమే అందించింది. నల్లజాతీయుల హక్కుల కోసం పోరాడిన ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త డబ్ల్యూ.ఇ.బి.డ్యూబ్వా కూడా గాంధీ రచనలను ప్రచురించారు. డ్యూబ్వా సిద్ధాంతాల ప్రభావం ఒకప్పుడు అమెరికాలో బాగా ఉండేది. అమెరికా చరిత్రలో పౌరహక్కుల ఉద్యమం చాలా కీలక మైంది. అక్కడి సమాజాన్ని మానవీకరించిన పోరాటమది. అందులో పాల్గొన్న వారిలో చాలా మంది గాంధీ నుంచి ప్రేరణ పొందారు.

ఇక ఆఫ్రికాలోని వలస పాలన వ్యతిరేక పోరాటాల్లో కూడా గాంధీ సిద్ధాంతాలను మార్గదర్శకంగా స్వీకరించిన వారు చాలా మంది ఉన్నారు. 1945లో మాంచెస్టర్‌లో జరిగిన అయిదో అఖిల ఆఫ్రికా కాంగ్రెస్ సమావేశం గాంధీ ఆందోళనా పద్ధతులను స్వీకరిస్తున్నట్లు ప్రకటించింది. జర్మనీలో గ్రీన్‌పీస్ పార్టీ ఏర్పాటుకు గాంధీ సిద్ధాంతాలే చాలా వరకూ ప్రేరణ. ప్రపంచవ్యాప్తంగా 60, 70ల్లో జరిగిన శాంతిస్థాపన పోరాటాల్లో పాల్గొన్న పలువురికి స్ఫూర్తినిచ్చింది గాంధేయ వాదమే. పర్యావరణ ఉద్యమాల్లో పాల్గొన్న చాలా మంది ఇదే దారిలో నడిచారు. ఇన్ని రకాల ఆందోళనల నేపథ్యంలో ఆటన్‌బ్రె గాంధీ సినిమా తీశారు. 20వ శతాబ్ద చరిత్రను స్థూలంగా చదివినా గాంధీ సినిమాకంటే ముందు ప్రపంచానికి గాంధీ గురించి తెలిసింది చాలా ఎక్కువన్నది అర్థం అవుతుంది. ప్రముఖ చరిత్రకారుడు డేవిడ్ హార్డీమన్.. 'గాంధీ ఇన్ హీజ్ టైమ్ అండ్ అవర్స్' అన్న పుస్తకంలో ప్రపంచవ్యాప్తంగా గాంధీ ప్రభావం గురించి విపులంగా వివరించారు. 1924లోనే రోమైన్ రోలండ్ గాంధీ జీవితాన్ని, సిద్ధాంతాలను స్పృశిస్తూ రాసిన పుస్తకం చాలా ప్రాచుర్యం పొందింది. అప్పటికే రోలండ్ నోబెల్ బహుమతిని పొందారు.

ఎవరెవరో గాంధీ గురించి రాయటం మాట అటుంచి గాంధీ సొంత రచనలే చాలా ఎక్కువ. వ్యాసాలు, పుస్తకాలు, జాబులు–జవాబులు వరకూ గాంధీ పుంఖానుపుంఖంగా రాశారు. స్వయంగా పత్రికలు నడిపారు. తన సిద్ధాంతాలపైన విమర్శలనూ విస్తృతంగా అందులో ప్రచురించారు. క్రియాశీల రాజకీయాల్లో పాల్గొంటూ విస్తృతంగా రచనలు చేసినవారు అరుదుగా ఉంటారు. గాంధీ దీనికి భిన్నం. మరణించే నాటికే ఆయన రచనలు చాలా ప్రాచుర్యం పొందాయి. దండి ఉప్పు సత్యాగ్రహం సందర్భంగా ప్రసారమాధ్యమాలను ఆకర్షించటానికి గాంధీ రచించిన ప్రణాళిక అప్పట్లోనే సంచలనం. దానికి లభించిన ప్రచారం అనూహ్యం. ఆ తర్వాతే ప్రఖ్యాత టైం మ్యాగజీన్ 1930 సంవత్సరానికి గాంధీని 'మ్యాన్ ఆఫ్ ద ఇయర్'గా ప్రకటించింది. గాంధీ హిందూ మతాన్ని వ్యతిరేకించలేదు. కుల వ్యవస్థను ఈసడించుకోలేదు. పాశ్చాత్య రాజకీయ సిద్ధాంతాలను ఉన్నత మైనవిగా భావించలేదు.

మతపరమైన పరిభాషను వదల్లేదు. భగవద్గీతను కాంతి దీపం గా పరిగణించటం మానలేదు. మైనారిటీల కోసం గొంతెత్తటం ఆపలేదు. వర్గ పోరాటాలను అక్కున చేర్చుకోలేదు. స్త్రీ పురుష సంబంధాలపై అందరికీ ఆమోదమయ్యే ప్రతిపాదనలు చేయలేదు. భిన్న సిద్ధాంతాల నుంచి చూస్తే ఇవన్నీ పరిమితులు గానే కనపడతాయి. కానీ సావర్కర్ ప్రబోధించిన హిందూత్వను సమర్థించలేదు. హిందూ ఆధిపత్యాన్ని అంగీకరించ లేదు. ముస్లింలను శత్రువులుగా చూడటానికి నిరాకరించారు. ముస్లిం పాలకులను సంస్కృతీ విధ్వంసకులుగా వర్ణించలేదు. హిందూ మతంలోని చెడును బహిరంగంగానే వ్యతిరేకించారు. తీవ్ర హిందూత్వ రాజకీయాలతో ప్రభావితమైన వారు చాలా కాలం గాంధీని ద్వేషించారు.

ప్రపంచ ప్రజాస్వామ్య ఉద్యమాల్లో, సిద్ధాంతాల్లో గాంధీ ప్రభావాన్ని చూడటానికి సుముఖత చూపించలేదు. గాంధీ గురించి 1980లకు ముందు ప్రపంచా నికి తెలియదనటానికి ఇదీ ఒక కారణం కావొచ్చు! అపరిమిత అభివృద్ధి పేరుతో ప్రకృ తిని వికృత పరుస్తూ విధ్వంసాన్ని కొనసాగిస్తున్నంత కాలం.. కోర్కెలకు కళ్లెం వేయటాన్ని సర్వోత్కృష్ట విలువగా భావించిన గాంధీ మన భావావరణంలో ఏదో విధంగా మసలుతూనే ఉంటారు ! ❑

## ఇది బహుజనుల రాజకీయ విజయం

23వ పేజీ తరువాయి

వస్తే దేశ ప్రజల సంపదను ముస్లింలకు పంచేస్తుందనీ, అర్బన్ నక్సల్ మనస్తత్వం కలిగిన ఆ పార్టీ నాయకులు మన తల్లులు, సోదరీమణుల మెడలోని మంగళ సూత్రాలను వదలరనీ మోడీ వ్యాఖ్యానించారు. నిజాని కి ఒక మత ఆవేశం గాని, మతోన్మాదం కానీ, భారతదేశాన్ని పరిపాలించలేదు అనే విషయం ఈ ఎన్నికలు నిరూపించాయి. భారతదేశం పునర్నిర్మించాలంటే తప్పకుండా అంబేద్కర్ మార్గాన్ని అనుసరించాల్సిందే.

### రాజ్యాంగ పరిరక్షణ జరిగింది !

భారత రాజ్యాంగాన్ని రక్షించండి అనే నినాదాన్ని ముఖ్యంగా మల్లిఖార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీ భుజాన వేసుకుని దేశమంతా ప్రచారం చేయడం వల్ల మోడీ యొక్క ప్రభావం భారతదేశ ప్రజలకు తెలిసింది. బిహార్‌లో 12 సీట్లు సాధించిన నితీష్‌కుమార్, ఆంధ్రప్రదేశ్‌లో 16 సీట్లు సాధించిన చంద్రబాబు జాతీయ రాజకీయాల్లో కీలకమయ్యారు. వారు మోడీ నాయకత్వంలోని ఎన్‌డీఏని సమర్థించారు. మొదట మోడీకి వ్యతిరేకంగా ఇండియా కూటమిని రూపొం దించిన వారిలో నితీష్ కుమార్ ముఖ్యుడు. కానీ ఆయన బీసీ కులగణన తీర్మానాన్ని బీజేపీ అంగీకరి స్తుందా? అనేది ప్రశ్న. అలానే ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదాని పార్లమెంటులో నిరాకరించిన బీజేపీతో చంద్రబాబు చివరిదాకా మనుగడ అనేది ప్రశ్నార్ధ కం?! ప్రభుత్వంతో సమఉజ్జీగా ఉన్న ప్రతిపక్షం భారత రాజ్యాంగాన్ని రక్షించడంలో కృతకృత్యం అవుతుందని, ఈ రాజ్యాంగ పోరాటాన్ని మరింత ముందుకు కొనసాగిస్తుందని ఆశిద్దాం.

## ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గం

- చంద్రబాబునాయుడు – ముఖ్యమంత్రి, లా అండ్ ఆర్డర్, జీఏడీ
- పవన్ కళ్యాణ్ – డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్, తాగునీటి సరఫరా, గ్రామీణాభివృద్ధి, అడవులు, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావణ శాఖలు
- వంగలపూడి అనిత – హోం శాఖ
- నారా లోకేష్ – ఐటీ, మానవ వనరులు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్
- కింజరాపు అచ్చెన్నాయుడు – వ్యవసాయం, సహకారశాఖ, మార్కెటింగ్, పశుసంవర్థక శాఖ, డెయిరీ డెవలప్‌మెంట్, మత్స్య శాఖలు
- కొల్లు రవీంద్ర – గనులు, ఎక్సైజ్ శాఖలు
- నాదెండ్ల మనోహర్ – ఆహార, పౌర సరఫరాల శాఖలు
- పి.నారాయణ – మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ
- సత్యకుమార్ యాదవ్ – ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, మెడికల్ ఎడ్యుకేషన్
- నిమ్మల రామానాయుడు – జలవనరుల అభివృద్ధి శాఖలు
- ఎన్.ఎమ్.డి. ఫరూక్ – మైనార్టీ, న్యాయ శాఖలు
- ఆనం రామనారాయణరెడ్డి – దేవాదాయ శాఖ
- పయ్యావుల కేశవ్ – ఆర్థిక, ప్రణాళిక, కమర్షియల్ ట్యాక్సెస్, శాసనసభ వ్యవహారాల శాఖలు
- అనగాని సత్యప్రసాద్ – రెవెన్యూ, రిజిస్ట్రేషన్స్, స్టాంప్స్ శాఖలు
- కొలుసు పార్థసారథి – గృహ నిర్మాణం, I &PR శాఖలు
- డోలా బాలవీరాంజనేయస్వామి – సాంఘిక సంక్షేమం, సచివాలయ, వాలంటీర్ వ్యవస్థ శాఖలు
- గొట్టిపాటి రవి కుమార్ – విద్యుత్ శాఖ
- కందుల దుర్గేష్ – పర్యాటక, సాంస్కృతిక శాఖ
- గుమ్మిడి సంధ్యారాణి –స్త్రీ, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ
- బీసీ జనార్థన్ రెడ్డి – రహదారులు, భవనాల శాఖలు
- టీజీ భరత్ – పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖలు
- ఎస్.సవిత – బీసీ సంక్షేమం, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ శాఖలు
- వాసంశెట్టి సుభాష్ – కార్మిక, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్
- కొండపల్లి శ్రీనివాస్ –MSME, సెర్ప్, NRI ఎంపవర్‌మెంట్ శాఖలు
- మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి – రవాణా, యువజన సర్వీసులు, క్రీడలు

## ఆంధ్రప్రదేశ్ జిల్లాల వారీగా ఎన్‌డీఏ, వైసీపీ గెలిచిన స్థానాలు

| జిల్లా | సీట్లు | NDA | YSRCP | ఇతరులు |
|---|---|---|---|---|
| శ్రీకాకుళం | **8** | 8 | 0 | 8 |
| విజయనగరం | **7** | 7 | 0 | 7 |
| పార్వతీపురం మన్యం | **4** | 4 | 0 | 4 |
| విశాఖపట్నం | **7** | 7 | 0 | 7 |
| అనకాపల్లి | **6** | 6 | 0 | 6 |
| అల్లూరి సీతారామరాజు | **3** | 1 | 2 | 3 |
| కాకినాడ | **7** | 7 | 0 | 7 |
| తూర్పు గోదావరి | **7** | 7 | 0 | 7 |
| కోనసీమ | **7** | 7 | 0 | 7 |
| పశ్చిమ గోదావరి | **7** | 7 | 0 | 7 |
| ఏలూరు | **7** | 7 | 0 | 7 |
| ఎన్టీఆర్ | **7** | 7 | 0 | 7 |
| కృష్ణా | **7** | 7 | 0 | 7 |

| | | | | |
|---|---|---|---|---|
| గుంటూరు | **7** | 7 | 0 | 7 |
| పల్నాడు | **7** | 7 | 0 | 7 |
| బాపట్ల | **6** | 6 | 0 | 6 |
| ప్రకాశం | **8** | 6 | 2 | 8 |
| నెల్లూరు | **8** | 8 | 0 | 8 |
| తిరుపతి | **7** | 7 | 0 | 7 |
| చిత్తూరు | **7** | 6 | 1 | 7 |
| అన్నమయ్య | **6** | 4 | 2 | 6 |
| కడప | **7** | 5 | 2 | 7 |
| నంద్యాల | **6** | 6 | 0 | 6 |
| కర్నూలు | **8** | 6 | 2 | 8 |
| అనంతపురం | **8** | 8 | 0 | 8 |
| శ్రీ సత్యసాయి | **6** | 6 | 0 | 6 |
| **మొత్తం** | **175** | **164** | **11** | **175** |

# వైసిపి ఓటమి-కొన్ని కారణాలు



- కె.యస్.లక్ష్మణరావు

**రాష్ట్ర విభజన తర్వాత, ఆంధ్రప్రదేశ్ శాసనసభకు మూడవసారి జరిగిన ఎన్నికలలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం పాలై కేవలం 11 సీట్లకు పరిమితమైంది. తెలుగుదేశం పార్టీ కూటమి 164 సీట్లతో ప్రభంజనాన్ని సృష్టించింది. ప్రాంతాలతో నిమిత్తం లేకుండా ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తా, రాయలసీమ మొత్తం అన్ని ప్రాంతాలలో ఒకే రకమైన విజయాన్ని కూటమి సాధించింది. వై.యస్.జగన్ మోహన్‌రెడ్డి మంత్రి వర్గంలో ఉన్న 26 మంది మంత్రులలో 24 మంది ఘోర పరాజయం పాలయ్యారు. పాత 13 జిల్లాలలో 8 జిల్లాల్లోని వైసీపీకి ఒక్క సీటు కూడా లభించలేదు.**



2024 ఎన్నికలలో కూటమిలో తెలుగుదేశం పార్టీకి 45.60 శాతం, జనసేనకు 6.85 శాతం, బిజెపికి 2.83 శాతం ఓట్లు లభించాయి. వైసిపి 39.37 శాతం ఓట్లకే పరిమితమైంది. లోక్‌సభ ఎన్నికలలో మొత్తం 25 స్థానాలకు గాను 21 స్థానాలు కూటమికి, 4 స్థానాలు వైసిపికి లభించాయి. ఇంత పెద్ద స్థాయిలో ఓటమికి కొన్ని కీలకమైన కారణాలను పరిశీలిద్దాం. జగన్‌మోహన్‌రెడ్డి నిరంకుశ ధోరణి 2019 ఎన్నికలకు ముందు పాదయాత్రలో ప్రజలతో మమేకమైన జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ప్రజాస్వామ్య ధోరణికి భిన్నంగా నిరంకుశ, అహంభావ ధోరణితో పరిపాలన కొనసాగించారు. ప్రజలకు, ఆయనకు మధ్య 'ఇనుప తెర' ఏర్పడింది. వై.యస్.రాజశేఖర్‌రెడ్డి 2004-2009 మధ్య ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఉండగా ఒక క్రమపద్ధతిలో ప్రజలను, ప్రజా ప్రతినిధులను, రాజకీయ నాయకులను, అధికారులను కలిసేవారు. ఉదయం 9 గంటలకల్లా బేగంపేట క్యాంప్ కార్యాలయంలో అనేక మందిని కలిసి వాళ్లు చెప్పే విషయాలను శ్రద్ధగా విని పరిష్కారానికి ప్రయత్నించేవారు. ఐదేళ్లపాటు పాలన చేసిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాప్రతినిధులను, శాసనసభ్యులను, పార్లమెంటు సభ్యులను, మంత్రులను, శాసనమండలి సభ్యులను, వివిధ యూనియన్ల నాయకులను, మేధావులను కలవడానికి ఇష్టపడలేదు. అనేక మార్గాల ద్వారా అందే సమాచారాన్ని ఆయన స్వీకరించలేదు. ఫలితంగా సజ్జల రామకృష్ణారెడ్డి, ధనుంజయ రెడ్డి వంటి వారు ప్రధాన వ్యక్తులుగా రూపొంది సమాచారం ముఖ్యమంత్రి వరకు వెళ్లని పరిస్థితి ఏర్పడింది. ఉదాహరణకు అంగన్‌వాడీలు 1,05,000 మంది 42 రోజులపాటు సమ్మె చేస్తే దాని పరిష్కారంలో భాగంగా ముఖ్యమంత్రిని కలిసే అవకాశమే లభించలేదు. శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు తమ ప్రాతినిధ్యాలు ముఖ్యమంత్రికి అందించే అవకాశం కార్యాలయంలో కాకుండా, జిల్లాలలో హెలిపాడ్‌ల వద్ద మాత్రమే లభించేది. దీనివలన ప్రజా ప్రతి నిధులలో స్థానిక సంస్థల ప్రతినిధులలో తీవ్ర అసంతృప్తి, నిస్తేజం ఏర్పడింది. దీనితోపాటు 'వాలంటీర్ల వ్యవస్థ' పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యత లేకుండా చేయడంతో కార్యకర్తలలో పార్టీ పరంగా ఉత్సాహం లోపించింది. వాలంటీర్లు, సచివాలయ వ్యవస్థతో స్థానిక సంస్థలు, స్థానిక సంస్థల ప్రతినిధులు ప్రాధాన్యత కోల్పోయారు.

### మౌలిక వసతుల కల్పన ఏదీ ?

ఐదేళ్ల పాలనలో సంక్షేమం కోసం 'బటన్ నొక్కుడు' (డి.బి.టి) ద్వారా ప్రజలకు రూ.2,70,000 కోట్లు అందచేశామని ముఖ్యమంత్రి అనేక బహిరంగ సభలలో ప్రకటించారు. కానీ రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలను పూర్తిగా విస్మరించారు. పరిశ్రమల ఏర్పాటుకు ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు నాలుగేళ్లలో రూ.62,000 కోట్లు కేటాయించి కేవలం రూ.31,000 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. వెలిగొండ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, హంద్రీ-నీవా, గాలేరు-నగరి వంటి ప్రాజెక్టులు పూర్తి కావటానికి ఎటువంటి

ఆసక్తి చూపించలేదు. గుంటూరు చానల్, వరికపూడిశెల వంటి చిన్న నీటిపారుదల ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదు. రాష్ట్రంలో మౌలిక వసతులు ముఖ్యంగా రోడ్ల నిర్మాణం పట్ల పూర్తి నిర్లక్ష్యం చూపించారు. ప్రధానమైన రోడ్లు వేలాది కిలోమీటర్లు దెబ్బ తిన్నప్పటికీ వాటి నిర్మాణానికి ప్రయత్నించ లేదు. రోడ్లకు పడిన గుంతల వలన అనేక మంది మరణిం చారు. మంత్రులు ఈ విషయాన్ని తేలికగా తీసుకున్నారు.

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఐదేళ్ల పాలనలో ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లను పూర్తిగా దూరం చేసుకున్నది. ప్రధానమైన యూనియన్లతో చర్చించడం కానీ, వారితో అనేక సమస్యలపై కానీ ముఖ్యమంత్రి మాట్లాడ లేదు. చర్చలు కేవలం సజ్జల రామకృష్ణారెడ్డి, బొత్స సత్యనారా యణలకే పరిమితమయ్యేవి. ప్రభుత్వం తమకనుకూలంగా ఉండే నలుగురు నాయకుల అభిప్రాయాలను మాత్రమే పరిగణ నలోకి తీసుకున్నది. విజయవాడ బి.ఆర్.టి.ఎస్ రోడ్డులో 2022 ఫిబ్రవరి 3న జరిగిన మహోద్యమం తరువాత ప్రభుత్వం సాను కూలంగా స్పందించకుండా ఉద్యమాలను అణచివేయడానికి పూనుకున్నది. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు ఇచ్చే వేతన సంఘం సిఫార్సులలో ముఖ్యంగా 11వ పి.ఆర్.సిలో పూర్తిగా అన్యాయం చేసింది. ప్రతి నెలా ఒకటవ తేదీకి జీతం రావడం గగనమైపోయింది. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు ఇప్పటికీ రూ.18,000 కోట్ల బకాయిలు చెల్లించ వలసి ఉంది. సి.పి.యస్ రద్దు చేస్తామన్న హామీని అమలు పరచకుండా జి.పి.యస్ అనే కొత్త విధానాన్ని సృష్టించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయు లు, పెన్షనర్లు తీవ్ర అసంతృప్తితో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మారారు. అదే విధంగా ఉపాధ్యాయులను యాప్‌ల పేరుతో, ప్రవీణ్ ప్రకాష్ విజిట్ల పేరుతో వేధించడంతో పాఠశాలల మౌలిక వసతులు కొంత మెరుగు పడినప్పటికీ ఉపయోగం లేకుండా పోయినది.

కక్ష సాధింపు ధోరణి గెలుపొంది అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ పార్టీ అయినా, నాయకుడైనా సంయమనంతో వ్యవ హరించాలి. ప్రత్యేకించి పరిపక్వత కలిగి ఉండాలి. కానీ జగన్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కక్ష సాధింపు ధోరణితో వ్యవ హరించింది. అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే ప్రజా వేదికను కూల్చివేశారు. స్కిల్ డెవలప్ మెంట్ స్కామ్ పేరుతో చంద్రబాబునాయుడిని అరెస్ట్ చేసి అనేక రోజులపాటు జైలులో ఉంచటం ప్రజలలో సానుభూతి కలగ చేసింది. అంతేగాక ల్యాండ్ టైటిలింగ్ చట్టం పట్ల రైతులలో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిం ది. రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాలలో రాజ కీయ కక్షలతో ప్రతి పక్ష పార్టీలపై దాడులు జరగటాన్ని కూడా ప్రజలు వ్యతిరే కించారు. ఎన్.టి.ఆర్ హెల్త్ యూనివర్శిటీ పేరు మార్పును ప్రజలు హర్షించలేదు. వీటితోపాటు ప్రజాస్వామ్యంలో నిరసన లు, ఆందోళనలు, ధర్నాలు అతి సహజమైన విషయం. ఏ ప్రభుత్వం ఉన్నా రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు వీటిని నిర్వహిస్తూ ఉంటాయి. కానీ జగన్ ప్రభుత్వం ఈ నిరసన కార్యక్రమాలను క్రూరంగా అణచి వేయడానికి పోలీస్ యంత్రాంగాన్ని పూర్తిగా ఉపయోగించింది. నిరుద్యోగం ఆంధ్రప్రదేశ్ విభజన (2014 లో) తర్వాత రాష్ట్రం ఎదుర్కొన్న సమస్యలలో నిరుద్యోగం ప్రధానమైనది. రాష్ట్రంలో ఐ.టి రంగ పరిశ్రమలు గాని, ఇతర పరిశ్ర మలుగాని అభివృద్ధి చెందలేదు. ఐదేళ్లుగా జగన్ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధి కల్పన లో వైఫల్యం చెందింది. లక్షకుపైగా సచి వాలయ ఉద్యోగాలు, మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగాలు మినహా మిగిలిన ఉద్యోగాలు భర్తీ చేయలేదు. ప్రతి సంవత్సరం 'జాబ్ క్యాలెండర్' విడుదల చేస్తామని చెప్పి, ఒక్కసారి మాత్రమే 10 వేల ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ ఇచ్చారు. గత ఐదేళ్లుగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఒక్క డిఎస్సీ ఇవ్వలేదు. రాష్ట్రంలో దాదాపు 25 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే, నిరుద్యోగ అభ్యర్థుల ఒత్తిడి వల్ల చివరిలో 6,100 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. ఇంకా పరీక్ష జరగలేదు. మెగా డీఎస్సీ ఇవ్వాలని ఎమ్మెల్సీలు, నిరుద్యోగులు, యువజన సంఘాలు ఒత్తిడి చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదు. గ్రూప్-2, గ్రూప్-1, గ్రూప్-3 వంటి పోస్టుల్లో వేల సంఖ్యలో ఖాళీలు ఉండగా వాటి నోటిఫికేషన్లు ఇవ్వలేదు. వయోపరిమితి పెంచలేదు. ఈ ఎన్నికలలో నగదు బదిలీ ద్వారా లబ్ధి పొందిన కుటుంబాలలోని నిరుద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పని చేశారు. ప్రజా వ్యతిరేకత మూడు రాజధానుల పేరిట రాష్ట్రానికి అసలు రాజధానే లేకుండా చేసిన వైనం, రాష్ట్రానికి ఎంత ద్రోహం చేసినా, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంతో అంటకాగడం వంటి కారణాల వల్ల గత ఐదేళ్లుగా పాలించిన వైసిపి ప్రభుత్వం పట్ల వివిధ తరగతుల ప్రజలలో అసంతృప్తి ఏర్పడింది. ప్రజలను సంతృప్తి పరచాలంటే 'బటన్ నొక్కుడు' ఒక్కటే చాలదని ఈ ఎన్నికలు నిరూపించాయి. సమాజంలోని రైతులు, కార్మికులు, సంఘటిత ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు, మధ్య తరగతి ప్రజలు, యువకులు మొదలగు వారందరినీ సంతృప్తి పరచాలి. 'బటన్ నొక్కుడు' (డి.బి.టి) నయా ఉదార వాద విధానాల అమలులో ప్రపంచ బ్యాంక్ ఆదేశాలతో అమలు జరుగుతున్న ఒక విధానం మాత్రమే. వైసిపికి శాసనసభ స్థానాలు 11 మాత్రమే వచ్చినప్పటికీ 39.37 శాతం ఓట్లు వచ్చాయి. ఇవి తక్కువేమీ కాదు. ప్రజాస్వామ్యంలో అధికార పక్షంతోపాటు ప్రతిపక్షానికి ముఖ్యమైన పాత్ర ఉన్నది. బాధ్య తాయుత ప్రతిపక్షంగా రాబోయే ఐదేళ్లు వైసిపి సమర్థవంతంగా పని చేయాలని ఆశిద్దాం. ❑

# సంక్షేమమే సర్వస్వమా జగన్ ?



**- డి.సోమసుందర్**

"నిజంగా.. ఆశ్చర్యంగా కూడా ఉంది.. ఊహించను కూడా ఊహించలేదు.. ఇలా జరుగుతుందని.. ఇలా వస్తాయని !" శాసనసభ ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పలికిన పలు కులు ఇవి. పోలింగు పూర్తయిన రెండో రోజు తనకు రాజకీయ కన్సల్టెన్సీ సేవలు అందిస్తున్న ఐ ప్యాక్ సిబ్బందికి కృతజ్ఞతలు చెబుతూ జగన్ మోహన్‌రెడ్డి మాట్లాడిన మాటలు కూడా మనం ఒకసారి గుర్తుచేసుకోవాలి. "ఎన్నికల్లో 151 స్థానాలు మించి గెలుస్తాం.. ఫలితాలు చూసి దేశం మొత్తం లేచి నిలబడి ఆంధ్రప్రదేశ్ ఫలితాల వంక ఆశ్చర్యంతో చూస్తుంది" అన్నారు. ఫలితాలు వెలువడ్డాక వాటిని చూసి దేశం సంగతి ఎలా ఉన్నా ఆయనే ఆశ్చర్యపోయారు. 2019లో 175కు 151 స్థానాలు గెలిచి అత్యంత భారీ విజయాన్ని నమోదు చేసిన జగన్ ఐదేళ్ల పాలన తర్వాత ఇంతటి భారీ పరాజయాన్ని మూట కట్టుకోవడం చాలా మందికి నిజంగానే ఆశ్చర్యకరంగా ఉండవచ్చు. ఐదేళ్ల వ్యవధిలో నిర్వహించిన రెండో పత్రికా సమావేశంలో జగన్ మాట్లాడిన ధోరణిలో ఓటమికి గల కారణాలను పరిశీలించుకునే ఉద్దేశ్యం ఎంత మాత్రమూ కనిపించలేదు. లక్షల కోట్ల రూపాయ లతో కోట్లాది మంది అక్క చెల్లెమ్మలకు, అవ్వా తాతలకు, రైతన్నలకు, బడి పిల్లలకూ, చిన్నారులకు అమలు చేసిన సంక్షేమ పథకాలు తనకు ఓట్లుగా మారకపోవడంపై జగన్ ఆశ్చర్య పోయినట్లు ఆయన మాటలు వెల్లడించాయి! "కూటమిలో పెద్ద పెద్ద వాళ్ళు ఉన్నారు. ఎక్కడో ఏదో జరిగింది. కానీ నా దగ్గర ఆధారాలు లేవు. పైన దేవుడు చూస్తున్నాడు" అంటూ ఫలితాలపై తన ఆపనమ్మకాన్ని సైతం జగన్ బైట పెట్టారు. తమకు 11 స్థానాలు మాత్రమే రావడం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించినా 39 శాతం ఓట్లు రావడంపై జగన్ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించారు.

2014 నుండి రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం గానూ, 2019 నుండి అధికారపక్షం గానూ వ్యవహరించి నందువల్లనూ, తాజాగా ప్రజలు ఇచ్చిన తీర్పును పరిశీలించుకోవాల్సిన బాధ్యత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై ఉంది. ఎవరు ఎన్ని నినాదాలు ఇచ్చినా, ఎన్ని ప్రసంగాలు చేసినా, ఎన్ని మ్యానిఫెస్టోలు ప్రకటిం చినా ఎన్ని ప్రచారాలు చేసినా, ఎన్ని విశ్లేషణలు చేసినా, ప్రజల తీర్పు విస్పష్టంగా ఉంది. రాష్ట్రంలోని అత్యధిక సంఖ్యాక ప్రజలు వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పరిపాలనను ఇక ఎంత మాత్రమూ కొనసాగించాలని అనుకోలేదు! జగన్ను అధికారంలో ఉంచాలా, దించాలా అనే ఒకే ఒక్క అంశంపై రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఆయన్ని గద్దె దించాలనే గట్టి నిర్ణయాన్ని తీసుకున్నారు. ఇంతటి ఘోర పరాజయానికి రాష్ట్రంలో జగన్ అమలు చేసిన "పరిపాలనా నమూనా" యే ప్రధానకారణం. 2019 లో రాష్ట్ర ప్రజలు తనకు ఇచ్చిన ఒక భారీ విజయాన్ని ఆయన తప్పుగా అర్థం చేసుకున్నారు. 151 స్థానాలతో గెలిచాను కాబట్టి తాను ఏమి తలిస్తే అదే చేయవచ్చని జగన్ గట్టిగా భావించారు. శాసనసభలో ప్రతిపక్షానికి, శాసనసభలో ప్రాతినిధ్యం లేక పోయినా ప్రజాజీవితంలో ప్రముఖంగా ఉన్న వివిధ రాజకీయ పక్షాలకు, ప్రజా ఉద్యమ సంస్థలకు, మీడియాకు, పౌర సమాజానికి ఒక స్థానం ఉంటుందన్న ప్రాథమిక ప్రజాస్వామిక సూత్రాన్ని జగన్ ఖాతరు చేయలేదు.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో చట్ట సభలకు, శాసన సభ్యులకు, మంత్రులకు, వివిధ కమిటీలకు వేర్వేరు బాధ్యతలు ఉంటాయి. ఎన్నికైన స్థానిక ప్రభుత్వాలకు కొన్ని బాధ్యతలు ఉంటాయి. వీటన్నిటినీ పక్కనబెట్టిన జగన్ పరిపాలనను విపరీ తంగా "కేంద్రీకృతం" చేశారు. సెక్రటేరియట్‌కు కూడా వెళ్లకుండా తన అధికార గృహం నుంచే పరిపాలన సాగించారు. జగన్ వ్యవహార శైలిని గమనిస్తే పైన దేవుడు, తర్వాత తాను, కింద ప్రజలు తప్ప మిగిలిన వ్యవస్థలు ఏమీ ఉండవని ఆయన బలంగా భావించారని అర్థం చేసుకోవచ్చు. నవరత్నాల పేరుతో తాను ఇచ్చే సంక్షేమ పథకాల సొమ్ము అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు పంపడమే పరిపాలన అనే గట్టి నమ్మకం ఆయనలో పాతుకుపోయింది. తన ఓటమికి ఆశ్చర్య పోతూ జగన్ మాట్లాడిన మాటల్లో సంక్షేమ పథకాలు పొందిన వారు తనకు ఎందుకు ఓట్లు వేయలేదని వాపోవడం చూడవ చ్చు. నేను ఇస్తున్నాను కాబట్టి విశ్వాసం చూపడం ప్రజల బాధ్యత అన్నట్లుగా జగన్ మాట్లాడారు. అయితే రాజకీయ నాయకులకు లేని స్పృహ తమకు ఉందని లబ్ధిదారులు రుజువు చేశారు. "ఎవరి సొమ్ము ఎవరికి ఇస్తున్నారు" అనే లబ్ధిదారుల ప్రశ్న బహుశా జగన్ గారి చెవులకు సోకలేదు. 2019 ఎన్నికల్లో ఫలితాలు చూసి చంద్రబాబు ఇలాగే వాపోయిన సంగతిని గుర్తు చేసుకోవాలి. రైతు రుణమాఫీ, పసుపు కుంకుమ, లాంటి బోలెడు పథకాలు ఇచ్చినా ప్రజలు తెలుగుదేశాన్ని గద్దె దింపా రు. ఎన్ని సంక్షేమ పథకాలు ఇచ్చినా తెలంగాణాలో కేసీఆర్‌ను గద్దె దింపారు. అదే కోవలో ప్రస్తుతం ఆంధ్ర ప్రజలు జగన్‌ని గద్దె దింపారు. సంక్షేమం ఒక్కటే చాలదని ప్రజలు భావిస్తున్నారనడానికి ఈ ఫలితాలే రుజువు. ప్రజల ఆకాంక్షలు, మనోభావాలు పట్టించుకోకుండా ఏకపక్షంగా నియంతృత్వ,

అహంకార పూరిత పరిపాలన సాగిస్తే ప్రజలు ఆదరించరని ఆంధ్రప్రదేశ్ ఓటర్లు చెప్పిన తీర్పుతో స్పష్టంగా వెల్లడి అయ్యింది.

అత్యంత శక్తివంతమైన కాంగ్రెస్ అధిష్టానాన్ని ధిక్కరించి అప్పట్లో సొంతపార్టీ స్థాపించుకున్న జగన్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఒక తిరుగుబాటుదారుని చూశారు. తిరుగుబాటు చేసిన వారిని సాహసవీరునిగా ఆరాధించడం మన సమాజంలో ఒక ఆనవాయితీ. ఓదార్పుయాత్ర ద్వారా కోట్లాది ప్రజలకు చేరువైన జగన్‌లో ఒక కష్టజీవి ఇమేజిని వారు చూశారు. ప్రతిపక్ష నేత హోదాలో ప్రజా సమస్యలపై చేసిన పోరాటాల ద్వారా ఒక ప్రజానాయకునిగా ఆయన ఆవిర్భవించారు. తన మానిఫెస్టో ద్వారా సంక్షేమ రాజ్యాన్ని తెచ్చే గొప్ప ఆదర్శ పరిపాలకుని రూపాన్ని ఆయన ఆవిష్కరించారు. ఒక్కసారి అవకాశం ఇవ్వండి అంటూ ఆయన చేసిన విజ్ఞప్తికి ప్రజలు ఒక్కసారి భారీగా స్పందించారు. ఆయన అధికారంలోకి వచ్చాక అంతకుముందు తాను సాధించుకున్న సానుకూల ఇమేజిని తన వ్యవహార శైలి ద్వారా జగన్ క్రమేపీ చేజార్చుకున్నారు. ఐదేళ్లలో శాసనసభను నిర్వహించిన తీరు, రాష్ట్రంలో పౌర సమాజంలోని వివిధ శ్రేణుల వాణిని అణచివేయడం, ప్రతిపక్షాన్ని అవమానించడం, విమర్శనాత్మక మీడియాను శత్రువులుగా ప్రకటించడం వంటి చర్యల ద్వారా జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాస్వామ్యానికి తనదైన కొత్త భాష్యం చెప్పారు. మానిఫెస్టోలోని అంశాలను అమలు చేయాలని కోరిన వర్గాలను ఆయన సహించలేకపోయారు. భిన్నాభిప్రాయాలను, అసమ్మతిని, నిరసనలను అణచి వేయడంతోపాటు వారిపై కక్ష గట్టి వ్యవహరించారు. ప్రభుత్వ ఉద్యోగులపట్ల ఆయన వ్యవహరించిన తీరు అందుకు ఒక పెద్ద ఉదాహరణ. తమతో ఏకీభవించని వారిపై సామాజిక మాధ్యమాల్లో ప్రచార దాడిని సాగించారు. అక్రమ అరెస్టులు, తప్పుడు కేసులు రాష్ట్రంలో నిత్యకృత్యంగా మారాయి. చివరికి అధికార యంత్రాంగంలోని సీనియర్ ఉన్నతాధికారులను సైతం నిరంతర అభద్రత లోనికి నెట్టారు. మాట వినని వారిపై వేటు వేశారు. న్యాయస్థానాలను లెక్కచేయని తెంపరితనాన్ని ప్రదర్శించారు. తాను పేదలకు సంక్షేమం ఇస్తుంటే పెత్తందార్లు అడ్డుకుంటున్నారని జగన్ నమ్మడమే కాకుండా అదే విషయాన్ని నిరంతరం చెబుతూ వచ్చారు. సంక్షేమం తనతోనే పుట్టిందని గతంలో ఎవరూ చేయనివన్నీ తాను చేస్తున్నానని గట్టిగా వాదిస్తూ వచ్చారు. సొంత పార్టీలోని మంత్రులను, ఎమ్మెల్యేలను, ఎంపీలను కలుసుకోకుండా పాలన సాగించారు. ఏరికోరి పెద్ద సంఖ్యలో నియమించుకున్న సలహా దారులను సైతం ఆయన నెలల తరబడి కలుసుకోలేదు. కలుద్దా మనుకున్న వారికి అపాయింట్ మెంట్ ఇవ్వలేదు. వారి సలహాల ను సూచనలను తీసుకోవాల్సిన అవసరం లేదన్నట్లు ఆయన వ్యవహరించారు. ప్రజలకు తనకూ మధ్య ఇతర వ్యవస్థల అవసరం లేదని ఆయన విశ్వసించారు. ఒకప్పుడు ప్రజలకు అందుబాటులో ఉన్న జగన్ అధికారంలోకి వచ్చాక అదే ప్రజలను దూరం పెట్టారు. “సంక్షేమ పథకాల సొమ్ము ఇస్తున్నాను కదా, అదే పరిపాలన, అంతకుమించి ఏమీ ఉండదని” జగన్ గట్టిగా భావించారు. తన పథకాల అమల్లో ఉన్న లోపాలు ఆయన దృష్టికి పోనేలేదు. అవి ప్రజల జీవితాలను మార్చడం లేదన్న వాస్తవం ఆయనకు తెలియ లేదు. ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ అన్నట్లు జగన్ ఇచ్చే పథకాలకు ప్రజల ఆకాంక్షలకు పొంతన లేకుండా పోయింది. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రవేశ పెట్టిన “పరిపాలనా నమూనా” ఆయన్ని ప్రజలకు దూరం చేసింది. రైతులు, వ్యాపా రులు, ఉద్యోగులు, యువత , కాంట్రాక్టర్లు, పారిశ్రామిక వేత్తలు వంటి ప్రజా విభాగాలు జగన్ నమూనా వల్ల రాష్ట్రానికి నష్టం జరిగిందని గ్రహించాయి. సంక్షేమ పథకాల లబ్ధిదారులు సైతం కులం, మతం ప్రమేయం లేకుండా ఒకే అభిప్రాయానికి వచ్చారు. ప్రభుత్వం ఇచ్చే సొమ్ముతో తమ జీవితాలు మారడం లేదని వారు గ్రహించారు. రాష్ట్రానికి ఒక రాజధాని లేకపోవడం, ఉపాధి అవకాశాలకు గండిపడటం, వలసలు పెరగడం, రోడ్లు లేకపోవడం, అభివృద్ధి స్తంభించిపోవడం, రుణభారం పెరిగిపోవడం, కార్మికుల జీవితాలు అతలాకుతలం కావడం, పెరిగిన పన్నుల భారాలు, పోలీసు అధికారాల దుర్వినియోగం, కక్ష సాధింపులు, ఇసుక, మద్యం విధానాల్లోని అవినీతి వంటి సవాలక్ష కారణాలు ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకతను తీవ్రంగా పెంచాయి. ప్రత్యర్థులను ఎన్నికల్లో రాజకీయంగా ఓడించడానికి కొన్ని అబద్ధాలని సృష్టించి, వాటిని ప్రజల్లోకి తీసుకు వెళ్ళే ప్రచార వ్యూహాలను రూపొందించడం ఒక ధోరణిగా రాజకీయ పార్టీల్లో ఇటీవల స్థిరపడింది. వాటిని ప్రజలు నమ్మడం నమ్మక పోవడం అనేది వేరే విషయం. కానీ పదే పదే చెప్పి చెప్పి నేతలు తమ అబద్ధాలనే నిజాలనుకోవడం వేరు. తన మానిఫెస్టోని 99 శాతం అమలు చేసానని, దానివల్ల రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, జగన్ గారు ప్రచారసభల్లో చెప్పడం వరకూ సహ జమే అనుకోవచ్చు. నిజం కాదని తెలిసి కొంత మేరకు భరించవచ్చు. కానీ ఇంత భారీ పరాజయం తర్వాత వాటినే నిజాలని జగన్ నమ్మడం ఆయన రాజకీయ నమూనాలోని ఒక విషాదకర పార్శ్వం. ఇలాంటి సంప్రదాయేతర ప్రచారవ్యూహం విఫలం అయ్యాక దాన్ని గుర్తించకపోవడం మరింత విషాదం. 39 శాతం ఓట్ల బలం పొందిన వైకాపాకు చెందిన వేర్వేరు శ్రేణుల నాయకులు, కార్యకర్తలు తమ పరాజయానికి తగిన కారణాలను అన్వేషించకపోతే తర్వాత వచ్చే పరాజయాల పరంపర చివరికి పార్టీ ఉనికికి నష్టం తెస్తాయి. రాష్ట్రంలో కూటమికి లభించిన ఏకపక్ష విజయం కూటమి నేతలకు వినయాన్ని, హుందాతనాన్ని నేర్పాలి. రాజకీయ ప్రత్యర్థులపై పగ ప్రతీకారాలు తీర్చుకోవడం కోసం అధికారాన్ని వినియోగించడం ప్రజల తీర్పును తప్పుగా అర్థం చేసుకోవడమే అవుతుంది. గాడి తప్పిన రాష్ట్ర గమనాన్ని సరైన దారిలో పెట్టడం మీద కూటమి దృష్టి సారించాలి. జగన్ నమూనాకు వ్యతిరేకంగా ప్రజలిచ్చిన తీర్పులోని సారాంశాన్ని వారు సవ్యంగా అర్థం చేసుకుంటారని ఆశిద్దాం ! ❑

# విసిగిపోయారు.. సాగనంపారు !

-రాఘవ శర్మ



**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ ఎన్నికల ఫలితాలు అందరి అంచనాలను తలకిందులు చేశాయి. గడిచిన 2019 శాసన సభ ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి 151 స్థానాలను ఇచ్చిన ఓటర్లు, ఈ విడత 11 స్థానాలకు పరిమితం చేశారు. గడిచిన 2019 శాసన సభ ఎన్నికల్లో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీని ఓటర్లు ఇలాగే 23 స్థానాలకు పరిమితం చేశారు. ఈ తడవ అదే ఓటర్లు ఎన్నికల ఫలితాలను తారు మారు చేశారు. రెండు విడతలుగా ఇంత భారీ తేడాతో ఈ ఫలితాలు వెలువడడాన్ని గమనిస్తే, వీరి పాలనలో ప్రజల జీవితాలు మెరుగు పడకపోగా, మరింత అధ్వాన్నంగా తయారయ్యాయనే ప్రజల అసంతృప్తి ఎన్నికల ఫలితాల రూపంలో పెల్లుబికింది.**

ఏ ప్రభుత్వానికి అయినా రెండు ప్రధానమైన బాధ్యతలు ఉంటాయి. ఒకటి ప్రజల సంక్షేమం, రెండవది శాంతిభద్రతల పరిరక్షణ. సంక్షేమం పేరుతో నగదు బదిలీ ద్వారా ఎన్నికల్లో ఓటర్లను తమ వైపు తిప్పుకోవచ్చనే విధానం తెలుగుదేశం పాలనతో మొదలైంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కూడా అదే విధానాన్ని అనుసరించడంతో చేదు ఫలితాలను చవిచూడవలసి వచ్చింది. నవరత్నాలు సంక్షేమ పథకాలు పేరుతో 2.70 లక్షల కోట్ల రూపాయలను వెచ్చించారు. ఇది పూర్తిగా అనుత్పాదక వ్యయమే కాకుండా, తాత్కాలిక ఉపశమనం కూడా కాదు. దీర్ఘ కాలిక ప్రయోజనాలు కల్పించే చెప్పుకోదగ్గ పథకాలను ప్రభుత్వం ఏమీ చేపట్టలేదు.

### మద్య నిషేధం ఏమయింది?

2019లో ఎన్నికల ముందు సంపూర్ణ మద్య నిషేధం అమలు చేస్తానని ఎన్నికల ముందు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. కరోనా లాక్‌డౌన్ సమయంలో అయాచితంగా లభించిన మద్య నిషేధాన్ని లాక్ డౌన్ అనంతరం ఎత్తి వేసి, మళ్ళీ మద్యం షాపులు తెరిచారు. ఫలితంగా అమ్మఒడి వంటి పథకాలకు ఇచ్చే నిధుల్లో చాలా భాగం మద్యం రూపంలో తిరిగి ప్రభుత్వ ఖజానాలోకే జమైపోయాయి. విద్య, వైద్య రంగాలను ప్రజలకు చేరువ చేస్తే కొంతలో కొంతైనా ప్రయోజనం కలుగుతుంది. చాలా మందికి తెల్ల రేషన్ కార్డులను రద్దు చేయడం వల్ల దానితో వచ్చే వైద్య సదుపాయాన్ని వారు కోల్పోయారు. బియ్యం ఉచితంగా ఇచ్చినంత మాత్రాన ఒట్టి బియ్యాన్ని తిని బతకలేరు కదా ! మిగతా సరుకుల ధరలు అమాంతంగా పెరిగిపోతుంటే దానిపైన ప్రభుత్వానికి అదుపు లేకుండా పోయింది.

### ఉద్యోగులపై వ్యతిరేక ప్రభావం

పరిపాలనలో ఉద్యోగులు కీలకపాత్ర పోషిస్తారు. అలాంటి ఉద్యోగుల పట్ల అధికారంలో ఉన్న ప్రభుత్వాలు వ్యవహరించే తీరు మొత్తం ఓటర్లను ప్రభావితం చేస్తోంది. ఉద్యోగులు ఎక్కువ జీతాలు తీసుకుంటున్నారని, అది ఖజానాపై పెనుభారమవుతోందని అధికార పార్టీ నాయకులు ప్రచారం మొదలు పెట్టి, ఉద్యోగుల పట్ల ప్రజల్లో ఒక వ్యతిరేక భావాన్ని కల్పించడానికి ప్రయత్నించారు. రాష్ట్ర విభజన తరువాత 2014 నుంచి 2019 వరకు సాగిన తెలుగుదేశం పాలనలో ఉద్యోగుల పట్ల ప్రభుత్వం వ్యవహరించిన తీరుకు నిరసనగా శాసనసభ ఎన్నికల ఫలితాలను వారు ప్రభావితం చేశారు. ఇప్పుడు జరిగిన ఎన్నికల్లో కూడా వారు అదేవిధంగా ఫలితాలను ప్రభావితం చేశారు. ఉద్యోగులకు ఇవ్వవలసిన డీఏ ఆరేళ్ళుగా ఇవ్వలేదు. జీతాలు ఏ నెలకానెల ఇవ్వలేని పరిస్థితితో పరిపాలన దిగజారింది. ప్రభుత్వ ఉద్యోగాల్లో నియామకాలను ఆపేసి, పూర్తిగా కాంట్రాక్ట్ ఉద్యోగులతో నెట్టుకొస్తున్నారు. పాఠశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల నియామకాలు జరగలేదు. పాఠశాలల్లో ట్యాబ్ లిచ్చి ఉపాధ్యాయులకు ప్రత్యామ్నాయంగా చూపించడానికి ప్రయత్నించారు. ఎంత ఆధునికమైన ఎలక్ట్రానిక్ పరికరాలైనా ఉపాధ్యాయులకు ప్రత్యామ్నాయం కాజాలవు. విశ్వవిద్యాలయాలను దినకూలీలు, గంటల కూలీల వంటి అకడమిక్ కన్సల్టెంట్లతో, అవర్లీ బేస్డ్ అధ్యాపకులతో నడిపిస్తున్నారు. ఉపాధ్యాయుల నియామకాలు లేకుండా పాఠశాలను కట్టించడం, భవనాలకు వెల్లవేయడం వల్ల విద్యారంగంలో చెప్పుకోదగ్గ ఫలితాను సాధించలేకపోయారు. పాఠశాలల భవనాల నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతను హెడ్ మాస్టర్లపైన పెట్టి వాళ్ళను పరుగులు పెట్టించారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జిల్లాకొస్తున్నారంటే ఉపాధ్యాయులు, అధ్యాపకులు భయపడిపోయారు. ఆర్అండ్ బీ శాఖ చేయాల్సిన పనులను ఉపాధ్యాయులకు అప్పగించడం వల్ల చదవులు చట్టుబండలయ్యాయి. ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఎంత భయపడితే పరిపాలన అంత గొప్పగా ఉంటుందనే భ్రమల్లో అధికారులు కొనసాగడం, ముఖ్యమంత్రి వారినే

విశ్వసించడం అధికారపక్షం కొంపముంచింది.

## ఇంగ్లీష్ మాట్లాడితే చదువు వచ్చినట్టా?

అన్నిటికంటే ముఖ్యమైంది ప్రభుత్వ పాఠశాలల్లో ఎల్ కేజీ నుంచి ఇంగ్లీషు మీడియంను ప్రవేశపెట్టడం. ప్రాథమిక విద్య వరకు మాతృభాషలోనే విద్యాబోధన జరపాలని రాజ్యాంగం లోని 350 ఏ అధికరణం చెపుతోంది. హైస్కూలు వరకు మాతృ భాషలోనే విద్యాబోధన జరపాలని అనేక విద్యాకమిషన్లు సూచించాయి. నూతన విద్యావిధానం– 2020 కూడా ప్రాథమిక విద్య వరకైనా మాతృభాషలోనే విద్యాబోధన జరపాలని సూచించింది. ఎంతో అనుభవంతో చెప్పిన కమిషన్లను, విద్యారంగ నిపుణుల మాటలను, చివరికి రాజ్యాంగాన్ని లెక్క చేయకుండా వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం ఇంగ్లీషు మీడియంను ప్రాథమిక స్థాయి నుంచి ప్రవేశపెట్టింది. ఇది త్రిభాషా సూత్రానికి వ్యతిరేకమైనది కూడా. ఇంగ్లీషులో మాట్లాడితేనే బాగా చదువు వచ్చినట్టన్న భావనను ప్రచారం చేశారు. గ్రామాల్లో కూలి నాలి చేసుకునే కుటుంబాల నుంచి వచ్చిన పిల్లలు ఇంగ్లీషులో వెనుకబడితే వారు ఆత్మన్యూనతతో బడిమానేసే పరిస్థితులు ఏర్పడతాయి. బడిమానేస్తే ఏమవుతుంది? అడపిల్లలకు మళ్ళీ బాల్య వివాహాలు మొదలవుతాయి. మొగ పిల్లలు కూలీలుగా తయారవుతారు. ఈ ప్రభుత్వ విధానాలన్నీ దీర్ఘకాలంలో ఒక సంక్షోభానికి దారితీస్తాయి.

## జుగుప్సాకర మైన భాష

అన్నిటికంటే ముఖ్యం రాజకీయ నాయకులు ఉపయోగించే భాష. ఎమ్మెల్యేలే కాదు, మంత్రులు సైతం హద్దులు దాటి మాట్లాడడం, జుగుప్సాకరమైన తిట్లు ప్రయోగించడాన్ని ప్రజలు హర్షించలేకపోయారు. నెల నెలా లక్షల రూపాయలు జీతాలు, ఇతర సదుపాయలను పొందే చాలా మందిని సలహాదారులను నియమించుకోవడంతో ప్రభుత్వ ఖజానాపై భారం పడడమే కాకుండా, ప్రభుత్వం అపహాస్యం పాలయ్యింది.


## అధికార పార్టీని ఓడించడానికి కారణాలు


'అరయంగా కర్ణుడీల్గె ఆర్గురి చేతన్' అన్నట్లు ఈ ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఓటమికి ఈ కారణాలన్నీ దోహదం చేశాయి. ఇలాంటివే మరి కొన్ని కారణాలతో 2029లో ఫలితాలు పునరావృతం కావన్న నమ్మకం ఏమీ లేదు. ఇలాంటి పాలకులతో ప్రజలు విసుగెత్తిపోయారు. వారికి ప్రత్యామ్నాయం కనిపించడం లేదు. తమ జీవితాల్లో మౌలిక మార్పులు తీసుకొచ్చి, ఆత్మాభిమానంతో జీవించే పరిస్థితులను వారు కోరుకుంటున్నారు. కను చూపు మేరలో అలాంటి పరిపాలన కనిపించకపోవడం వల్ల అధికారంలో ఉన్న వారిని ఓడించడమే ఏకైక మార్గంగా పెట్టుకున్నారని 2019, 2024లో జరిగిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల ఫలితాలను బట్టి అర్థమవుతోంది. ❑

### 2024 ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలు



| ← 2019 | 2024 మే 13 | 2029 → |
|---|---|---|
| నమోదైన వోటర్లు | 41,333,702 | |
| వోటింగు | 33,838,349 (81.86%) ▲ 1.47%[1] | |

| |  |  |
|---|---|---|
| Party | తెలుగుదేశం పార్టీ | జనసేన పార్టీ |
| Alliance | ఎన్.డి.ఎ | ఎన్.డి.ఎ |
| Popular vote | 1,53,84,576 | 28,79,555 |
| Percentage | 45.60% | 8.53% |
| |  |  |
| Party | వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ | భారతీయ జనతా పార్టీ |
| Alliance | – | ఎన్.డి.ఎ |
| Popular vote | 1,32,84,134 | 9,53,977 |
| Percentage | 39.37% | 2.83% |




# ప్రశ్నించడం నేర్పిన తొలి మేధావులు



- డాక్టర్ దేవరాజు మహారాజు

దేవుడు చెడును ఆపాలని కోరుకుంటున్నా ఆపలేకపోతున్నాడా ? అలా అయితే, అతను సృష్టి లయలను తన అధీనంలో ఉంచుకున్నవాడు కాదు. అతను సమర్థుడే, కానీ ఆపాలని కోరు కోవడం లేదా? అయితే అతను పగ, ద్వేషమూ గలవాడన్న మాట ! అతను చెడును ఆపాలని కోరుకునేవాడు, పైగా సమర్థు డూ అయితే మరి చెడు ఎందుకు రాజ్యమేలుతోందీ? - సమాధానం కావాలి ! పోనీ, అతను చెడును ఆపాలని కోరుకో వడమూ లేదు - పైగా సామర్థ్యమూ లేదా? ఇక ఎందుకండీ ఆయనకు ఆ దేవుడనే బిరుదూ?' అని ప్రశ్నించాడు. ఎపిక్యురస్ (క్రీస్తు పూర్వం 341-270) అనే పురాతన గ్రీకు తత్త్వవేత్త.



'ఎపిక్యురిజమ్'కు ఆయనే సిద్ధాంతకర్త. ఆయన రచనలు మూడు వందల రాత ప్రతులున్నట్లు తెలిసింది. ఆయనపై డెమోక్రైటస్ అరిస్టిప్పన్, పైరో లాంటి వారి ప్రభావం ఉంది. ఎపిక్యురస్ బోధనలు తొలి దశలో సైన్సుకు ఆధారమయ్యాయి. ఎందుకంటే ఆయన రుజువుల్ని యథార్థాలనే నమ్మాలన్నాడు. క్రీ.పూ. 800-200 మధ్య కాలాన్ని ఏగియల్ యుగంగా పరిగ ణించారు. ఆ యుగంలో వైజ్ఞానిక ధోరణితో ఆలోచించి శాస్త్ర యుగకర్తగా నిలిచినవాడు ఎపిక్యురస్ ! గ్రీస్ లాగానే ఇలాంటి ఆలోచనా ధోరణి గల వారు ఇండియా, చైనా, ఇరాన్ లాంటి దేశాల్లో ఉన్నారని కార్ల్ జాస్పర్స్ (1883-1969) అనే జర్మనీ తత్త్వవేత్త పరిశీలనలో తేలింది. ఆయన పరిశీలనల్లో వాస్తవం ఉందనిపిస్తుంది. ఎందుకంటే సాధారణ శకానికి పూర్వమే మన భారత్‌లో చార్వాకులు, హేతువాదులు విస్తరించి ఉన్నారు. సమా జానికి ప్రశ్నించడం నేర్పారు.

ఎపిక్యురస్ ఆనాటి మేధావులందరితో విభేదించినా, డెమోక్రైటస్ (క్రీ.పూ. 460-370) వెలుగులోకి తెచ్చిన అటమిక్ థియరీని బలపరిచాడు. ఈ విశ్వం అతి సూక్ష్మమైన అణువులతో రూపొందిందనీ, అవి ఒక దానితో ఒకటి ఢీ-కొట్టుకుంటూ, విడిపోతూ, మళ్ళీ దగ్గరవుతూ ఉంటాయనీ, ఇవి నాశనం కావనీ, వీటి వల్లనే 'పదార్థం' ఏర్పడుతుందనీ డెమోక్రైటస్ భావించాడు. ఈ 'ఆటమిక్ థియరీ'ని ఎపిక్యురస్ గట్టిగా నమ్మా డు. అయితే డెమోక్రైటస్ ఈ సిద్ధాంతం తనదని చెప్పు కోలేదు. తనకు గురుతుల్యుడైన లుసిప్పస్(క్రీ.పూ. 5వ శతాబ్దం) ప్రతిపాదించాడనీ, తను కేవలం ఆ ఆటమిక్ థియరీని వెలుగు లోకి తెచ్చానన్నాడు. లుసిప్పస్ తత్త్వవేత్త. మెటాఫిజిస్ట్ ఆటమిక్ థియరీ ఎవరిదైనా కావచ్చు. కానీ అది వాస్తవం! ఆనాడు డెమోక్రైటస్ ప్రభావం ఎపిక్యురస్‌పైనే కాదు, ఆధునిక కాలపు కార్ల్ మార్క్స్‌పైనా ఉంది. ఎపిక్యురస్‌కు కొంచెం అటు ఇటుగా దృష్టి సారిస్తే, మనకు మిలోస్కు చెందిన డయగోరస్, సైరిన్‌కు చెందిన థియడోరస్‌లు కనిపిస్తారు. (క్రీ.పూ. 5వ శతాబ్దం) వీరిలో డయగోరస్ గ్రీకు కవి, హేతువాది. థియడోరస్ నాటి గ్రీకు గణిత శాస్త్రవేత్త. ఆయన పేరుతోనే 'స్పైరల్ ఆఫ్ థియ డోరస్' అనే గణిత సూత్రం ఉంది. పశ్చిమాన పరిస్థితి అలా ఉంటే, మన తూర్పు దేశాల్లో బౌద్ధం, జైనం, టోయిజం వంటివి వ్యాపించి విగ్రహారాధనను నిరసించాయి. డయగోరస్ తర్వాత-థియడోరస్, యుథిమిరస్ వెలుగు లోకి వచ్చారు. గ్రీస్ నిరీశ్వర వాదం ఆ రోజు ల్లో పెద్ద నేరం! తత్త్వవేత్త సోక్రటీస్ (క్రీ.పూ. 399)కు శిక్ష పడింది కూడా ఆ విషయం గురించే! నాటి సమాజం గుడ్డిగా నమ్ముతున్న దేవుళ్ళను సోక్ర టీస్ తిరస్కరించాడు. అతని ప్రభావంలో పడి యువత చెడిపో తోందని పాలకులు అతనికి మరణశిక్ష విధించారు. ఆ శిక్షను నింపాదిగా, నిబ్బరంగా స్వీకరించాడు. ఫ్రెంచ్ విప్లవ నేపథ్యంలో యూరోప్‌లో హేతువాదం బాగా పుంజుకుంది. ఫ్రెంచ్ విప్లవ ప్రభావం యూరోప్ సమాజంపై బాగా పడిన తర్వాత, విశ్వాసానికి-విశ్వసనీయతకు ఘర్షణ జరిగింది. క్రైస్తవ రహిత సమాజం రూపుదిద్దుకోనారంభించింది.


అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో 19వ శతాబ్దంలో వచ్చిన సామాజిక ఉద్యమాల వల్ల అక్కడి సమాజంలో 'స్వేచ్ఛాలోచన' బాగా స్థిరపడింది. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ అధ్యయనం ప్రకారం 1917 రష్యా విప్లవ ప్రభావంతో సమాజంలో హేతువాదం బాగా పెరిగింది. అందువల్ల మార్క్సిస్టు, లెనినిస్టుల ప్రభుత్వం ఏర్పడింది. సమాజంలో హేతుబద్ధత పెంచాలంటే, లక్షల సంఖ్య లో కార్యకర్తలు నడుం బిగించాలి. వేల సంఖ్యలో రచయితలు కలాలు పట్టాలి. అప్పుడు గానీ, వైజ్ఞానిక స్పృహ గల ప్రభుత్వాలు ఏర్పడవు. అమాయకులంతా మాయమాటలు చెప్పే మోసగాళ్ళనే నమ్ముతారు. దీనికి పరిష్కారమెక్కడుంది? వాస్తవాలు తెలుసుకో వడంలో ఉంది. నిజాల్ని జీర్ణించుకోవడంలో ఉంది. ❑

# అమృతకాలం కాదిది, ఆపత్కాలం!

**పుస్తక పరిచయం**

- డాక్టర్ రవీంద్రనాథ్ సూరి

**ఆధునిక శిశుపాలుడు లక్ష తప్పులు చేశాడు ! రాంపల్లి శశికుమార్‌కు పరిచయం అక్కరలేదు. వృత్తి రీత్యా ఛార్టర్డ్ అకౌంటెంట్ అయిన శశి, సులభంగా అర్థం కాని ఆర్థిక విషయాలను అరటి పండు ఒలిచినట్టు అవగతం చేయించాడు. ఇంతకు ముందు కూడా బడ్జెట్ ప్రతిపాదనల వెనుక ఉండే అర్థాన్ని, పరమార్థాన్ని బహిర్గతపర్చి, పాలకవర్గాల పథకాలను కనీస అక్షరాస్యులకు సైతం అర్థమయ్యేలా చెప్పాడు. మోది కంటే ముందుగానే పెద్ద నోట్లను చలామణి నుంచి తొలగించాల్సిన అవసరం గురించి, అందుకుముందు చర్యలుగా చేపట్టాల్సిన చర్యలను క్షుణ్ణంగా సూచించాడు. అవేమీ లేకుండా గెరిల్లా చర్యలాగా మోది చేపట్టిన ఆకస్మిక చర్య, వందలాది మంది మరణానికి, దేశ ఆర్థిక వ్యవస్థ అంతా అస్తవ్యస్తం అయ్యేందుకు, చివరకు నల్ల కుబేరులు తమ నల్లధనాన్ని తెలుపుగా మార్చుకోవడానికి దోహదం చేసింది.**




రాంపల్లి శశికుమార్ తన పుస్తకానికి పెట్టిన శీర్షికే మొత్తం పుస్తకంలో విషయాన్ని వాస్తవ వర్ణాలలో వివరించి చెప్పింది. వస్తువును ఇంతకంటే బలంగా శీర్షికలోనే ప్రతిబింబించడం సాధ్యం కాదేమో. మోది ఆయన మతోన్మాద మూకలు అంటున్నట్టుగా ఇది అమృత కాలం కాదు, ఆపత్కాలం విపత్కాలం. అది ఏదో ఒక్క రంగంలోనో కాదు. సర్వవ్యాపితంగా భారతదేశం స్థాయి "ఆకాశంబున నుండి శంభుని శిరంబందుండి... హిమాద్రి నుండి" అన్నట్టుగా పడిపోతూనే వున్నది. మోదీ చెప్పిన ప్రతి మాట విరుద్ధార్థంలో నిజమైంది, గతకాలంలో వాజపేయి గారి మెరుస్తున్న భారత దేశం (India Shining) లాగా. ఒక్కమాట మాత్రం మోది వాస్తవం చెప్పాడు. తనది వ్యాపారిమిత్ర ప్రభుత్వమని. తగినట్టుగానే శత కోటీశ్వరుల సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. ఈ విషయంలోనే భారతదేశం ఎనలేని అభివృద్ధిని సాధించింది. జిడిపి(స్థూల జాతీయ ఉత్పత్తి) విషయంలో మన దేశం ప్రపంచంలోనే మూడవ స్థానంలో ఉన్నదని మోదీ చెబుతున్నాడు. అదెంత మోసపూరితమైన మాటో శశికుమార్ వివరించాడు. ఈ విషయాన్ని వరల్డ్ ఇనిక్వాలిటీ లాబ్స్ వారు సోదాహరణంగా వంద సంవత్సరాలలో ఇటీవలి ముప్పై సంవత్సరాలలో, మరీ ప్రత్యేకించి ఈ పది సంవత్సరాలలో సంపద కేంద్రీకరణ పెరిగిపోయిందని, కొద్ది మంది చేతులలో దేశ సంపద, ఆదాయాలు కేంద్రీకృతమయ్యాయని గణాంకాలతో వివరించింది. గణాంక వివరాలను ఇస్తూ శశికుమార్ సంపద కేంద్రీకరణే కాకుండా ఆదాయాల కేంద్రీకరణ ఎలా ఉందో చూపించాడు. ఒక సర్వే ప్రకారం సగటు భారత గ్రామీణ కార్మికుడు 941 సంవత్సరాలలో సంపాదించే మొత్తాన్ని ఒక పెద్ద కంపెనీలో ఉన్నత పదవిలో ఉన్న అధికారి ఒక సంవత్సరంలోనే సంపాదించగలడని చెప్పాడు. దేశంలోని దిగువ 50% జనాభా ఆదాయం దేశ జాతీయాదాయంలో 13% మాత్రమే. ఆదాయ పిరమిడ్‌లో ఎగువన ఉన్న 1% సంపద దేశ సంపదలో 41%, ఆ దిగువన ఉన్న 4% వారి సంపద 21%, ఆ దిగువన ఉన్న 5% వారి సంపద 10%, తరువాతి 20% సంపద 18%, ఆ దిగువన ఉన్న 20% వారి సంపద 7%, అట్టడుగు 50% సంపద కేవలం 3% మాత్రమే. అట్టడుగు సగం జనాభా సంపద 3% ఉంటే దేశం ఏమి అభివృద్ధి సాధించినట్టు?

భారతదేశంలో పేదరికం తగ్గిపోయిందని ప్రభుత్వ చాలా ఘనంగా చెప్పుకుంటున్నది. ఈ మాటల్లోని బోలుతనాన్ని కరోనా కాలంలో ప్రతిచోటా మరి ముఖ్యంగా రహదారుల వెంట పిల్ల పాపలతో, రవాణా సౌకర్యాలు లేక వందలేమిటి వేల కిలో

మీటర్ల దూరాలను నడుస్తూ వెళ్ళిన వలస కార్మికులు కోట్ల గొంతుకలతో చెవిటి వానికి సైతం వినిపించేలా చెప్పారు. ఇప్పటికీ అస్సాం నించి, బెంగాల్ నించి, ఉత్తరప్రదేశ్ నించి తమిళనాడుకు, కేరళకు, తెలంగాణకు పనుల కోసం తరలి వస్తున్న వలస కార్మికులు, తెలంగాణ నుండి మధ్య ప్రాచ్య దేశలకు తరలి వెళ్తున్న వలస కార్మికులు చెప్తూనే వున్నారు. ఈ వాస్తవాలు చూసేందుకు, వినేందుకు కేంద్ర ప్రభుత్వానికి కళ్ళు, చెవులు లేవా? లేక పోవడమేమిటి, భేషుగా ఉన్నాయి. కళ్ళు, చెవులుగా ఉండాల్సిన ఎన్ఐఏ, ఐబిఆర్ఏడబ్ల్యూ, ఈడి, సిబిఐ వేరే పనిలో తలమునకలై ఉన్నాయి. ప్రతిపక్షాల భరతం పట్టేందుకు కార్యనిరతమై ఉన్నాయి. ప్రభుత్వానికి తమ పది సంవత్సరాల నిర్వాకం చాలా బాగా తెలుసు. తమ మాయ మాటలతో భారత ప్రజానీకాన్ని మోసపుచ్చలని విశ్వ ప్రయత్నం చేస్తున్నది. ఆ ప్రయత్నాలను శశికుమార్ తన నూట ముప్పయారు పేజీల పుస్తకంలో తుత్తునియలు చేశాడు. మోది అవినీతిని అసలే సహించనని ఘీంకరించాడు.

కాంగ్రెసు అంటేనే అవినీతి అన్నాడు. ప్రభుత్వంలోకి వచ్చినా తరువాత కాంగ్రెసు అవినీతిని రుజువు చేయలేకపోయాడు. పరిశ్రామాధిపతుల చేయి మెలిపెట్టి, బెదిరించి కొనిపించిన ఎలక్టోరల్ బాండ్సును మరి ఏమని పిలవాలి. ఎలక్టోరల్ బాండ్సు కొన్న వ్యాపారస్తులకు వేల కోట్ల రుపాయల కాంట్రాక్టులు ఇవ్వడాన్ని ఎలా శిక్షించాలో ప్రజలకు తెలుసు. తమ తీర్పును రిజర్వు చేసి ఉంచారు. జూన్ రెండవ తేదీన తీర్పు వెలువరిస్తారు. బిజెపి ప్రభుత్వం వైఫ్యల్యాలు ఏ ఒక్క రంగానికో పరిమితం కాలేదు. ఆన్ని రంగాలకు ఆవరించి, వారు ఇన్ని రోజులు చేసింది దుష్పరిపాలన అని అట్టడుగు మనిషికి అనిపించేలా చేసింది.

కాశ్మీర్‌లో 370 ఆర్టికల్‌ను రద్దు చేయడం మొదలు పెట్టి అంతా దుష్పరిపాలనే. హిందూత్వం తప్పితే వారికి ఏది పట్టదు. నిరంకుశత్వం వైపు ఒక్కొక్క అడుగే వేశారు. అది శ్రుతిమించి రాగాన పడి, మోది ఏకవ్యక్తి నిరంకుశత్వానికి దారి తీస్తున్నది. ఎన్నికల సభలలో మోది మైనారిటీల మీద, ముఖ్యంగా ముస్లింలపైన నిప్పులు కురిపిస్తున్నాడు. రాజ్యాంగ ప్రాతిపదిక సూత్రమైన లౌకికవాదాన్ని అవహేళన చేస్తున్నాడు. మరో వైపున సందర్భం లేకపోయినా పాకిస్థాన్ ప్రస్తావన తెచ్చి ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాడు. ఇప్పుడు ప్రజలకు కావలసింది కూడు, గుడ్డ, ఉద్యోగాలు, విద్య, వైద్యం, ప్రశాంత రాజకీయ వాతావరణం. అవి కాకుండా రామాలయం నిర్మించామని చెప్పితే, కొందరు మూర్ఖులు తప్పితే ప్రజలు ఒప్పుకోరు.

ఈ పదేళ్ల బీజేపీ పాలనలో ప్రజలను కొట్టి, అంబానిలకు, ఆదానిలకు దోచి పెట్టారన్నది అందరికీ తెలిసిపోయింది. వారి ఆస్తులు 40–50 రెట్లు పెరిగాయి. రోజుకు 350 కూడా సంపాదించలేని వారి సంఖ్య 20–30 కోట్లు కాగా అదాని అంబానిల రోజువారీ ఆదాయం 30 కోట్ల రూపాయలు. అయినా అంధభక్తులు ఒప్పుకోరు. ప్రజలు మరింత పేదలుగా మారిపోయారన్నది ఒప్పుకోరు. అలాగయితే 80 కోట్ల మందికి ఉచిత రేషన్ ఇవ్వాల్సిన అవసరం ఎందుకు వచ్చింది. ఎవరి ఊరిలో వారికి ఉపాధి ఎందుకు దొరకడం లేదు.

పదేళ్ల క్రితం ఉండే ధరలతో పోలిస్తే ఇప్పటి ధరలు కనీసం డెబ్బై శాతం పెరిగిపోయాయి. దానికి పెట్రోలు ధరలే సాక్ష్యం చెప్పుతున్నాయి. 2014లో 66 రూపాయలుగా ఉన్న పెట్రోలు ఇవ్వాళ 110 రూపాయలు. ఇంధనం ధర పెరిగితే అన్నిటి ధరలు పెరుగుతాయన్నది కనీస ఇంగితం. రైతులు కనీస మద్దతు ధరను శాసనబద్ధం చేయమని ఏడాదిపాటు తీవ్రమైన పోరాటం చేసిన విషయం భారత దేశ ప్రజలు మరిచిపోలేదు. నిరుద్యోగం నలభై ఏళ్ల రికార్డు స్థాయిని తాకింది. గణాంకాలను పక్కన బెట్టినా, దేశంలోనే అంతర్గత వలసలు ఏ స్థాయిలో ఉన్నాయో కోవిడ్ ప్రత్యక్షంగా చూపించింది. భారతదేశపు సమాఖ్య స్వరూపాన్ని సైతం మార్చి వేయాలన్న దృష్టితోనే చట్టాలు తెస్తున్నారు. ఒకే దేశం ఒకే పన్ను విధానం అనే పాలిసీ దానిలో భాగమే. కాంగ్రెసు కూడా సమాఖ్య స్వరూపాన్ని దెబ్బ తీసే విధంగానే వ్యవహరించింది. సర్కారియా కమిషన్ సమాఖ్య స్వరూపాన్ని సంరక్షించే సిఫారసులను సూచించింది. కానీ ఎవరూ వాటిని అమలు చేసేందుకు సిద్ధంగా లేరు.

మేక్ ఇన్ ఇండియా కుప్పకూలిపోయింది. చైనాలో పెట్టుబడులు మన దేశానికి తరలి వస్తాయని గోతికాడి నక్కలాగా ఎంత ఎదురు చూసినా పెట్టుబడులు తరలి రాలేదు. విదేశీ పరిజ్ఞానంతో, భారతదేశంలో చవకగా లభించే శ్రమతో ఉత్పత్తులు చేసి దాన్నే ఆత్మనిర్భరత అని చెప్పి గొప్పలు చెప్పుకుంటున్నారు. నిజంగా మనదని చెప్పుకోగలిగిన ఉత్పత్తి ఒకటి కూడా లేదంటే మన ఆర్థిక వ్యవస్థ ఎంత వెనకబడి ఉందో అర్థమవుతుంది. ఇప్పటికీ వ్యవసాయ ఉత్పత్తులు, సాఫ్టువేర్ ఉత్పత్తులు, విదేశాల్లో పని చేసే కార్మికులు చేసే చెల్లింపులే మన ప్రధాన విదేశీ మారక ద్రవ్య ఆర్జన మార్గాలు. ఉత్తర భారతదేశంలో గ్రామీణ యువకులకు ప్రధాన ఉపాధి వనరుగా ఉండే సైనిక దళాల రిక్రూట్‌మెంట్‌ను సైతం అగ్నివీర్ పథకం కింద తీసివేసింది మోది ప్రభుత్వం. 2014లో హామీ ఇచ్చిన ఏటా 20 కోట్ల ఉద్యోగాలు ఎక్కడ, ఎవరికి ఇచ్చారో తెలియదు. దేశం మొత్తం మీద అరవై లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా భర్తీకి నోచుకోలేదు. అన్ని రంగాలలో ఎదురైన వైఫ్యల్యాలను రామ మందిర నిర్మాణంతో, హిందూ రాష్ట్ర నిర్మాణంతో కప్పి పుచ్చుకోవాలనుకుంటున్న మోదికి నూట నలభై కోట్ల భారత ప్రజలు గట్టి గుణపథం నేర్పుతారు. లక్షలాది తప్పులను చేస్తూ బుకాయిస్తున్న ఆధునిక శిశుపాలుని నిరంకుశత్వాన్ని ఖండిస్తారు. ❑

# 'మర్యాదలను' బద్దలు కొట్టిన 'హస్బెండ్ స్టిచ్'

-రాఘవ

"ఏమిటీ అత్యాచారాల పర్వం అందునా పసి పిల్లలపై! పాలవాసన కూడా మరువని మూడేళ్ళ పసిపిల్లల్ని కూడా వదలని పైశాచిక కాముకత్వం! రెండు కాళ్ళ మధ్య రక్త స్రావంతో, గాయంతో, నొప్పితో విలవిల్లాడే పసికూనల బాధ వాళ్ళకు పట్టదా ! రక్త స్రావంతో చనిపోయిన పిల్లలు.. చంపబడ్డ వాళ్ళు ఎంత మందో ! ఉచ్చపోయడానికి పనికొచ్చే భాగంగా మాత్రమే తెలిసిన తన మర్మాంగంపై జరిగే హింస వాళ్ళనెంత భయభ్రాంతులను చేస్తుందో కదా ! ఆ హేయమైన ఘటన వారిని జీవితాంతం వెంటాడుతూ.. జీవితాన్ని నాశనం చేస్తుంటే.." 'ప్రశ్న' కథలో ఇలా ప్రశ్నల వర్షంతో సాగే స్వరూప అంతర్మథనం ఇది. పేపర్లో ఇలాంటి వార్తలను చూసి నిట్టూర్చి అక్కడితో వదిలేస్తాం. అలా వదిలేసే సంఘటనలు కావివి. మానవ సమాజానికి మాయని మచ్చను, తీరని క్షోభను కలిగించే దారుణాలివి. "మార్ ఔర్ మార్.. మార్ దేవ్..హైనాకో.." నిద్రపోతున్న పద్నాలుగేళ్ళ పసి బిడ్డ అయిన కూతురి కాళ్ళు పట్టుకుని వంటింట్లోకి లాక్కుపోతున్న భర్త ఖాద్రీపై సివంగిలా విరుచుకుపడిన ఆ బాలిక తల్లి ఖుర్షీదా బేగం మాటలు వింటుంటే మనకి కూడా కొట్టాలన్న ఆవేశం కట్టలు తెంచుకుంటుంది. పదిహేడేళ్ళ కన్న కూతురు అస్రాపై ఏళ్ళ తరబడి అత్యాచారం చేస్తున్న ఖాద్రీని పోలీసులకు పట్టించడం చట్టపరిధిలో ఒక చర్య. తండ్రి బాటలో సోదరుడు కూడా చెల్లెలిపై చేసిన అత్యాచారం గురించి వింటుంటేనే ఒళ్ళు మండుతుంది. బెయిల్‌పై వచ్చిన ఖాద్రీ మళ్ళీ మరొక కూతురిపై కూడా అత్యాచారం చేయబోతుంటే ఏం చేయగలుగుతుంది ఆ తల్లి ? "మార్ ఔర్ మార్.. మార్ దేవ్.. హైనాకో.." అంటూ కూతుళ్ళతో కలిసి రోకలి బండతో భర్తను కొట్టి చంపుతుంది. 'రాయి' (స్టోన్) కథ అలా ముగుస్తుంది. కానీ, ఇలాంటి అనివార్యమైన అప్రయత్న చర్యలు 'మర్యాద రామన్న'ల దృష్టిలో ప్రతీకారాలు, అటవిక న్యాయాలు!

గీతాంజలి రాసిన 'హస్బెండ్ స్టిచ్' కథలు, వాటి ఇంగ్లీషు అనువాదం 'ద రాక్ దట్ వాజ్ నాట్' చదువుతుంటే కుటుంబ గౌరవం, పరువు ప్రతిష్టలు, మర్యాద మత్తితాల ముసుగులో ఎన్ని విషాదాలను ఎంత కాలంగా ఈ సమాజం దాచి, భరిస్తోందో కదా ! అనిపిస్తుంది. అర్థం లేని ఆ మర్యాదలను, పరువు ప్రతిష్టలను గీతాంజలి తన పెన్ గన్‌తో ఒక్కసారిగా బద్దలు కొట్టారు. గీతాంజలి రచనా శైలి వాస్తవ సంఘటనలతో నదీ ప్రవాహంలా సాగుతుంది. ప్రొఫెసర్ కె.సునీతారాణి 'ద రాక్ దట్ వాస్ నాట్' పేరుతో ఈ కథలకు చేసిన ఇంగ్లీషు అనువాదం అంతే సరళంగా, అంతే వేగంగా సాగుతుంది. ఒక్కో కథ మనం చూడని, మనం ఊహించని అనేక మానని గాయాలను చూపుతుంది, వాటిని రేపుతుంది. హత్య (మర్డర్) కథ కన్నీరు పెట్టించే మరొక విషాదాంతం. "వీండ్లకు నా ప్రాణం కంటే వారసుడు ముఖ్యం" అనే జీర పోయిన గొంతుతో మంజీర మాటలు వినిపిస్తాయి. భర్త నగేష్‌కు వారసుణ్ణిచ్చి, సెప్టిక్ అబార్షన్లు, సిజేరియన్లు, బీపీలతో పచ్చి పుండైన తన దేహాన్ని వదిలేసి ఈ లోకం నుంచి నిష్క్రమిస్తుంది.

"నాన్న చాలా క్రూరుడు. రాత్రి అయ్యిందంటే అమ్మ గుండె చప్పుడు రెట్టింపయ్యేది. అమ్మ బాధతో విలవిల్లాడేది. కాళ్ళు పట్టుకుని ప్రార్థించేది. నాన్న వినేవాడు కాదు. సిగరెట్టుతో అమ్మ బుగ్గల మీద, పెదాల మీద, చన్నుల మీద, నడుం మీద వాతలు పెట్టేవాడు. అమ్మ రక్తసిక్తమైన దిక్కు లేని పావురంలా రోదించేది. ఆ రోజు అమ్మకు వాత ఎక్కడ పెట్టాడో తెలుసా? అమ్మ జన నాంగాల మీద ! అవును సిగరెట్టు వాతలు పెట్టాడు ! నాన్న రోజూ అమ్మ మీద అత్యాచారం చేస్తాడు ! అమ్మ కన్నీళ్ళకు, అత్యాచారాలకు గురవుతున్న సమస్త స్త్రీ జాతి కన్నీళ్ళకు ప్రతీకారం తీర్చుకోవాలి." ఖడ్గ చాలనం (ద స్విష్ ఆఫ్ ద సోర్డ్) కథ సారాంశమంతా తల్లి కడుపులో ఉన్న ఆడ శిశువు పడు తున్న ఆవేదన, ఆక్రోశంగా.

ఇలాంటి మగవాళ్ళపైన ప్రతీకారంగానేమో ఆ శిశువు జన నాంగాలు లేకుండా పుడుతుంది ! కడుపులో శిశువు ఇలా ఆలో చించడం కొంత కాల్పనికత అయినా, కొందరు పురుషులు తమ భార్యలను పెట్టే హింసలు మాత్రం పచ్చి నిజాలు. "నీకు అర్థం కాదు. నాది వదులైపోయిందని అంటున్నాడు. కుట్లు వేయించు కుని బిగుతుగా చేయించుకుందామని" అంటుంది సుశీల. "ఏంటి ఇలాంటి ఆపరేషన్లు కూడా ఉన్నాయా" అని నిర్ఘాంత పోతుంది సృజన. ఆపరేషన్ చేయించుకున్నా ఫలితం ఉండదు. ఆస్పత్రిలో సుశీలకు పక్షవాతం వచ్చి కుడి చేయి పడిపోతుంది. ఇది హస్బెండ్ స్టిచ్(ద హస్బెండ్ స్టిచ్) కథ సారాంశం.

ఆర్టిస్టు అయిన నగేష్ తాగుడుకు బానిసై, ఇంట్లోనే పరాయి స్త్రీలతో గడుపుతాడు. కూతురికి బాయ్ ఫ్రెండ్స్, గర్భస్రావం జరుగుతుంది. కొడుకు జేబులో కండోమ్స్ దొరుకుతాయి. ఈ స్థితిలో కుటుంబంలో **(మిగతా 42వ పేజీలో..)**

# ఓటరు చైతన్యపు దిక్సూచి



- బొల్లినేని నాగార్జున సాగర్

ప్రజాస్వామ్య మనుగడ ప్రశ్నార్థకమై రాజ్యాంగ స్ఫూర్తిని ఖూనీ చేస్తున్న ఈ విపత్కర పరిస్థితులలో నిర్వహించబడుతున్న ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అ.ర.సం. గుంటూరు జిల్లా శాఖ నుంచి వెలువడిన అత్యంత ఆవశ్యకమైనది. సందర్భోచితమైనదీ "ఎన్నికల భారతం" కవితా సంకలనం అ.ర.సం నిర్వహించిన కవితల పోటీలలో (ఈ పోటీ విజేతలకు నగదు పురస్కారాన్ని అందజేయడం కోసం అ.ర.సం. రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఏటుకూరి ప్రసాద్ గారు ఆర్థిక సహాయమందించారు.) ఎంపిక చేసిన 20 కవితలతోపాటు మరో ముప్పై ఒక్క ప్రముఖుల కవితలను కలిపి ప్రచురించడం జరిగింది. నల్లూరి శివప్రసాద్ కె.శరశ్చంద్రజ్యోతిశ్రీ సంపాదకత్వంలో వెలువడిన ఈ సంకలనం ప్రపంచ కార్మిక పర్వదినమైన మేడే రోజున దాదాపు రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో ఆవిష్కరింపబడింది. అ.ర.సం. జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ తన ముందు మాటలో "ఈ విపత్కర పరిస్థితులలో రాజ్యాంగ రక్షణ, ప్రజా స్వామ్య పరిరక్షణ తక్షణ అవసరం ఈ సంకలనంలోని కొన్ని కవితలు ప్రత్యామ్నాయంగా వామపక్ష భావజాలాన్ని ప్రతిపాది స్తున్నాయి. ఈ పుస్తకం చదివిన తర్వాత మీలో వివేచన మేల్కొం టుందని. విచక్షణ కలుగుతుందని నా విశ్వాసం" అన్నారు. ఎన్నికల తీరుతెన్నులను విమర్శించడమంటే ఎన్నికల ను తిరస్కరించడం కానీ, బహిష్కరించడం కానీ కాదని ప్రస్తుత ఎన్నికల తీరు తెన్నులను మార్చడాని ఉద్యమించడమని సంపాద కులు తమ సంపాదకీయంలో పేర్కొన్నారు.

"దాహంతో ఎవరూ తపించరాదని - ఊరూరా మద్యపుటేర్లు పారించిన ఔదార్యం" అతనిదంటూ కుబేరుల నుండి మాత్రమే గాక తన రాజ ప్రసాదం ముందు దీనంగా నిలబడ్డ బిచ్చగాడి నుంచి కూడా అప్పు తేగల"డంటూ, పన్ను లేయడానికి చెత్తను కూడా వదలని చెత్త పాలకుల కంపుతో మన ముక్కు పుటాలను అదరగొట్టారు "పాపినేని శివ శంకర్-"గుడిసెలు పీకి గుళ్ళు కట్టిస్తాం-దేవుణ్ణి నేలకు దించుతాం-భక్తిని ఓటుకు కుదించుతా మంటూ" మతంతో మమేకమైన మూర్ఖ రాజకీయాలను తీవ్రంగా ఎండగట్టారు గంటేడ గౌరునాయుడు. "అబద్ధం కత్తి అంచుపై నిలబడ్డ ప్రజాస్వామ్యాన్ని బ్రతికించ గలిగేది చైతన్య వంతమైన ఓటరే" అన్నారు దాట్ల దేవదానం రాజు. "కుక్కేదో, నక్కేదో, కాకేదో, కోకి లేదో తెలుసుకొని ఓటరు తన ఓటును వినియోగించాలంటారు" వేల్పుల నారాయణ. "నేతలు కరెన్సీని, ఉద్యోగులు లంచాలను, రైతులు విషాన్ని, ఉద్యమకారులు బల్లెట్లను తింటూనే ఉన్నారు. భారత్ ఆకలితో ఉందని ఎవరం టారని" దేవరాజు మహారాజు దేశపు దయనీయ స్థితిపై తన వ్యంగ్యాస్త్రాలను సంధించారు. నవ్వగాజి "స్వార్థాన్ని తుదముట్టిం చడానికి మీ ఓట్లు ముప్పన్నెల జండాలై ఎగరాలని" యువతకు ప్రభోదిస్తారు ఎస్.ఆర్.పృథ్వి. "నిగ్రహం లేని సమాజంలో విగ్రహాలకు ముసుగేసి లాభం లేదంటూ, అహంకారాన్ని జయించి-జనాన్ని గెలిపించాలంటారు" పెరుగు రామకృష్ణ. ఓటు విలువ తెలియని జనానికి కనువిప్పు కలిగిస్తూ "తనను తాను అమ్ముకున్న ఓటు-మీట నొక్కిన తక్షణం వ్యర్థమైపోతుంద న్నారు" బండ్ల మాధవరావు. అంతా నాటకమని తెలిసీ ఐదేండ్ల కోసారి తెరతీస్తున్న ఎన్నికల తీరుతెన్నులను దృశ్యమానం చేశారు ఎమ్.వి.రామిరెడ్డి. "నాగలి మాయమై పల్లె భుజాల మీద పార్టీల జెండాలు మొలుచుకొచ్చిన చోట-మత్తులో జోగుతున్న పల్లె చెంపల మీద చెళ్ళున చరిచే చైతన్యాన్ని "స్వప్నిస్తారు సిరికి స్వామి నాయుడు. ప్రస్తుతం రాజ్యాంగ స్ఫూర్తికి జరుగుతున్న విఘాతాన్ని చూసి చలించిన కోసూరి రవికుమార్ "మనుషుల కోసం మనుషులు రాసుకున్న బుక్కులోంచి కొత్త ఆశలను మొలిపించాలంటారు."

దేవుళ్ళు ప్రచారాస్త్రాలై ఊరేగుతున్న నియంతృత్వాన్ని ఎండ గడుతూ "నీ బతుకును మార్చే ఓటే నీ అస్త్రం - నాకు నీవే రాజకీయ శాస్త్రం" అంటారు శిఖా ఆకాష్. పైకి పచ్చగా ఎదిగినట్లు కనిపిస్తున్న "ప్రజాస్వామ్య వృక్షానికి మూలకణాల్లోనే కుళ్ళి పోయిన" ఆనవాళ్ళను పసిగట్టారు అనిల్ డ్యానీ. రంగుల హామీల తీపి వలలను ఛేధించడానికి మనిషి సమూహమై చర్చ కావడమే సమాజ పురోగతి" అంటారు పలమనేరు బాలాజీ. హస్తిన చుట్టూ పరుచుకున్న ఏడువందల మంది అన్నదాతల నెత్తురు మరకలను ఓటు తో కడిగేయాలంటారు కవితశ్రీ. వీడుపోతే - వాడు కాదని ఇప్పుడు ఈ దేశానికి ప్రత్యామ్నాయ రాజకీయం అవసరమంటారు బంగారు వి.బి.ఆచార్యులు. ఉచితాల కోసం - అనుచితంగా ప్రజల ఆస్తులను తాకట్టుపెట్టే దొంగలను తరిమికొట్టి స్వచ్ఛమైన నాయకులను గెలిపిస్తే నువ్వూ నేనూ గెలిచిన ట్టే నంటారు ఉప్పల అప్పలరాజు. పైకి రామ నామ స్మరణ చేస్తూ - నా రక్తం తాగుతున్న పులులను దును మాడి చట్ట సభలకు జనం గొంతు వినిపించే ప్రతినిధులను పంపాలంటారు పెరుగు రామకృష్ణ. ఖద్దరు చొక్కాల గుడ్డి కొంగ గారు - చేపలతో మీటింగు పెట్టడం, పిచ్చుక పిల్లలను-డేగ దొరలు మచ్చిక చేసుకోవడం కోసం కుల మతాలను నిస్సిగ్గుగా

వాడుకుంటున్న మేక వన్నె పులుల పని పట్టాలం'టే శ్రామికుల చెమటకు మతము - కష్ట జీవుల కన్నీటికి కులమూ ఉండకూడ దంటారు రెడ్డి రామకృష్ణ. ఓటరుకు విజ్ఞత కరవైతే కష్టపడి పెట్టి న కోడిగుడ్డు తాగుబోతు చేతిలో ఆమ్లెట్ అవుతుందంటారు మెట్టు శ్రీనివాసరెడ్డి ఇలా ఓటు ప్రజాస్వామ్యానికి జీవధాతువు" అంటూ దానిని సక్రమంగా వినియోగించి, దేశం ప్రజాస్వామిక విలువలను, రాజ్యాంగస్ఫూర్తిని కాపాడా అంటూ ఓటరుకు దిశా నిర్దేశం చేసిన కవితలే అన్ని. ఈ పుస్తకం వర్తమానానికే గాక భవిష్యత్‌లో జరిగే ప్రతి ఎన్నికల సందర్భంలోనూ పఠించి నెమరు వేయదగ్గ చైతన్యపు దిక్సూచి అని చెప్పడంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదు. ❑

# 'మర్యాదలను' బద్దలు కొట్టిన 'హస్బెండ్ స్టిచ్'


**(40వ పేజీ తరువాయి)**

ప్రేమంటే ఏమిటో తెలియకుండా బతుకుతున్న రుద్ర మధుతో ప్రేమలో పడుతుంది. ఇది భర్తకు, పిల్లలికి తెలిసి ఆమెకు నింఫో మేనియా (మనో లైంగిక వ్యాధి) అని, ఆమెకు బలవంగంగా మందులు వేయాలని చూస్తారు. "ఈ మగనాయాళ్ళు ఏం చేసి నా చెల్లుతుంది. మన ఆడోళ్ళే.. ఎప్పుడన్నా కిసుక్కున నవ్వినా లంజలైపోతాం.." అని రుద్రతో అంటుంది పనిమనిషి అలివేలు. నిజానికి నగేష్‌కే నింఫోమేనియా అని మనో వైద్యులు తేల్చి, అతనికి చికిత్స చేసి సాధారణ స్థితికి తీసుకువస్తారు. "ప్రపంచం లో ఏ పనిచేసినా పట్టుబడకుండా తప్పించుకోవచ్చు. కానీ, ప్రేమలో పడ్డ విషయం బైట పడకుండా ఏ మానవ మాత్రుడు తప్పించుకోలేడు" అన్న అందమైన గాలిబ్ కవితతో కథ ముగు స్తుంది. నింఫోమేనియా (నింఫోమేనియా) అన్న ఈ కథను చెలం రచనలను పోలిన ఒక అందమైన ప్రేమ కావ్యంలా గీతాంజలి నడిపిస్తారు. శిల కాని శిల(ద రాక్ దట్ వాజ్ నాట్) కథలో దేహ సౌష్టవమే స్త్రీ అనుకునే భర్త చేతిలో హింసను అనుభవించి ప్రతిమ రొమ్ము పెద్దదిగా కనిపించడానికి సిలికాన్ ఇంప్లాంటేషన్ చేయించుకుం టుంది. ఫలితంగా రొమ్ము క్యాన్సర్ డిటెక్ట్ కాక, సికలికాన్‌ను తీసేయించుకోవడానికి సిద్ధమవడంతో కథ ముగుస్తుంది. ముగింపు ఆశాజనంగా ఉన్నా, వాస్తవాలు అలా లేవు. హస్బెండ్ స్టిచ్ కథల సంపుటికి ఈ కథ పేరే ఇంగ్లీషు అనువాదానికి 'ద రాక్ దట్ వాజ్ నాట్' పేరైంది. చిన్నతనంలో బాబాయి చేతిలో అత్యాచారానికి గురైన కస్తూరి ఆత్మ కథే ఫ్రిజ్ డ్(ఫ్రిజ్ డ్). "శృంగారమంటే స్త్రీ పురుషుల జననాంగాల మధ్య జరిగే రాపిడి మాత్రమే కాదు. దంపతులు ఒకరిపై ఒకరికి ఉండే ప్రేమ, స్పర్శతో వ్యక్తపరుచుకునే అందమైన భాష. అనేకానేక నిస్సహాయ కన్నీళ్ళ పెనుగులాటల మధ్య నిత్యం జరిగే దేహ యుద్ధంలో గెలిచేది వాడే, ఓడేది వాడే.

అతనిలో శృంగార మరిమళాలంటే తన నోటి దుర్గంధమో, లేదా, విస్కీ సిగరెట్ వాసనల సమ్మిళితమో. మృగ వాంచే తప్ప మృదు స్పర్శలేని వాడు" ఈ కథలో బైట పడని అడుగడుగునా స్త్రీల మానసిక క్షోభ వ్యక్తమవుతుంది. అన్నిటికంటే ఆశ్చర్యపరిచే కథ 'నా భర్తే నన్ను రేప్ చేశాడు' (మై హస్బెండ్ రేప్డ్ మి).


పదహారేళ్ళ బాలిక సాత్వికను బలవంతంగా కాపురం చేయ మని భర్త కొడతాడు. వేడుకున్నా ఆపడు. "ఇంకెన్ని రోజులు సతాయిస్తవే నా కొడుకుని" అంటుంది అత్త. "మా ఆడ బిడ్డ నా చేతులు వంచి పట్టుకుంది. మా అత్త నా కాళ్ళు పట్టుకుంది. నా మొగుడు నా నోట్లో గుడ్డలు కుక్కినా పైన జంతువు తీరుగా పడ్డాడు" అని ఆస్పత్రిలో డాక్టర్‌కు చెపుతుంది సాత్విక. రక్తం ధారలు కడుతుంది. ఈ కథ చదువుతుంటే కనీసం సిగ్గు ఎగ్గు లేకుండా ఎవరైనా అసలిలా చేస్తారా అన్న అనుమానం కులుగుతుంది. దర్శిత ఒక అబ్బాయిని ప్రేమించింది. ప్రేమను కాదన్న తల్లిదం డ్రులు ఇంజనీర్‌కిచ్చి పెళ్ళి చేస్తారు. తాళి అనే లైసెన్స్‌తో తనను మెరటైల్ రేప్ చేసిన భర్త. తనకు మెనోపాజ్ మొదలైనప్పటి నుంచి తననొక పనికి మాలిన చిల్లుకుండలా చూస్తున్నాడు. నా అస్థిత్వమంటే ఒక్క దేహమేనా? పురుషులకు కూడా ఆండ్రోపాజ్ ఉంటుందని అంటారు డాక్టర్. "అతన్నిలా జంతువులా చూడ్డం ఎంత నరకమో కదా తనకు ! తనకు లేవా కొవ్వెక్కి బ్రిడ్జ్ స్టోన్ టైర్లు ఏ కంపెనీ వాడు కనుక్కున్నాడో కదా వయాగ్రా. ఫాల్ ఆఫ్ మాన్(ద ఫాల్ ఆఫ్ మాన్) కథ సారాంశం. ఇన్ని విషాద సంఘటనలను చెప్పిన గీతాంజలి ముద్దు (ద కిస్) కథలో ప్రేమతో పెట్టే ముద్దు గురించి మెరీనా త్సేతేవా అనే రష్యన్ కవయిత్రి రాసిన కవితతో ప్రేమకు అర్థాన్ని చెబుతారు.


"నుదుటిపైన పెట్టే ముద్దు దు:ఖాన్ని పోగొడుతుంది. కళ్ళపైన పెట్టే ముద్దు నిద్ర పుచ్చుతుంది. పెదవులపైన పెట్టే ముద్దు దాహార్తిని తీర్చే నీరులాంటిది. ప్రియా నీ నుదిటిని మళ్ళీ ముద్దాడనీ" మెరీనా ఎంత గొప్పగా రాసింది. ఇవ్వన్నీ స్త్రీల లైంగి క వైవిధ్య వెతలు. ఈ వెతలు పురుషులకు తెలిసినా తెలియనట్టు ఉండిపోతారు. ఇందులో అన్ని వెతలు కొందరు స్త్రీలకు తెలియ కపోవచ్చు. వీటిని చదవడానికే 'మర్యాదస్తులు' బిడియ పడుతుంటే గీతాంజలి వీటిని ఎలా రాయగలిగారు ! గీతాంజలి హైదరాబాదులో డాక్టర్. మానసిక వైద్యురాలు. తన దగ్గరకు వచ్చే అనేకానేక మహిళల వాస్తవ వెతల నుంచే ఈ కథలన్నీ పుట్టుకొచ్చాయి. ఈ కథలను చదువుతుంటే స్త్రీల కష్టాల గురించి కలవరపడిన చలం సాహిత్యం గుర్తుకొస్తుంది. చలం సాహిత్యానికి ఒక శాస్త్రీయతను జోడించి, అభివృద్ధి చేసిన సాహిత్యమే గీతాంజలి కథలనడం అతిశయోక్తి కాదేమో! ❑




చర్చల్లేవ్..

నేను దిగేదే లేదు !









ఎవరు నవ్వినా సరే

కార్టూన్స్ : సతీష్ ఆచార్య


**RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)**


Vol : 2 - Issue No : 9 June 2024




## కొత్త పుస్తకాల స్వీకారం




if undeliverd please return to:
**B.Ramesh Chandra Babu**
34-15-1, Doddipatla Vaari Thota
Veedhi, Tanuku - 534 211
West Godavari, Ap
Phone No : 93971 14495

Printed Matter - Book Post

To :

Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.